
మహిళా గొంతుక

మాతృక


ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) అధికార మాసపత్రిక
MAHILA GONTUKA MATRUKA

సంపుటి : 5 సంచిక : 7 జూన్ : 2019 55 పేజీలు : 48 వెల : 15 రూ.లు



అతడూ - ఆమె

కాట్రాజ్ లావణ్య సైదీశ్వర్



ఆమె ఉనికిని ఇప్పటికీ ఆకాశాన్ని ఆవిష్కరిస్తుంది..
అతడు సగం చీల్చుకుని దేహానికి చుట్టుకుంటాడు

ఆమె కళ్ల కాన్వాస్‌పై ప్రపంచాన్ని చిత్రీకరిస్తుంది
అతడు ఒక నీడను చూపులకు అడ్డుతెర కడతాడు

మైదానాలన్నీ అమె ముందు మోకరిల్లుతాయి
ఆ రెండు పాదాల్నతడు గుమ్మంలో పాతుకున్నాడు..

ఆమె అమృతరాగాలను కొనగోట పలికిస్తుంది..
కొమ్మకొమ్మకు అతడు తన చెవుల్నే కుట్టివుంచాడు..
ప్రవహించే నది ఆమె అంతరంగం
బిందువును చేసి అతను గుప్పిట్లో బంధించి ఉంచాడు

ఆమె మౌనమయ్యింది...
అతడు ఇంకా ఎక్కడో
మాటలను ఏరుకుంటూనేవున్నాడు

ఆమె ఇంకా ఇప్పటికీ ఆకాశంలో సగమే
(ష్ ష్ ష్)

మహిళా గొంతుక

మాతృక

MAHILA GONTUKA MATRUKA

సంపుటి : 5 సంచిక : 7 పేజీలు : 48 జూన్ - 2019

POW

మహిళా సంఘటిత శక్తి
ఉద్యమించే మహిళల ఊపిరి

ఎడిటర్
చొప్పర పద్మ

సంపాదకవర్గం
వి. సంధ్య
ఎన్. విష్ణు
బి. రమాసుందరి

రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడుదాం

ధరణి ఎంటర్ ప్రైజెస్
డిటిపి & డిజైనింగ్
హైదరాబాద్ - 500 044.
సెల్ : 9491875063

ముద్రణ : నవ్య ప్రింటర్స్,
హిమాయత్ నగర్, హైదరాబాద్ - 29

రచనలు, చందాలు పంపవలసిన చిరునామా

మహిళా గొంతుక
మాతృక

ఇం.నెం. 35-3-6931 (4)
కామ్రేడ్ మాదాల నారాయణస్వామి భవన్, సంజయగాంధీ కాలనీ,
శర్మ కాలేజీ దగ్గర,
ఒంగోలు - 523 001
సెల్ : 9676206230
ఫోన్ : 08592 - 238350
e-mail : matruka2015@gmail.com


విషయ సూచిక

మాతృక మాట	: జాతీయోన్మాదం ఆయుధంగా పార్లమెంటును ఆక్రమించిన కాషాయం		4
మేడిపండు	: న్యాయం న్యాయాన్ని మింగితే- కంచే చేనుని మేస్తే?	రమాసుందరి	6
చలం 125వ జయంతి	: కామం, మోహం, ప్రేమ		
	: చలం 'స్త్రీ' పరిచయం	విశాఖ పద్మ	11
పాతసిర	: ఓ పువ్వు పూసింది	చలం	15
నువ్వు నడిచిన దారి	: చీకటి హృదయాలకు ఉపశమనం	పద్మజా షా	19
		తెలుగు అనువాదం : శివలక్ష్మి	
ఆమె అనంతం	: ఆమె నిర్ణయం	తులసి	23
నివాళి	: అరుణోదయ రామారావుకు విప్లవ జోహార్లు		25
ఫోకస్	: ఇష్రత్ జహన్ మరణం - క్రూర మతరాజకీయాలు	రమాసుందరి	26
తెర	: ఏ గుర్తింపూ లేని జీవితాల కథలు రెండు- ఐ.డి., లైయర్స్ డైస్	ల.లి.త	33
కతలు వెతలు	: ఈ ...	బమ్మిడి జగదీశ్వరరావు	36
సమకాలీనం	: అడవుల నుండి ఆదివాసీల గెంటివేతే లక్ష్యం	వి. సంధ్య	39
వివక్ష	: చరిత్ర పునరావృతం	వంగపల్లి పద్మ	42
ఉద్యమ గమనం	:		46
గుండె చప్పుడు	: మురళి కవిత		2
	: లావణ్య కవిత		3
ముఖచిత్రం	: శశి		1
ముఖచిత్ర పంక్తులు	: రమాసుందరి		1
ముఖచిత్ర డిజైన్	: ధరణి		

గత సంచికలో సవరణ : -

చీకటి హృదయాలకు ఉపశమనం అనే వ్యాసంలో

కృష్ణ భరద్వాజ్, సుధా భరద్వాజ్ తండ్రి అని ప్రచురించాము.
కృష్ణ భరద్వాజ్ సుధ భరద్వాజ్ తల్లిగా గుర్తించాలని పాఠకులను కోరుతున్నాము. అసౌకర్యానికి చింతిస్తున్నాము.



మాతృక మాట

జాతీయోన్మాదం ఆయుధంగా పార్లమెంటును ఆక్రమించిన కాషాయం

ఏడు దశాబ్దాల భారత ప్రజాస్వామ్యం రోజురోజుకి దిగజారి ప్రజలమీద విశ్వాసం సన్నగిల్లి కులం, మతం, మందు, డబ్బుపై ఆధారపడి ఊపిరి పీల్చుకుంటున్న స్థితిని నేడు మనం చూస్తున్నాం. ఏడు విడతలుగా జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ అత్యధికసీట్లు సంపాదించుకొని అధికారపీఠం మరోసారి ఎక్కబోతోంది. గత ఐదు సంవత్సరాలుగా మోదీ అనుసరించిన విధానాల ఫలితంగా గతం కంటే ఓట్లూ, సీట్లు తగ్గుతాయని, అందరూ భావించిన తరుణంలో అనూహ్యంగా ఎన్.డి.ఏ సీట్లు పెరిగాయి. బిజెపి గెలుపు భారతీయుడి గెలుపని, ఇది ప్రజాస్వామ్య ఉత్సవమని మోదీ ఎంతగా జబ్బ చరుచుకున్నా, అది వాస్తవం మాత్రం కాదు. ఇది ముమ్మాటికీ దేశభక్తి ఉన్మాదం, కార్పోరేట్ల సహకారం, హిందూత్వ ప్రచారపు పరాకాష్టలతో గెలవడమే.

ప్రజాస్వామ్యం అంటే ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపడం, పోలింగ్, కౌంటింగ్ పూర్తి చేసి ఎన్నికను ప్రకటించడం కాదు. ప్రజల భాగస్వామ్యం, వారి అభిప్రాయాలకు చోటు వుండాలి. గత ఐదు సంవత్సరాల పాలనపై ప్రజల్లో చర్చ జరగాలి. ఇచ్చిన హామీల అమలుపై చర్చ జరగాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలి. రైతుల ఊపిరి తీస్తున్న వ్యవసాయ సంక్షోభం, బ్రతుకుదెరువు కోసం వలసెత్తుతున్న కూలీలు, హరించబడుతున్న కార్మికుల హక్కులు, నల్లధనాన్ని వెలికితీయలేని పెద్దనోట్లురద్దు, జిఎస్‌టి, రఫేల్ కుంభకోణం, నిత్యం పెరుగుతున్న ఆయిల్‌ధరలు, అన్నింటి కంటే మైనారిటీలపై, దళితులపై జరుగుతున్న మూకదాడులు, హత్యలు తదితర అనేక సమస్యపై చర్చ జరగాలి. ప్రజల అభిప్రాయాలు, ఆమోదం కోరాలి. అలా కాకుండా ప్రజల్లో ఉద్వేగాన్ని, ఉద్రేకాల్ని రెచ్చగొట్టడం, ఆవేశకావేశాల్ని రగిల్చడం, అసలు సమస్యల్ని తప్పించడం, లేని సమస్యలను ప్రధానం చేయడం ప్రజల ఆవేశాల్ని ఓట్లుగా మలుచుకోవడం ప్రజాస్వామ్య పండుగ అనిపించుకోదు.

నిజానికి గత ఐదు సంవత్సరాల పాలనలో మోదీ గ్రాఫ్ క్రమంగా పడిపోతూ వుంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక పవనాలు వీచాయి. ఈ నష్టాన్ని భర్తీ చేయడానికి బిజెపి నాయకత్వం వెంటనే మరమ్మత్తులు చేపట్టింది. అగ్రకులాల ఓట్లను కొల్లగొట్టుకోవడానికి ఓబిసిలకు 10శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో ఆమోదింపచేసుచేసుకోవడం, తాత్కాలిక బడ్జెట్‌కు బదులు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి వరాల వర్షం కురిపించడం, 8లక్షల వరకు పన్నులేకుండా చేయడం తదితర ఉపశమన చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పు పేరిట రామమందిర నిర్మాణాన్ని "మధ్యవర్తుల కమిటీ"కి అప్పగించి ఉత్తర భారత దేశంలో హిందూ మతోన్మాదంతో వున్న సెక్షన్ల ఓట్లు కొల్లగొట్టడానికి పథకం వేసింది. పుల్వామా దగ్గర జరిగిన మానవబాంబు విస్ఫోటనాన్ని అడ్డం పెట్టుకొని పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాదుల శిబిరాల విధ్వంసం పేరిట విమాన దాడులు సాగించింది. ఈ దాడులతో దేశభక్తి ఉన్మాదాన్ని సృష్టించడానికి పాకిస్తాన్ వ్యతిరేక, కాశ్మీర్ వ్యతిరేక, ముస్లిం వ్యతిరేక ప్రచారానికి తెరలేపింది. వీటినే తమ ఎన్నికల ఆయుధాలుగా మలుచుకొని మోదీ, అమిత్ షా ఏకపక్ష యుద్ధానికి దిగారు. హిందువులు ఆత్మగౌరవాన్ని మోదీ మాత్రమే కాపాడగలరని, పాకిస్తాన్ నుంచి, ముస్లింల నుంచి హిందువుల ప్రయోజనాలను రక్షించేది బిజెపియేనని గట్టిగా ప్రజలు నమ్మే విధంగా రెచ్చగొట్టి ప్రచారం చేసుకోగలిగారు.

రెండోవైపు రాజ్యాంగవ్యవస్థలైన సి.బి.ఐ, సి.వి.సి, ఇడి, సి.ఇ.సి, సుప్రీంకోర్టుతో సహా అన్నింటిని తమ జేబు సంస్థలుగా బిజెపి ఉపయోగించుకున్నది. ప్రతిపక్ష నాయకుల ఇళ్ళపైనా, వ్యాపార సంస్థలపైనా దాడులు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేసింది. పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల్లో తమ సీట్లను పెంచుకోవడానికి ఇంటలిజన్స్ అధికారులను, డి.జి.పి.లను బదిలీచేసి, సైన్యాన్ని కూడా పెద్ద ఎత్తున రప్పించి కొన్ని సీట్లు సాధించడానికి అన్నిరకాలుగా ప్రయత్నించింది. కొన్ని సీట్లు పెంచుకోగలిగింది. బిజెపి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి జాతీయవాదాన్ని, కుల సమీకరణల్ని, పౌరసత్వ సమస్యను, ఏది ఎక్కడ ఎలా అవసరమైతే అలా ఉపయోగించుకున్నది.

యు.పి.లో బి.ఎస్.పి-ఎస్.పి.లు కాంగ్రెసుతో కలవకుండా ఫ్రంటు కట్టినందువల్ల అక్కడ బిజెపి తన స్థానాలను గణనీయంగా నిలబెట్టుకుంది. కాంగ్రెసు పాలిత రాష్ట్రాల్లో కూడా తమ స్థానాలను కాంగ్రెసు నిలుపుకోలేకపోయింది. బిజెపి తిరిగి రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో తన స్థానాలను నిలబెట్టుకోవడమే కాకుండా ఒరిస్సా, బెంగాల్‌లో అదనంగా స్థానాలు సంపాదించింది. తెలంగాణాలో చంద్రశేఖర్ ప్రభుత్వానికి 9 పార్లమెంటు స్థానాలే దక్కాయి. బిజెపి నాలుగుస్థానాలను, కాంగ్రెసు మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఆంధ్రలో వై.ఎస్.ఆర్.పార్టీ 151 అసెంబ్లీ, 22 పార్లమెంటు స్థానాలను పొందింది. తెలుగుదేశం మూడుస్థానాలకు పరిమితమైంది. కర్నాటకలో కాంగ్రెసు, జె.డి.ఎస్.ల మధ్య విభేధాలు బిజెపి బలపడటానికి తోడ్పడ్డాయి. బిజెపి 19 రాష్ట్రాలకు విస్తరించింది. సి.పి.ఎం. బెంగాల్‌లో, కేరళలో ఘోరంగా ఓటమి పొందింది. బెంగాల్‌లో సి.పి.ఎం.ఓట్లు బిజెపికి ట్రాన్స్‌ఫర్ కావడంతో బిజెపి 18స్థానాలు గెలుపొందింది. ప్రతిపక్షాలు ఐక్యంగా లేకపోవడం, మోదీకి ప్రత్యామ్నాయ ఎజండా ప్రతిపక్షాల దగ్గర లేకపోవడం తదితర అనేక కారణాలతో ఘోరంగా ఓటమి చవిచూశాయి.

17వ లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరిగడం ఒక విశేషం. ఈ ఎన్నికల్లో 542 పార్లమెంటు స్థానాలకు గానూ 724 మంది మహిళలు పోటీలో నిలబడ్డారు. వివిధ పార్టీల నుండి 78 మంది మహిళలు ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. 16వ లోక్‌సభలో మహిళా ఎం.పి.ల సంఖ్య 64 వుండగా ఈ సభలో ఆ సంఖ్య 78కి అంటే 14శాతం పెరిగింది. బిజెపి 53మంది మహిళలకు, కాంగ్రెసు 54 మంది మహిళలకు సీట్లు కేటాయించింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి చెరి 11 మంది మహిళా పార్లమెంటు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1952 నుంచి పార్లమెంటులో క్రమేణా మహిళా ప్రాతినిధ్యం పెరుగుతున్నా అర్ధప్రపంచం కోరుకుంటున్న 33శాతానికి చేరడంలేదు. 243 స్థానాలు కలిగిన రాజ్యసభలోనూ మహిళా ప్రతినిధులు 31 మంది మాత్రమే.

పితృస్వామ్య వ్యవస్థ, సామాజిక కట్టుబాట్లు, మహిళల సామర్థ్యం పూర్తిస్థాయిలో వెలికిరాకుండా అడ్డుకుంటున్నాయని గతంలో రాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేసారు. మహిళల ప్రాతినిధ్యం పరంగా 193దేశాల జాబితాలో భారతదేశం 152వస్థానంలో వున్నది. మనకంటే పొరుగునవున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మహిళల ప్రాతినిధ్యం అధికంగా వుందంటే ఆశ్చర్యం వేయకమానదు. ఏ.పి. తమిళనాడుతో సహా 13రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పురుషులకన్నా మహిళా ఓటర్లే ఎక్కువ అయినా వారికి ప్రాతినిధ్యం చాలా తక్కువ. ఒరిస్సాలో బిజూ జనతాదళ్ తనంత తానుగా 33శాతం కోటా ఆరంభించి అమలు చేస్తానన్నాడు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెసు మహిళలకు 40శాతం సీట్లను కేటాయించింది. ఛత్తీస్‌ఘడ్, కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు వంటివి అబ్బురపరిచేవిధంగా 50 శాతంసీట్లను స్త్రీలకు కేటాయించింది. పార్లమెంటులో, రాజ్యసభలో, శాసన సభల్లో మహిళలకు సీట్లు కేటాయించడం, పెరగడం మంచిదే సందేహంలేదు. కాని మహిళైనా, పురుషులైనా వారు తీసుకునే రాజకీయ విధానాలు అన్నింటికంటే ముఖ్యమైనవి. గాడ్సేను నెత్తుకెత్తుకున్న సాధువు ప్రజ్ఞాసింగ్ ఠాగూర్, రోహిత్ వేముల మరణానికి కారకురాలనే ఆరోపణలు ఎదుర్కొంటున్న స్మృతి ఇరానీ లాంటి వారు ఈ పార్లమెంటుకు ఎన్నికకావడం ప్రమాద సంకేతాలను అందిస్తుంది.

ఎన్నికల అనంతరం రాబోయే రోజులు ప్రమాదకరంగా మారబోతున్నాయి. ఇప్పటి వరకు పేరుకైనా వున్న వ్యవస్థలు రాజ్యాధినేతల జేబుసంస్థలుగా మారడం చూస్తున్నాం. నామమాత్రంగా వున్న లౌకిక, గణతంత్ర రాజ్యం హిందూ రాజ్యంగా మారుస్తున్న తీరుతెన్నులు గమనిస్తున్నాం. దళితులు, మైనారిటీలకు అభద్రత పెరుగుతుంది. కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర కాంక్ష అణచివేస్తూ తీవ్రవాదం పేరిట జాతి హననానికి పాల్పడుతున్నారు. అసమ్మతిని వ్యక్తం చేసిన పౌరహక్కుల నాయకులను, కవులను అర్బన్ నక్సల్స్ పేరుతో రాజ్యం జైళ్లలో నిర్బంధిస్తుంది. రకరకాల పేర్లతో బెయిల్స్ నిరాకరిస్తున్నారు. విడుదలైనప్పటికీ కొత్తకేసుల్లో ఇరికిస్తున్నారు. దళితులు, ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ కోర్టు తీర్పులు వెలువడుతున్నాయి. వనరులు, సహజ సంపద కార్పోరేట్‌శక్తుల పరం అవుతోంది. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటుపరం అవుతున్నాయి. ఉపాధి ఎండమావులై నిరుద్యోగం ప్రబలిపోతుంది. విశ్వవిద్యాలయాల మొదలు అన్ని రంగాల్లో హిందూ బ్రాహ్మణీయ శక్తుల ఆధిపత్యం పెరుగుతోంది. మూఢవిశ్వాసాలను పాలకులే పెంచి పోషిస్తున్నారు. ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ స్థితిలో పోరాడేశక్తులు ప్రజలు కేంద్రంగా ఉద్యమాలు చేపట్టాలి. పెరుగుతున్న ఫాసిస్టు ప్రమాదాన్ని గుర్తెరిగి విశాల దృష్టితో ప్రజలను సమీకరించి ఐక్య ఉద్యమాలు నిర్మించాలి, ప్రతిఘటనోద్యమాల్ని నిర్మించాలి. ❁

మేడిపండు

న్యాయం న్యాయాన్ని మింగితే - కంచే చేనును మేస్తే?

— రమాసుందరి



మెజారిటీ భారత ప్రజలు అత్యంత గౌరవించి, భయపడే వ్యవస్థ న్యాయవ్యవస్థ. ఈ వ్యవస్థ చెప్పే న్యాయాలను భారత ప్రజలు తమ జీవన విధానంలో నైతికానైతిక నిర్ధారణలుగా మార్చుకొంటారు. ఈ కోర్టులు చేసే వ్యాఖ్యానాలను సూక్తి ముక్తావళిగా నిత్యం మననం చేసుకొని మనసుకు ఇంకింప చేసుకొంటారు. ఆ స్థాయి, స్థితి న్యాయవ్యవస్థకు ఉన్నా, లేకపోయినా - ఉండాలనే సాధారణ ప్రజల కోరిక, ఉన్నట్లుగా భ్రమింపచేసే దాని పటాటోపం - సామాన్య ప్రజలకు అర్ధం కానివ్వని వ్యవహారాలు - వెరసి భారత న్యాయ వ్యవస్థ ఇప్పటికీ అత్యున్నత గౌరవాన్నిఅందుకొంటున్నది. 'అన్యాయపు' దెబ్బలు దాని చేతిలో నిరంతరం తింటున్నా, దాని చేతి వేళ్ల విదిలింపులలోనైనా ఒకింత ధర్మాన్ని, న్యాయాన్ని ఒడిసి పట్టుకోవాలని ఇక్కడ అన్ని హక్కులూ తిరస్కరింపబడిన బడుగు ప్రజలు ప్రయత్నిస్తారు. కానీ భారత న్యాయానికి అన్ని అవలక్షణాలు ఉన్నాయి. దానికి ధన కుల పక్షపాతాలు ఉన్నాయి.

భారత ప్రధాన న్యాయమూర్తి పై వచ్చిన లైంగిక వేధింపు ఆరోపణలు

వీటన్నిటితో పాటు న్యాయ స్థానానికి పితృస్వామిక దురహంకారం కూడా ఉంది. ఆ దురహంకారానికి బలి అయిన ఒక బడుగు మహిళా ఉద్యోగి ఇటీవల బయటకు వచ్చి తనపై జరిగిన లైంగిక వేధింపుల గురించే కాకుండా, తదనంతరం తనపై ప్రయోగించిన భౌతిక, మానసిక హింసల గురించీ, పోలీసు వేధింపుల గురించీ అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ అఫిడవిట్ కాపీలను సుప్రీం కోర్టులో ఉన్న 22మంది సిట్టింగ్ జడ్జిలకు పంపించి న్యాయం అర్ధించటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

దేశపు అత్యున్నత న్యాయసంస్థ అయిన సుప్రీం కోర్టుకు సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి (Chief Justice of India, CJI) రంజన్ గొగోయి మీద వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదురాలు వివరించినట్లుగా ఆమెపై జరిగిన కక్ష సాధింపు చర్యలు, ఆరోపణలు చేశాక మొత్తం న్యాయవ్యవస్థ న్యాయాతీతంగా వ్యవహరించిన తీరు- ఇవ్వన్నీ మన న్యాయవ్యవస్థ డొల్లతనాన్ని వెల్లడి చేస్తాయి. బాధితురాలు 2018 డిశంబర్ వరకూ అక్కడ పని చేసే చిరుద్యోగి. ఇప్పుడు ఉద్యోగాన్ని పోగొట్టుకొని, పోలీసు కేసులు, జైలు రిమాండ్‌లతో భయానక వేధింపులను ఎదుర్కొంటోంది. భారతదేశ సర్వోన్నత న్యాయమూర్తి తన సర్వోన్నత అధికారాలను, వివిధ సంస్థల మీద తనకున్న పట్టును ఉపయోగించుకొని, తనను నిరాకరించిన మహిళను, ఆమె కుటుంబాన్ని సర్వ నాశనం చేయటానికి కంకణం కట్టుకొన్న భీతి కలిగించే వాస్తవ కథనాన్ని ఇప్పుడు చదవబోతున్నాం.

'ద కారవాన్' అనే ఆంగ్ల పత్రికలో ఆమె సమర్పించిన అఫిడవిట్ సారాంశం మొత్తం ప్రచురితమైయ్యింది. అఫిడవిట్ అంటే ఒక విషయాన్ని నిర్ధారిస్తూ సదరు వ్యక్తి ఇచ్చే స్టేట్‌మెంట్. ఒక రకంగా అది చట్టపరమైన ప్రమాణంగా భావించవచ్చు. కోర్టు కోరితే దాన్ని కోర్టులో సాక్ష్యంగా కూడా ఉపయోగించవచ్చు. ఒక వేళ అఫిడవిట్‌లో ఇచ్చిన స్టేట్‌మెంట్ అబద్ధమని తేలితే ఆ వ్యక్తి శిక్షార్హుడు కూడా అవుతాడు. అలాంటి అఫిడవిట్‌ను ఆమె ప్రధాన న్యాయమూర్తి మీద ఆరోపణలతో సమర్పించింది. ఇప్పటి వరకూ తనకు జరిగిన నష్టం గురించి కాకుండా, భవిష్యత్‌లో ఆయన తన జోలికి రాకుండా

ఉండటానికే ఆ అఫిడివిట్‌ను సమర్పించానని ఆమె చెప్పటం విశేషం.

'ద కారవాన్' పత్రిక ఆమెను 'మాజీ కోర్టు ఉద్యోగిని' సంబోధించింది. ఇక్కడ కూడా ఆమెను అదే పేరుతో పిలుద్దాం. ఆమె అఫిడివిట్‌లో రాసిన దాని ప్రకారం 'మాజీ కోర్టు ఉద్యోగిని' సుప్రీం కోర్టులో 2014 మే నెలలో ఉద్యోగంలో చేరింది. ఆమె పనులు పత్రాలను టైప్ చేయటం, కోర్టు గదులకు అవసరమైన జడ్జిమెంట్ కాపీలను అందచేయటం లాంటివి. అక్టోబర్ 2016లో ఆమె రంజన్ గొగోయి కోర్టులో నియమితురాలు అయ్యింది. అప్పటికి ఆయన ఇంకా ప్రధాన న్యాయమూర్తి కాలేదు. గొగోయి ఆమెను ప్రత్యేకంగా మెచ్చుకోవడం, ఆమె కుటుంబ జీవితం గురించి పరామర్శించడం కూడా ఆమె మొదట్లో ఎంతో అదృష్టంగా భావించేది. ఏవో జడ్జిమెంట్ కాపీలు కావాలంటూ ఆమెకు గొగోయి నుండి ఫోనులు వస్తుండేవి. ఆ పత్రాలు తీసుకొని ఆమె ఆయన ఛాంబర్‌కు తరచూ వెళ్లాల్సి వచ్చేది. తరువాత ఆయన కోర్టు సమయం తరువాత కూడా ఆమెకు ఫోన్ చేసేవాడు. ఆమెకు తన వ్యక్తిగత నంబర్ యిచ్చి వాట్స్అప్ ద్వారా సంభాషణ చేసేవాడు. మొదట్లో కుటుంబ క్షేమ సమాచారాలతో మొదలయ్యి ఆమెకు వ్యక్తిగత సలహాలు ఇవ్వటం వరకూ వచ్చింది. ఆగస్ట్ 2018 నుండి ఆమె ఆయన ఇంటి ఆఫీసులో పని చేయటం మొదలు పెట్టింది. ఆయన ఇంట్లో ఉన్నంత సేపు ఆమెకు నాలుగు ఐదు సార్లు ఆయన నుంచి పిలుపులు వచ్చేవి. ఆమె ఫోన్‌లో ఆయన చేసిన కాల్స్‌ను డిలీట్ చేయమని అడగటమే కాకుండా, చేసిందో లేదోనని ఆమె ఫోన్ తీసుకొని చెక్ చేసుకొనేవాడు. పొద్దున్నే గుడ్ మార్నింగ్ మెసేజ్ పెట్టమనీ, ఇంటికి చేరాక చేరినట్లు మెసేజ్ పెట్టమనీ కోరేవాడు. ఆయన ప్రధాన న్యాయమూర్తిగా నియామకం అయ్యాక కూడా; తన భార్య, కూతురితో పాటు ఆమె కూడా తనకొక నిధి అంటూ ఆమె పనిని ఎక్కువగా పొగిడేవాడు. వికలాంగుడైన ఆమె మరిదికి, తనకు కేటాయించిన ప్రత్యేక కోటా నుండి కోర్టు ఉద్యోగం కూడా ఇప్పించాడు. నిబంధనలను కొద్దిగా అతిక్రమించి ఆ ఉద్యోగం ఇప్పించానని కూడా ఆమెతో చెప్పుకొన్నాడు. ఆమె పదే పదే ఆయనకు ధన్యవాదాలు చెప్పుకొన్నది.

అదే రోజు ఆమె ధరించిన దుస్తులను ప్రత్యేకంగా పొగిడాడు. ఆమెకు ఒనగూర్చిన ప్రయోజనానికి ప్రతిఫలంగా 'తనకు ఏమి ఇస్తావ్?' అని ఆమెను ప్రశ్నించాడు. అప్పుడే ఆమె శరీర అవయవాలను అతను తాకటంతో ఆమె ఖిన్నురాలు అయ్యింది. మరుసటి రోజు గొగోయి మళ్లీ ఆమెను తన ఆఫీసుకు పిలిచి మళ్లీ అదే ప్రశ్న వేశాడు. నడుము చుట్టూ చేతులు వేసి బంధించి, ఆయనను హత్తుకోమని కోరాడు. ఈ దేశపు ప్రధాన న్యాయమూర్తి ఒక బడుగు ఉద్యోగిని తాకుతూ 'నాకు కావాల్సింది ఇది' అని తేల్చేశాడు.

తప్పించుకోవటానికి ఆమె అతడిని గట్టిగా తోసివేసింది. ఆమె బలానికి అతని తల పక్కన కాబినెట్‌కు కొట్టుకొన్నది. 64 సంవత్సరాల వయసు కలిగి, ఉన్నత బాధ్యతాయుత స్థానంలో ఉన్న వ్యక్తి, ఆయన కంటే కొన్ని దశాబ్దాల వయసు తక్కువ ఉన్న ఆమెతో



అలా ప్రవర్తించటం ఆమె ఏ మాత్రం ఊహించలేదు. కొద్ది సేపటి తరువాత గొగోయి ఆమెను తన రూమ్‌కి పిలిచి 'ఇక్కడ జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పొద్దు. అలా చెబితే నీ కుటుంబం అల్లకల్లోలం అయిపోతుంది.' అని హెచ్చరించాడు. భయభ్రాంతులతో ఆమె దానికి వెంటనే ఒప్పుకొన్నది. తరువాత అతను ఇచ్చిన డిక్టేషన్‌లో 'మీ గౌరవానికి నేను భంగం కలిగించను. నన్ను హత్తుకొంటారా?' అని ఆమె రాయించ ప్రయత్నించాడు. అంటే 'ఆమే ఆయనను హత్తుకోవటానికి ప్రయత్నించింది' అన్నట్లుగా రాతపూర్వకంగా ఋజువు సృష్టించటానికి ప్రయత్నించాడని అర్థం అయినా కూడా ఆమె ఆయన కోరినట్లే రాసి యిచ్చింది.

తరువాత ఆమె కష్టాలు మొదలైయ్యాయి. ఆమె నిరాకరణతో అభద్రతా భావానికి గురి అయిన న్యాయమూర్తి ఎన్ని చేయాలో అన్ని చేశాడు. ఆ రోజు రాత్రి ఇక తను ఆయన వద్ద పని చేయలేనని నిర్ణయించుకొని ఆయనకు ఆ విషయం ఫోన్ ద్వారా చెప్పటానికి ప్రయత్నం చేసింది. న్యాయమూర్తి పర్సనల్ సెక్రటరీ ఆమెకు ఫోన్ చేసి అంత రాత్రప్పుడు న్యాయమూర్తికి ఫోన్ చేయకూడదని చెప్పాడు. ఆ రోజు నుండి రంజన్ గొగోయ్ ఆమెను తన గదికి పిలిచినప్పుడు, ఎవరో ఒకరు దగ్గర ఉండేటట్లు చూసుకొన్నాడు. ఒక్కరోజులో ఆమె బాధితురాలిగా మారిపోవాల్సి వచ్చింది. ఆమె మీద వేధింపుల పర్వం ప్రారంభం అయ్యింది. అక్టోబర్ 22, కోర్టు దసరా సెలవల తరువాత ఆమెను అక్కడ నుండి బదిలీ చేశారు. అలా ఆమెకు తక్కువ వ్యవధిలోనే చాలా విభాగాలకు బదిలీలు జరిగాయి. మధ్యలో ఆమెను రంజన్ గొగోయి పిలిపించి మళ్లీ తన ఆఫీసులో పని చేస్తావా అని కూడా అడిగాడు. ఆమె చాలా స్థిరంగా 'ఇప్పుడు నేను పని చేస్తున్న చోటే నాకు బాగుంది' అని సమాధానం ఇచ్చింది.

తరువాత ఆమెపై వేధింపులు ఉధృతం అయ్యాయి. ఒక శనివారం సగం రోజు సెలవు పెట్టుకొన్నందుకు, సాంకేతిక కారణాలు చెబుతూ, ఆమెకు మెమో ఇచ్చారు. దానికి ఆమె వివరణ ఇచ్చుకొన్నది. మళ్లీ నాలుగు రోజులకు, ఆమె సమాధానం సంతృప్తికరంగా లేదని చెబుతూ ఇంకో మెమో ఇచ్చారు. ఒక రోజు తరువాత ఆమెకు సస్పెన్షన్ ఆర్డర్లు అందాయి. అంటే అధికార ప్రవర్తనా నియమావళిని జాగ్రత్తగా ఉపయోగించే ఆమెను సస్పెండ్ చేశారు. అయితే ఆ నియమావళిని ఎలా అన్వయించారనేది వేరే విషయం. డిశంబర్ 17న ఆమెపై డిపార్ట్మెంటల్ విచారణ జరుగుతుందని, దానికి ఆమె హాజరు కావాలని, ఆమెకు ఆదేశాలు

అందాయి. సూర్య ప్రతాప్ సింగ్ అనే రిజిస్ట్రార్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆమెకిచ్చిన పాస్ అందుకొని ఆమె కోర్టులోకి ప్రవేశించింది. అయితే విచారణాధికారి గది ముందు కూర్చొని ఉండగానే ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను వెంటనే హాస్పిటల్‌లో చేర్పించారు. విచారణకు హాజరు అవనందున ఆమెను ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు మరుసటి రోజు ఆమె సమాచార పత్రాన్ని అందుకొన్నది. విచారణలో ఆమె తరపున హాజరు అవాల్సిన లాయరుకు కూడా అనుమతి దొరకలేదు.

ఆమె కష్టాలు అంతటితో తీరలేదు. గత డిశంబర్‌లో ఢిల్లీ పోలీసు శాఖలో పని చేస్తున్న ఆమె భర్త, అతని తమ్ముడు సస్పెన్షన్ ఆదేశాలు అందుకొన్నారు. ఆ సస్పెన్షన్‌కి ఎలాంటి కారణాలు చూపించలేదు. 'పై నుండి వత్తిడి వచ్చింది' అనే సమాధానమే అనధికారికంగా వచ్చింది. ఆ సమయంలో గత్యంతరం లేని పరిస్థితిలో గొగోయితో ఒక మీటింగ్ ఏర్పాటు చేయమని ఆమె భర్త సుప్రీం కోర్టులో ఒక సీనియర్ అధికారిని బతిమలాడుకొన్నాడు. 'మా జీవితాలు సర్వ నాశనం అయ్యాయి' అని చెప్పుకొన్నాడు. ఆ అధికారి అంగీకరించక పోవటమే కాకుండా, ఆమె భర్త తనతో మళ్లీ మాట్లాడకుండా ఆయన నంబర్‌ని బ్లాక్ చేశాడు. జనవరి 2న, మాజీ కోర్టు ఉద్యోగిని భర్త డిపార్ట్మెంటల్ క్రమశిక్షణా చర్యకు గురి కాబోతున్నట్లు ఆదేశాలు అందుకొన్నాడు. అందుకు వారు చెప్పిన కారణం ప్రధాన న్యాయమూర్తికి అనవసరమైన ఫోనులు చేస్తున్నాడనే. జనవరి 9న, మాజీ కోర్టు ఉద్యోగిని భర్తకి, అతని తమ్ముడికి గాంబ్లర్లతో సంబంధాలు ఉన్నాయని ఇంకో ఆర్డర్ వచ్చింది. 2012లో వారిపై నమోదు అయిన పాత కేసు ప్రస్తావన చేస్తూ, ఆ కారణం చేత వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

జనవరి 10న మాజీ కోర్టు ఉద్యోగిని భర్తకు స్థానిక తిలక్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ నరేశ్ సోలంకి నుండి ఫోన్ వచ్చింది. ఆయన గొగోయికి క్షమాపణ చెప్పమని సలహా ఇచ్చాడు. నిస్సహాయ స్థితిలో ఉన్న మాజీ కోర్టు ఉద్యోగిని భర్త 'చేతులు జోడించి క్షమాపణ చెబుతాము' అని చెప్పాడు. సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ జైన్ సాదా దుస్తుల్లో ఆ దంపతులను తన ప్రైవేట్ వాహనంలో గొగోయి నివాసానికి తీసుకొని వెళ్లాడు. అక్కడ గొగోయి భార్య ఉన్నది. 'ముక్కు నేల మీద రాసి వెళ్లు' అని మాజీ కోర్టు ఉద్యోగినితో చెప్పిందావిడ. తనని, తన కుటుంబాన్ని రక్షించుకోవటానికి మాజీ కోర్టు ఉద్యోగిని ఆమె కాళ్ల మీద పడి ఆమె ముక్కుని గొగోయి భార్య పాదాలకు రాసింది. క్షమాపణలు చెప్పి ఆ దంపతులు ఆ ఇల్లు వదిలి వచ్చారు. 'మీరు సిట్టింగ్ ప్రధాన న్యాయమూర్తితో వ్యవహరిస్తున్నారు. ఈ విషయాలు ఎవరికైనా చెబితే ఎవరూ మీ మాట నమ్మరు' అని తిలక్ నగర్ సిఐ సోలంకి వారిని హెచ్చరించాడు. ఆయనతో జరిగిన సంభాషణలో ఆ దంపతులు తాము సహాయం కోసం బీజేపీ మాజీ సెక్రెటరీ సంజయ్ జోషి దగ్గరకు వెళ్లామని చెప్పారు. సంజయ్ జోషి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఫోన్ చేశాడని కూడా చెప్పారు. సంజయ్ జోషి సహాయం ఏమీ చేయకపోగా, ఆ దంపతులు ఆ విషయాన్ని సిఐతో చెప్పటం వలన వారి కష్టాలు ఇంకా పెరిగాయి. జనవరి 14న గొగోయి ఉద్యోగం ఇప్పించిన మాజీ కోర్టు ఉద్యోగిని ఇంకో మరిదిని కూడా ఉద్యోగం నుండి తొలగించారు.

తరువాత రెండు నెలలు వారికి ఇంకా కఠినంగా గడిచాయి. ఆమె ప్రధాన న్యాయమూర్తి ఇంటి ఆఫీసు నుండి రహస్య సమాచారాన్ని ఆమె భర్తకు అందచేసిందనే పుకార్లు సుప్రీం కోర్టులో వచ్చాయి. ఆమె గొగోయి భార్యకు క్షమాపణ చెప్పిన యాభై రోజులకు ఆమె మీద తిలక్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఒక ఎఫ్ఐయ్యార్ రిజిస్టర్ అయ్యింది. నవీన్‌కుమార్ అనే హర్యానా వ్యక్తికి, కోర్టులో ఉద్యోగం ఇప్పించటానికి 10లక్షలు లంచం అడిగిందనీ, అడ్వాన్సుగా 50000 రూపాయలు తీసుకొన్నదని కేసు పెట్టాడు. ఒక వేళ ఆమె లంచం తీసుకొన్నా, లంచం ఇచ్చినందుకు నవీన్‌కుమార్ మీద ఎలాంటి కేసూ లేదు. ద కారవాన్ పత్రికలో ఈ వ్యాసం రాసిన విలేకరులు అతుల్ దేవ్, నితిక సక్సేనాలు నవీన్‌కుమార్‌ను కలవగా అతను చాలా భయపడుతున్నాడనీ, చాలా టెన్షన్‌గా ఉందని చెప్పాడని రాశారు.

మార్చ్ 8న ఆమె మొత్తం కుటుంబం రాజస్తాన్‌లోని వారి గ్రామంలో ఉండగా ఒక పోలీస్ బృందం వచ్చి వారిని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. మరుసటి రోజు ఆమె హాస్పిటల్‌కు వెళ్లి రాగానే ఆమె ఇంట్లో పోలీసులు ఆమె భర్త చేతులకు సంకెళ్లు వేసి ఉన్నారు. మాజీ కోర్టు ఉద్యోగినీ, ఆమె వదినను వారి పిరుదుల మీద తోస్తూ జీపు ఎక్కించారు. వారు ముగ్గురిని తిలక్ నగర్ పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాలు లేని దారిలో తీసుకొని వెళ్లారు. మాజీ కోర్టు ఉద్యోగిని కూర్చోన్న చోటే ఆమె కాళ్లకూ, బెంచికి సంకెళ్లు వేశారు. సిఐ పదేపదే 'నువ్వు ఏమి చేయటానికి ప్రధాన న్యాయమూర్తి గదిలోకి వెళ్లావు?' అని అడిగాడు. లాకప్పు రూములో మళ్లీ ఆమెకు సంకెళ్లు వేసి కూర్చోపెట్టారు. పలుమార్లు ఇంటరాగేషన్ చేసిన తరువాత మధ్యాహ్నం 2 గంటలకు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. ఆమెకు మూడు రోజులు పోలీసు కస్టడీ కావాలని మేజిస్ట్రేట్‌ను పోలీసులు అడిగారు. మేజిస్ట్రేట్ ఒక్క రోజు ఇచ్చాడు. పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ లాక్కొన్నారు. తరువాత ఆమెకు 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించి, తీహార్ జైలుకు తరలించారు. పోలీసులు వ్యతిరేకించినప్పటికీ మేజిస్ట్రేట్ ఆమెకు మార్చ్ 12న బెయిల్ ఇచ్చాడు. ఆమె కేసును క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. ఆమె బెయిల్ కాన్సిల్ చేయాలని విచారణాధికారి పిటిషన్ వేయగా అది ఇంకా విచారణకు రాలేదు.

తరువాత మాజీ కోర్టు ఉద్యోగినీ, ఆమె భర్త వారిపై జరిగిన వేధింపులు, చట్ట వ్యతిరేక ప్రవర్తన గురించి ఢిల్లీ మహిళా కమీషన్‌కీ, జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికీ తీసుకొని వచ్చారు. ఇటీవల మానవ హక్కుల కమీషన్ ఆ అభియోగాన్ని కొట్టి వేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర్ మోడీకి, హోమ్ మినిస్టర్ రాజ్‌నాథ్ సింగ్‌కీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కెజ్రీవాల్‌కీ, లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌కీ ఉత్తరాలు రాశారు. 'ఎక్కడో ఒక దగ్గర విషయం ఆగాలి కదా. నా ఉద్యోగం నాకు వెనక్కి రానవసరం లేదు. నాకు ఇంకేమీ అక్కర లేదు. ఈ వేధింపులు ఆగిపోవాలి. అంతే'

అంటుందామె. సుప్రీం కోర్టు నుండి ఆమెకు వచ్చిన ఊహించిన సమాధానమే వచ్చింది. లీఫ్ లెట్, ద వైర్, కారవాన్, స్క్రోల్ ఇన్- ఈ నాలుగు మీడియా హౌసుల కోరిక మేరకు సమాధానం ఇస్తున్నామని చెబుతూ మాజీ కోర్టు ఉద్యోగిని చేసిన ఆరోపణలు అన్నీ అసత్యాలని నిర్ధారిస్తూ, వాటిని నిరాకరించింది సుప్రీం కోర్టు. ఆమెను రొటీన్‌లో భాగంగానే రంజన్ గొగోయి ఇంటి ఆఫీసులో నియమించామనీ, అక్కడ చాలా మంది పనిచేస్తుంటారనీ, ప్రధాన న్యాయమూర్తిని కలిసే అవకాశం ఆమెకు లేదనీ, నిబంధనల ప్రకారమే ఆమెను ఉద్యోగం నుండి తొలగించామనీ, ఉద్యోగధర్మం సరిగ్గా నిర్వహించకపోవడం వలన తాత్కాలిక ఉద్యోగి అయిన ఆమె మరిదిని తొలిగించామనీ, ఆమె భర్తకు ఉద్యోగం పోవటం విషయం ఢిల్లీ పోలీసుల నిర్ణయమనీ, ఆమె మీద ఒక క్రిమినల్ కేసు నమోదు అయి ఉందనీ, ఆ కుటుంబం మొత్తానికి క్రిమినల్ చరిత్ర ఉందనీ సుప్రీం కోర్టు వర్గాలు సమాధానం ఇచ్చారు.

ఇక రాజకీయ వ్యవస్థ ఈ విషయానికి స్పందించిన విధానం కూడా వేరుగా లేదు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లే మాట్లాడుతూ న్యాయ వ్యవస్థను అస్థిరపరచటానికే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారనీ, ఇలాంటి అసత్యాల రాళ్లు విసురుతున్న వారితో సరిగ్గా వ్యవహరించకపోతే ప్రమాదమనీ హెచ్చరించాడు. రంజన్ గొగోయి 'విలువలు, సత్ప్రవర్తన, విశ్వసనీయత ఉన్న వ్యక్తి' అనీ సర్టిఫికెట్ ఇచ్చాడు. 'ఆయన న్యాయ దృష్టిని విమర్శకులు విమర్శించినా ఆయన వ్యక్తిత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేరు.' అని ఆయనను భుజానికి ఎత్తుకొన్నాడు. అరుణ్ జైట్లే రంజన్ గొగోయి కిచ్చిన ఈ మద్దతుతో, సహాయం కోసం బాధితురాలు ఏ రాజకీయ పార్టీ సహకారం కోరిందో ఆ మార్గం మూసుకొని పోయింది.

అయితే దేశ సర్వోన్నత న్యాయమూర్తి పై వచ్చిన ఈ లైంగిక వేధింపుల విషయాన్ని పూర్తిగా తీసి పారేయలేకపోయినట్లు ఉన్నారు. సుప్రీం కోర్టులో చిన్నపాటి ప్రహసనం జరిగింది. ఏప్రిల్ 24న సుప్రీంకోర్టు బెంచ్ లాయర్ ఉత్సవ్ బైన్ సమర్పించిన ఒక అఫిడివిట్‌ను విన్నది. జడ్జీలు అరుణ్ మిశ్రా, ఆర్ఎఫ్ నారీమన్, దీపక్ గుప్తాలు ఈ బెంచ్‌లో ఉన్నారు. ఈ ఉత్సవ బైన్‌కు 1997లో రంజన్ గొగోయి ఏదో కేసులో రక్షణ కల్పించమని ఆదేశాలు ఇచ్చాడు. తన అఫిడివిట్‌లో ఉత్సవ్ బైన్ ప్రధాన న్యాయమూర్తిని నకిలీ లైంగిక వేధింపుల కుట్రలో ఇరికించారని వివరించాడు. "ఇలాంటి ఆరోపణలు ఈ రోజు మీ మీద రావచ్చు, నా మీద రావచ్చు. నా పనిమనిషి నేను తనను రేప్ చేశానని అనవచ్చు. లాయర్‌గా వుండటమంటే విరక్తి కలుగుతుంది." అంటూ ఉద్రేక పడిపోయాడు. ఒకానొక సమయంలో జస్టిస్ నారిమాన్, జస్టిస్ మిశ్రా మీద అలిగి కోర్టు విచారణ నుండి బయటకు వెళ్లిపోయాడు. జడ్జీలు ముగ్గురూ ఆయనకు వెనక్కి పిలిపించి సారీ చెప్పారు. జడ్జి బృందం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఢిల్లీ పోలీసు విభాగాన్ని, సిబిఐ అధినేతలను, ఐబీ అధినేతలనూ వెంటనే పిలిపించి ఈ విషయంపై చర్చించాలని ఆదేశించారు. అయితే సోలిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సిట్ చేత ఈ విషయాన్ని కూలంకషంగా విచారణ జరిపితే సరిపోతుందని ప్రతిపాదించాడు. జడ్జిలు బాధితురాలి క్షేమం గురించి కాకుండా, లాయర్ ఉత్సవ్ బైన్ రక్షణ గురించి ఎక్కువ ఆలోచించి ఆయనకు పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించారు.



ఉత్సవ్ బైన్ మొదటి తన ఫేస్‌బుక్ పోస్టులో ప్రధానమూర్తి పైన వచ్చిన ఆరోపణల వెనుక జడ్జీలు, కార్పొరేట్ స్కాములు చేసేవాళ్లు, అవినీతి రాజకీయవేత్తలు ఉన్నారని రాశాడు. తరువాత కోర్టులో తన అఫిడవిట్ లో దీని వెనుక కార్పొరేట్ అధిపతులు, ఫిక్సర్లు ఉన్నారని అన్నాడు. తరువాతి అఫిడవిట్‌లో మాజీ సుప్రీం కోర్టు ఉద్యోగులు ఉన్నారని అన్నాడు. బైన్స్ లాంటి వాళ్లు ఒక ఫేస్‌బుక్ పోస్ట్ రాస్తే సీనియర్ జడ్జిలు ఆ విషయాన్ని కొంపలు మునిగేటంత సీరియస్‌గా తీసుకొంటారు. బాధితురాలు తన బాధలను 22 మంది సుప్రీం జడ్జిలకు 28 పేజీల ద్వారా, అనేక ఆధారాల ద్వారా తెలియచేస్తే ఆమెపై ఉక్కుపాదం మోపటానికి సంసిద్ధులు అవుతారు. ఉత్సవ్ బైన్ మీద చూపించిన కనికరంలో ఆవగింజంత కూడా బాధితురాలి మీద చూపక పోవటం దౌర్భాగ్యం.

ఆ రోజే సుప్రీం కోర్టు జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ ఇందు మెహతా, జస్టిస్ ఇందిరా బెనర్జీలతో కూడిన ఒక కమిటీని ఈ ఆరోపణలపై దర్యాప్తుకు నియమించింది. మాజీ కోర్టు ఉద్యోగిని ఏప్రిల్ 26న ఆ కమిటీ హియరింగ్‌కు హాజరు అవమని నోటీస్ పంపించింది. అయితే జస్టిస్ బొబ్డే, ఈ విచారణ ఇన్ హౌస్ (అంతర్గత) విచారణ అనీ, ఆరోపితురాలు తన లాయర్‌ను ఉపయోగించుకొనే అవకాశం లేదనీ, ఈ విచారణకు సమయ పరిమితి లేదనీ, ఇదంతా రహస్యంగా జరుగుతుందనీ చెప్పారు. ఈ కమిటీకి మళ్లీ గొగోయి హాజరు అవటం విశేషం. ఎవరి మీద అయితే ఆరోపణలు వచ్చాయో ఆ వ్యక్తి సమక్షంలోనే బాధితురాలు తన ఆరోపణలు చేయాలి. అయితే ఆ రోజు అక్కడ మన న్యాయ, చట్ట వ్యవస్థకు సంబంధించిన అనేక పెద్దలు ఉన్నారు. కానీ బాధితురాలికి తన లాయర్‌తో సహా హాజరు అయ్యే అవకాశం ఇవ్వకపోవటంతో ఆమె హాజరు కాలేక పోయింది.

అయితే ప్రపంచం గొడ్డు పోలేదు. బాధితురాలికి మద్దతుగా అరుంధతీరాయ్, రోమిల్లా థాపర్‌తో సహా 259 మంది మహిళా

లాయర్లు, మేధావులు, యాక్టివిస్టులు ఒక ఉత్తరం రాశారు. 22మంది సుప్రీం కోర్టు జడ్జిలను ఉద్దేశిస్తూ రాసిన ఈ ఉత్తరంలో ఈ త్రిసభ్య కమిటీ ఏర్పాటులో బయట సభ్యులు లేకపోవటం గురించి ప్రశ్నించారు. '2013, పని స్థలాల్లో లైంగిక వేధింపుల చట్టం'కు ఇది అతిక్రమణ అని చెప్పారు. దానికి బదులుగా 90 రోజుల్లో విచారణ పూర్తి అయ్యేటట్లుగా ఒక ప్రత్యేక విచారణ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన న్యాయమూర్తి ఈ విచారణ పూర్తి అయ్యే దాకా పదవి నుండి వైదొలగాలనీ, ఫిర్యాదురాలికి చట్టపరమైన సహాయాన్ని తీసుకొనే అవకాశం ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. 'ఆరోపణలను నిరాకరించటం, ఫిర్యాదురాలి మీద దుష్ప్రచారం చేయటం, పాత చరిత్రలను తిరగతోడటం, ఫిర్యాదురాలికి ఏవో ఉద్దేశ్యాలు ఉన్నట్లు మాట్లాడటం- ఇవన్నీ వేధింపుదార్లు నిత్యం ఉపయోగించే సాధనాలు. ఆరోపణలు చేసిన వారి మీద వేధింపులు, పరువునష్టం దావాలు కూడా మామూలే' అన్నారు.

'నాకు ఈ కమిటీ నుండి న్యాయం జరుగుతుందనే నమ్మకం పోయింది. అందుకే ఈ ప్రొసీడింగ్స్‌లో నేను పాల్గొనను.' అని చెప్పింది మాజీ కోర్టు ఉద్యోగిని. ఆమె విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో 'ఈ త్రిసభ్య కమిటీలో ఉన్న జడ్జిలు ఎస్ఏ బొబ్డే, ఇందిరా బెనర్జీ, ఇందు మెహతా- ముగ్గురూ గొగోయి కంటే జూనియర్లు. ఆయనకు వ్యతిరేకంగా వారు నిర్ణయాలు తీసుకోలేరు. ఆ కమిటీ విచారణ ఇన్‌హౌస్ విచారణ కిందకు రాదు. 1997లో సుప్రీం కోర్టు ఇచ్చిన విశాఖ నిర్దేశిత సూత్రాల కిందకు కూడా రాదు. ఈ కమిటీ ఏ పద్ధతుల ద్వారా విచారణ చేయబోతుందో, ఫిర్యాదుదారు అయిన నేను పదేపదే కోరినప్పటికీ తెలియచేయలేదు. నాతో బాటు లాయర్‌నూ, ఒక సహాయదారుడిని కూడా అనుమతించలేదు. ఈ విచారణలో జరిగిన సంగతులను బయట పెట్టరాదనీ, వారి మాట వినక పోతే ఆమె లేకుండానే విచారణ పూర్తి చేస్తామనీ జడ్జీలు బెదిరించారు. తను ఎందుకు ఆలస్యంగా ఆరోపణలు చేసిందో పదేపదే చెప్పినా ఆ ఆలస్యం కారణంగా తన ఆరోపణ అబద్ధమని వారు అంటున్నారు.' అని చెప్పింది.

'రోగి కోరిందీ అదే, వైద్యుడు చెప్పింది' అదే అన్నట్లు ఆమె రాకపోవటమే మంచిదని భావించి ఈ త్రిసభ్య కమిటీ నాలుగు సార్లు కూర్చొని, లేచి ఆరోపణలు అసత్యాలని కొట్టి పారేసింది. ఈ కమిటీ ఆమె కోరిన ప్రామాణిక చట్టపర ప్రోటోకాల్‌ను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఆమెతో మాట్లాడలేదు. ఆమె ఆరోపణలు చేసిన సిఐ లాంటి వారిని కూడా ఈ విషయంగా విచారించలేదు. ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల విషయమే పట్టించుకొన్నారు కానీ, ఆ వేధింపుల కారణంగా ఆమె కోల్పోయిన ఉద్యోగం గురించి ఎవరూ మాట్లాడలేదు. కమిటీ తన రిపోర్ట్‌ను బాధితురాలితో సహా ఎవరికి బహిర్గతం చేయలేదు. బాధితురాలిగా ఆమెకు తెలుసుకొనే హక్కు ఉన్నదనే విషయం కావాలనే విస్మరించారు. నిండు కోర్టులో కమిటీని వేసినపుడు, నిండు కోర్టులో ఆ కమిటీ రిపోర్ట్ ప్రకటించాలని అనుకోలేదు. అంటే ఉనికిలో ఉన్న లైంగిక వేధింపుల చట్టాలను గౌరవించకుండా లాంఛన ప్రాయంగా వేసిన కమిటీ కాబట్టి, దాని రిపోర్ట్‌ను కూడా అధికారికంగా ప్రకటించనవసరం లేకుండా బుట్ట దాఖలు చేయవచ్చునని భావించినట్లా?

'మీ టూ' ఉద్యమం బాధితురాళ్లకు సూచనలు చేసినట్లుగానే ఆమె తనకు జరిగిన అమర్యాదను దాచుకోకుండా, అఫిడవిట్ ద్వారా ప్రపంచానికి తెలియచేసింది. కానీ దేశంలోని సర్వోన్నత న్యాయస్థానం, చట్టాల రూపకల్పనకు కేంద్ర స్థానమైన సుప్రీం కోర్టు, ఒక బాధితురాలు చేసిన ఆరోపణలకు గడ్డిపరక విలువనీయకుండా తోసిపుచ్చింది. ఆ తోసిపుచ్చటంలో కూడా ఎలాంటి ప్రామాణికాలు పాటించిందో కూడా దేశప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తీసుకోలేదు. ఈ దురహంకారానికి 'వ్యవస్థాపరమైన పురుషాధిక్యత' అనే పేరు పెడితే తప్పు అవుతుందా? ఒక వ్యక్తి మీద ఫిర్యాదుతో బాధితురాలు బయటకు వస్తే మొత్తం వ్యవస్థే అలా ఉంది. ఇదే వ్యవస్థ అన్యాయానికి గురి అయ్యి స్త్రీలు ఆశ్రయించినపుడు, ఉన్న చట్టాలను సరిగ్గా అన్వయించి తీర్పులు చెప్పాలి. ఇంకా అవసరమైన చట్టాలు రూపకల్పనకి తోడ్పడాలి. పితృస్వామ్యాన్ని నిలువెల్లా ధరించిన ఈ న్యాయ వ్యవస్థ నుండి స్త్రీలు ఇక ఎలాంటి న్యాయాన్ని, ధర్మాన్ని ఆశించగలరు?

ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయి వ్యక్తిగతంగా నీతిమంతుడు అని చెబుతారు. తన ఆస్తిపాస్తుల వివరాలను ఖచ్చితంగా కోర్టుకు సమర్పించే నిజాయితీ కలిగిన మనిషి అంటారు. అలాంటి వ్యక్తి తనను నిరాకరించిన మహిళ విషయంలో ఎంత దురహంకారంతో వ్యవహరించాడో అర్థం అవుతుంటే వర్గ సమాజంలో వ్యక్తిగత ఆదర్శవాదానికీ, సామాజిక ప్రవర్తనకూ మధ్య ఉండే వైరుధ్యం తేటతెల్లమౌతుంది. మాజీ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సెక్రెటరీ దుష్యంత్ దేవ్ 'ద హిందూ' పత్రికలో రాస్తూ, గతంలో రంజన్ గగోయి ఒక తీర్పు విషయంలో 'ఏ మనిషీ తన సొంత కేసులో జడ్జిగా ఉండకూడదు' అనీ, 'అవతల వైపు చెప్పేది వినాలి' అనీ వ్యాఖ్యానించాడని గుర్తు చేశాడు. తాను చేసిన వ్యాఖ్యానాన్ని తన విషయంలో పాటించకుండా, రంజన్ గగోయి తనను విచారించటానికి వేసిన కమిటీలో వెళ్లి కూర్చున్నాడు.

అయితే కరడు కట్టిన పితృస్వామ్యం ఆమెను కోర్టులు, పోలీసుల రూపంలో పగబట్టి వేధించినా ఆమెకు అండగా ఉండే శక్తులు కూడా అదే సమాజం నుండి వచ్చాయి. సుప్రీంకోర్టు భారత ప్రధానమూర్తి కూడా చట్టాలకు అతీతుడు కాదని చెబుతూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు మొదలు అయ్యాయి. బాధితురాలికి వ్యతిరేకంగా పోవద్దని చెబుతూ జస్టిస్ చంద్ర చూడ్‌తో సహా 17మంది సుప్రీం కోర్టు జడ్జిలు, ఈ త్రిసభ్య కమిటీకి ఉత్తరం రాశారు. అరుణ్ జైట్లే రంజన్ గొగోయిని వెనుకేసుకొని రావటంతో ఆమెకు పార్లమెంటులో మద్దతు వస్తుందనే ఆశ పోయినా ఈ పరిణామాలు ఆశాజనకంగానే ఉన్నాయి. ❁



చలం
125వ జయంతి

కామం, మోహం, ప్రేమా

విశాఖ పద్మ

చలం 'స్త్రీ' పరిచయం




'స్త్రీ పురుషులిద్దరూ నిజమైన స్నేహితులూ, దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలి. ప్రేమబంధమే కాని, అధికారబంధం ఉండకూడదు.' 1925లో అంటే సుమారు 94 సంవత్సరాల క్రిందట స్త్రీలను భారతీయ సమాజం ఇంకా పూర్తిగా మనుషులుగా గుర్తించని కాలంలో చలం; స్త్రీల స్వేచ్ఛ కోసం, ఆనందం కోసం, ఆరోగ్యం కోసం; అలమటిస్తూ, ప్రశ్నిస్తూ, ఆక్రోశిస్తూ రాసిన 'స్త్రీ' పుస్తకంలోని వాక్యాలివి.

'స్త్రీ' పుస్తకాన్ని పరిచయం చేయడం నిజానికి సాహసంతో కూడిన పని. పరిచయం చేయడం అంటే చేయాల్సింది ప్రతి అక్షరాన్నీ తిరిగి ముద్రించుకోవడం- తప్ప నిజానికి గత్యంతరం లేదు.

స్త్రీల విద్యా, వివాహం, పాతివ్రత్యం, సాంఘిక చట్రాలూ, కుటుంబం, పిల్లలు, నీతులూ, మారే మోహాలూ, మారని నిబంధనలూ, అన్నింటి గురించీ చలం సాధికారతా పత్రమే 'స్త్రీ'.

స్త్రీలను విద్యకు దూరంగా ఉంచి, జ్ఞానానికి వెలిగా ఎంచి, సమాజం స్త్రీల జీవిత పరమావధి వివాహం అని నిర్ణయించి; వివాహాలు దైవసంకల్పితాలనీ, ఆ దైవ సంకల్పాన్ని సంఘం, వ్యక్తులూ తమ సదాచారాలతో, సంఘనిర్మిత నీతి సూత్రాలతో పవిత్రంగా ఎంచి; ఆ వివాహం ద్వారా స్త్రీని పురుషునికి దాసిగా చేయడాన్ని అణువణువునా ప్రశ్నించి, హేతుబద్ధమైన తర్కంతో అలాంటి వివాహ వ్యవస్థనుంచి స్త్రీలకి సంపూర్ణ స్వేచ్ఛ కావాలని ఈ పుస్తకం ద్వారా చలం బలమైన ప్రతిపాదనలని సమాజం ముందుంచాడు. స్త్రీలపట్ల నాటి సమాజపు దుర్నీతినీ, వివాహవ్యవస్థలోని డొల్లతనాన్నీ, పురుషస్వామ్యంలోని అంధకార అహంకారాన్నీ అన్ని హేతువుల ఆధారంగా ప్రశ్నించి వివాహానికి మోహం షరతు కావాలంటాడు. శరీరసంపర్కం కోసం స్త్రీపురుషులిద్దరికీ ఒకరిమీద ఒకరికి కలిగే వాంఛ కామం అయినప్పుడు, అటువంటి కామం తీర్చుకోవడానికి మనుషులు చేసుకున్న ఏర్పాటు వివాహం అయితే, ఆ వివాహంలో స్త్రీల వాంఛకి ఏ ప్రాధాన్యతా లేకపోవడం ఎంత దుర్మార్గమో అంటాడు. అటువంటి పెళ్లిళ్లని సంస్కారవంతమైన, జన్మజన్మల బంధాలుగా స్త్రీలని ఒప్పించి, లేక బలవంతంగా వారిపై రుద్ది, పశువులకన్నా హీనంగా బంధించి, పిల్లల్ని కని పెంచి; ఏ అందం, వికాసం, జ్ఞానం, సౌఖ్యం, వెలుతురూ, విశ్రాంతీ ఈయక సంసార చక్రాల క్రింద స్త్రీలని తోసి నలిపెయ్యడాన్ని సవాలు చేస్తాడు చలం.

పెళ్లి ఉద్దేశాల్లో ముఖ్యమైనది కామవాంఛ ధర్మబద్ధంగా నెరవేర్చుకోవడమే అయితే, పెళ్లిళ్లు ఇంతలా వర్ధిల్లుతున్న ఈ సమాజంలో వేశ్యావాటికల ఉనికి ఎట్లా సాధ్యమైంది? గృహస్థ ధర్మం నెరవేర్చడానికీ, యజ్ఞయాగాది క్రతువులలోనా, పూజాపునస్కారాలకూ, నిష్కామంగా బిడ్డల్ని కని సమాజాన్ని ఉద్ధరించడానికే పెళ్లిళ్లని సమాజంలో బయటికి చెప్పుకుంటారు కానీ; ఒకరినొకరు ఎరుగని, ఒకరినొకరు ఆశించని,



ఒకరినొకరు మోహించని ఇద్దరు మనుషుల్ని పెళ్లి మంత్రాల అనంతరం ఒక గదిలో బంధించి గర్భదానాలు చేయించడానికి అనుమతినిచ్చే వివాహవ్యవస్థలో; బాల్యవివాహాల ద్వారా పసిపిల్లల్ని, రజస్వల కాని పిల్లల్ని- మేకపిల్లల కోసం బోనులో తిరిగే పులులలాంటి భర్తకి ఒప్పచెప్పడం... ఆ క్రతువు అంతా పవిత్ర వివాహ, కుటుంబ వ్యవస్థకి మూలమవడం ఎంత అనాగరికమో, స్త్రీలను అలా ఆ ఒక్క రాత్రి ద్వారా జన్మనంతటికీ కట్టేసి వుంచడం ఎంత అమానవీయమో తెలుసుకోమంటాడు చలం.

ఈనాటికీ పెళ్లి పేరుతో సాగుతున్న అనాచారాలూ, అహంకారాలూ, ఆర్భాటాలూ, అనర్థాలూ; అన్నింటినీ ఆనాడే చెరిగిపారేశాడు చలం. కులగోత్రాలు మాత్రం పరీక్షించి, ఆర్థిక పరిస్థితుల్ని బేరీజు వేసుకొని, సంతానం కోసం, సమాజంలో గౌరవం కోసం, వృద్ధాప్యంలో తోడు కోసం, వండిపెట్టడం కోసం, సంతానపోషణ కోసం స్త్రీలని వివాహబంధంలో ఇరికించడం; ఆ బంధానికి బయట స్త్రీలు ఏ ఆకర్షణలకీ, మోహాలకీ, కామాతురతలకి గురైనా సంఘానికి వెలి వేయడం, నిర్బంధ వివాహవ్యవస్థ స్త్రీకి చెరసాలకన్నా హీనమైనదంటాడు చలం. వివాహంలో స్త్రీలకి విధించిన షరతులన్నీ పురుషుడికీ ఉన్నాయని బయటకి ప్రకటిస్తారు గానీ పురుషుని కామ విశృంఖలతకీ, మోహానికీ సమాజానికి ఏ అభ్యంతరం నిజానికి లేదు. స్త్రీలకి వివాహానికి ముందు ఎలాంటి కామవాంఛ ఉండరాదనీ, భర్తతో భర్త అనుమతి మేరకు, భర్త కోరిన హద్దులో మాత్రమే స్త్రీలకి కామవాంఛ ఉండాలనీ, భర్త చనిపోయిన స్త్రీలు వారు ఎంత యవ్వనంలో ఉన్నా కామానికి వెలిగా వుండాల్సిందేనని, అందుకని కామాన్ని ఆపుకోమనే ధర్మాన్ని బోధించడం లోకానికి సులభం. కానీ సహజంగా అన్ని పశుపక్ష్యాదులకీ మల్లేనే మనుషులకి కూడా కామవాంఛ సహజం అయినప్పుడు, స్త్రీలకి ఇన్ని ధర్మాలు, నియమాలు బోధించి వేధించి బంధించడం ఎలా న్యాయం? అని ధర్మాగ్రహాన్ని ప్రకటిస్తాడు చలం. నిజానికి, కామానికి పెళ్లి అవసరం లేదు. మనుషులకి సాంఘిక జీవనం వలన కలిగిన అనేక అవసరాలవలన, ఆర్థికపరమైన వ్యవస్థల ఏర్పాట్లకి అత్యవసరమైనదిగా ఏర్పడినదే వివాహవ్యవస్థ. జంతుస్థాయిలో కామాన్ని తీర్చుకున్న వ్యవస్థ కొన్ని వేల సంవత్సరాలు నడిచింది, ప్రకృతిలో. కానీ ఆ దశనుంచీ, అధికంగా అన్ని విషయాల్లోనూ మనుషుల కోర్కెలూ, అవసరాలూ, ఆలోచనలూ ఎలా మారాయో కామం విషయంలోనూ అన్ని మార్పులూ వచ్చి చేరాయి. కామానికి కొత్త అర్థం, రంగూ ఏర్పడ్డాయి. ప్రత్యేకించి ఒక పురుషుడు ఒక స్త్రీనే, ఒక స్త్రీ ఒక పురుషుడ్నే ఎన్నుకొని కామంతో సరిపెట్టుకోకుండా, ఎప్పుడూ వారు తమతోనే వుండాలనే కోరికే మోహానికి ఆలంబనగా భావించవచ్చు.

మోహం కలగడానికి కారణాలు కనుక్కోవడం కష్టం. ఆయా వ్యక్తుల అభిరుచులూ, సంస్కారాలూ వారి మోహాల్ని నిర్ణయిస్తాయి. సమాజంలో స్త్రీల కామవాంఛకి ఎన్ని హద్దులు గీశారో మోహానికీ అంతే... స్త్రీల మోహం వివాహబంధంతోనే తీరాలనే షరతు మన వివాహ వ్యవస్థది. కానీ, ఎవరిమీద, ఎందుకు, ఎప్పుడు, ఎలా కలుగుతుందో తెలీని మోహాన్ని వివాహచట్రంలో ఇరికించడం ఎన్నడూ పూర్తిగా సాధ్యం కాలేదు ఈనాటికీ ఈ వివాహ వ్యవస్థకి. ఈ స్త్రీ పురుష మోహాన్ని చలం ఎంతగా అభిలషించాడో, ఎంతగా కలవరించాడో, ఒకరి హృదయాన్ని ఇంకొకరు తమ దాన్ని చేసుకోవాలనే ప్రయత్నం వలన కలిగే ఆనందం లోకంలో ఇంక దేని వల్లా రాదంటాడు. మోహావేశంలో ఉన్న స్త్రీ పురుషులు ఒకరి ప్రేమకు మరొకరు అర్హులు కావడానికి, ఒకరినొకరు సంతోషపెట్టుకోవడానికీ; ఇద్దరూ ధైర్యవంతులూ, సాహసవంతులూ, ఉదారులుగా మారిపోతారనీ, అన్ని విషయాల్లో అభివృద్ధి చెందుతూ ఎదుటివారు తమపై మోహాన్ని ఎక్కడ వీడతారోననే భయం వలన దురలవాట్లనుంచి, ప్రలోభాలనుంచి, దుష్కార్యాలనుంచి తప్పుకొని బాగుపడతారనీ అంటాడు చలం. మోహంలో ఉన్న మనుషుల ఆలోచనలో; ఊహలూ, కళలూ, జ్ఞానం అపారంగా వృద్ధి పొందుతాయనీ మోహం వలన పొందిన ఆనందం స్త్రీ పురుషులను మహత్కార్యాలకు ప్రోత్సహిస్తుందంటాడు చలం. కనుక మోహమే ఆధారంగా వివాహం జరగాలంటాడు. మోహం పోయిన వివాహం విచ్ఛేదమైనట్లు భావించుకోవాలంటాడు. అయితే స్త్రీలు చాలా సార్లు పురుషుడి వలకు చిక్కుకొని అదే మోహమని భ్రమపడే పరిస్థితులే చాలావరకు ఉన్నాయంటాడు. అలా అని స్త్రీలని ఇళ్లల్లో, బడుల్లో తాళాలు పెట్టి బంధించడం వలన; వారు జ్ఞానానికీ, లోకజ్ఞానానికీ, దేహబలానికీ, బుద్ధిబలానికీ దూరమై మరింత అల్పులుగా మారిపోతారని బెంగపడతాడు. స్త్రీలు తమ మృదుత్వాన్నీ, మనో లావణ్యాన్నీ, నైర్మల్యాన్నీ ఎవడికి బడితే వాడికి విచక్షణారహితంగా అనర్హులైన పురుషులకి పారేసుకోవడం, ఒక నిమిషం కామం కోసం వృథా చేసుకోవడం, స్త్రీలకి మరింత బాధని తెచ్చిపెట్టుకోవడమే కదా అంటాడు. భర్తకైనా; అర్హుడు కానివాడైతే తన శరీరాన్నీ, సర్వోన్నతమైన పవిత్రతనీ, యోగ్యతనీ అర్పించడానికి వీల్లేదంటాడు.

పాతివ్రత్యం పేరుతో సంఘం స్త్రీకి విధించిన షరతులన్నీ బూటకమైనవే. భర్తని దైవంగా భావించడం, భర్త ఆజ్ఞని పాలించడం, ఎల్లవేళల్లోనూ ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండడం, భర్తల ఇష్టాలకనుగుణంగా రుచులని, అలంకారాలని మార్చుకోవడం అన్నీ పతివ్రతా స్త్రీలు చేయాల్సిందే. స్త్రీలు భర్తలకి శరీరాన్ని అప్పగిస్తే చాలదు. మనస్సునీ, హృదయాన్నీ, మేధనీ అప్పగించాల్సిందే. పుట్టింట్లో ఉంటే తండ్రి ఊహలూ, ఆజ్ఞలూ; భర్త దగ్గర ఉంటే భర్త ఊహలూ, ఆజ్ఞలూ; స్త్రీలకి అనుసరణీయం అనే ధర్మాన్ని బదాబదలు చేస్తాడు చలం స్త్రీ పుస్తకంలో.

స్త్రీ పాతివ్రత్యాన్ని నిరసించి, ఆ బోధ చేసిన సమాజపు కుళ్లు నీతుల్ని కడిగేసి స్త్రీ పురుషులు నిజమైన స్నేహితులూ, దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛ కావాలంటాడు. ఇద్దరి మధ్యా ప్రేమబంధమే కాని, అధికారబంధం ఉండరాదంటాడు. పాపమూ, ద్వేషమూ, జెలసీ, అవినీతి, వ్యభిచారం, దుఃఖం... ఈ అగ్నిలోంచి నడిచి తపిస్తేనే కానీ వ్యక్తులకు అది స్త్రీలైనా, పురుషులైనా స్వేచ్ఛ పొందలేరంటాడు. అట్లాంటి సాహసం చేయలేని వారికి ఆ ఆనందం, ఉన్నత స్నేహం అర్థం కావంటాడు. స్త్రీల బలం భర్తలకీ, అతని తల్లిదండ్రులకీ, చుట్టాలకీ చాకిరీ చేయడానికేననీ, ఆమె అందం అతని కళ్ల ఆనందానికేననీ, ఆమె సౌజన్యం అతనికి నమ్మకంగా ఉండడానికేననీ, ఆమె చదువు చాకలి పద్దులకీ, ఆమె నైపుణ్యం ఇంటి అలంకరణకీ- వంటింట్లో చూపించడానికేననీ, స్త్రీల ఆదర్శాలూ, అభిరుచులూ అన్నీ వంటింటికీ, పడకటింటికీ సంబంధించినవిగానే సమాజం పరిగణించినదనీ; అలా స్త్రీలని వంటగత్తెలుగా, పిల్లలకి దాదులుగా, పెద్దలకి దాస్యం చేసేవారిగానే చూడ్డాన్ని చలం తీవ్రంగా నిరసించాడు. తిండి తినడం, పిల్లల్ని కనడం మాత్రమే చేయడానికి స్త్రీలు పశువులకన్నా హీనమా? అని ఆక్రోశించాడు.

ఇంటిచాకిరీని సమాజచట్రం స్త్రీలకి విధించి అమలుచేయడాన్ని గర్హిస్తూ 'ఇంత విశాలప్రపంచంలో గుల్ల వలె ఇళ్లు కట్టి, వాటిల్లో స్త్రీలని పెట్టి, జైల్లో వలె కొన్ని పనులు చెప్పి, కర్ర పుచ్చుకుని చేయించడానికి ఎవడిచ్చాడ్రా మీకు అధికారం?' అని ఆగ్రహించాడు. ఇంత చాకిరీ చేస్తే స్త్రీకి పురుషుడేమిస్తాడు? తిండీ, బట్టా, ఎప్పుడన్నా నగలూ, తనకి తోచినప్పుడు ఉచితంగా తన్నులో, ముద్దులో ఇస్తాడు. స్త్రీ జీతం లేని సంఘబానిస అని చలం ఆవేదన చెందాడు. వేశ్యకి డబ్బూ, నగలూ ఇచ్చి పురుషులు భార్యలకి పగలూ రాత్రీ చాకిరీకి కలిపి తిండీ బట్టా ఏడ్చుకుంటూ ఇస్తారనీ, వేశ్య దేహం మాత్రమే అమ్ముకుంటే భార్య దేహం, మనసూ, ఆత్మా, నీతీ, అభిమానం అన్నీ అమ్ముకుందంటాడు. భర్త బానిసత్వం నుంచి తప్పించుకోవడానికి స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం పొందడమొక్కటే మార్గమంటాడు. స్త్రీలు చేసే పనులకి ఆర్థిక విలువ ఉండాలనీ, ఆమె చేసే సేవలకి సమాజంలో గౌరవం ఉండాలనీ ఆర్థిక అవసరాలకి భర్తల మీద ఆధారపడకుండా ఉండే పరిస్థితులు రావాలనీ అభిలషించాడు. స్త్రీలు తమ ఉపాధి పొందడానికి మళ్లీ తమ శరీరాల్ని పణంగా పెట్టే పరిస్థితులు రాకూడదంటాడు. ఎంత ముందు చూపు చలానికి?

కమ్యూనిస్ట్ దేశాల్లో స్త్రీల జీవితాల్లో మార్పులు రావడాన్ని ఆహ్వానించాడు చలం. స్త్రీలు ఇళ్లల్లోంచి బయటపడి సామాజిక కార్యాల్లోకి, శ్రమల్లోకి రావడమనే మార్పు, అనేక ఇతర దాస్యాల్లోంచి స్త్రీలని బయటకి తెస్తుందనే గొప్ప నమ్మకాన్ని ప్రకటించాడు చలం.

ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని గుర్తించేందుకు, ఆ అర్హత పొందేందుకు, దాన్ని నిలుపుకునేందుకు స్త్రీలకి విద్య అత్యవసరమని, అదే స్త్రీ స్వాతంత్ర్యాన్ని పొందేట్లు చేస్తుందని నమ్మాడు చలం. అయితే విద్య కన్నా స్త్రీలకి స్వతంత్రార్జనా, దానిపై హక్కు ముఖ్యమంటాడు. ఎంత నిజం! ఈ మాట. ఉద్యోగాలు చేసుకుంటూ వేలల్లో జీతం పొందుతూ భర్త అనుమతి లేనిదే తనకంటూ ఒక్క రూపాయి ఖర్చు పెట్టుకోలేని ఎంతమంది విద్యావంతులున్నారీ సమాజంలో? అంతకన్నా చదువు లేకపోయినా, రెక్కల కష్టంతో స్వతంత్రంగా బతికే స్త్రీలు ఎంతో స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ఉంటారు కదా?

స్త్రీలు విద్యావంతులు కావాలని చెప్తూనే పాత పురాణాల మీదా, మతం మీదా, మూఢ విశ్వాసాల మీదా ఆధారపడే చదువులు స్త్రీలని పురుషుడి లాగానే అధికారం, అంధకారం, అహంకారాల్లోకి నెట్టేస్తాయంటాడు. ఎంతో కాలం బానిసత్వానికి అలవాటు పడ్డ స్త్రీల వికాసానికి కొత్త తరహా విద్యనందించాలనీ, అలాంటి ప్రయత్నాలేవో సోషలిస్టు దేశాల్లో జరుగుతున్నట్లుగా ఉందనీ అంటాడు.

పెళ్లిలో స్త్రీ బానిసత్వాన్ని, పురుష ఆధిపత్యాన్ని నిరసించిన చలం ఒక స్త్రీకి ఒక పురుషుడు అనే ఆదర్శం మూలమైన మోనోగమీని నాగరిక సమాజానికి ఒక అవసరంగా చూశాడు. స్త్రీ పురుషుల జీవితాల్లో నిర్దిష్టమైన పనిలో నిమగ్నం కావడం, పిల్లల క్షేమం రీత్యా మోనోగమీ కొంతవరకూ పనికి వస్తుందంటాడు. మోనోగమీలో స్త్రీపురుషుల శృంగారం-ఇతర అవసరాల కోసం ఒకరిపై ఒకరు ఆధారపడడమే కాక ఒక ఐక్యతా- శాంతీ ఉన్నాయని; ఐతే అవేవీ సమాజంలో మనుషుల్ని కట్టిపెట్టి సాధించలేనివనీ, మనుషులు గొప్ప ప్రయత్నంతో- శిక్షణతో- కలలతో సాధించుకునే అవకాశం ఉందనే అంటాడు. కానీ అదే మనుషుల అంతిమ ఆదర్శం లాంటిదనే శాసనాలు అవసరం లేదంటాడు.

మోహంకన్నా అతీతంగా స్త్రీ పురుషుల్లో కలిగే ప్రేమని ఎంతో అపురూపమైనదానిగా పేర్కొన్నాడు చలం. మోహానికి ఆకర్షణా, సౌఖ్యం, వాంఛా సరిపోతాయి గాని ప్రేమకి వాటితో పాటు గౌరవం, భక్తీ ఉంటాయంటాడు.

ప్రేమ లేని, ప్రేమ పోయిన వివాహాల్ని రద్దు చేయాలంటాడు చలం.

వివాహం బయట పుట్టే పిల్లలకి ప్రభుత్వం గ్యారంటీగా ఉండాలంటాడు.

పాశ్చాత్య దేశాల్లో ఇతర ఆర్థిక, సామాజిక మార్పుల కనుగుణంగా స్త్రీలు సమస్వేచ్ఛ కోసం చేస్తున్న ప్రయత్నాలని ఈ పుస్తకంలో చాలాసార్లు ప్రస్తావించాడు చలం.

నిర్బంధ మోనోగమీకి ప్రత్యామ్నాయాలను కూడా ప్రతిపాదించాడు. ట్రయల్ మారేజెస్, కంపానియనేట్ మారేజెస్‌ని కూడా ప్రయత్నించి చూడాలంటాడు. అంటే కొంతకాలం కలిసి ఉండి, కుదురుకునే దాకా పిల్లల్ని కనకుండా ఉండి, కుదరకపోతే విడిపోవడం, మనసు మారిపోతే వేరే జీవితాన్ని ఎంచుకోవడంలాంటి ప్రత్యామ్నాయాలు ఉండాల్సిందేనంటాడు.

స్త్రీ పురుషులు రహస్య సంబంధాలను ఆశ్రయించే దుర్నీతికి అవకాశం లేకుండా తమ ఇష్టాల్ని బహిరంగపరచుకునే సామాజిక పరిస్థితులు ఏర్పడాలని అభిలషిస్తాడు. స్త్రీపురుషులు వారు భార్యాభర్తలైనా, ప్రేమికులైనా ఇద్దరి మధ్యా ఆకర్షణా, ప్రేమా నిలుపుకునేవైపుగా కృషి చేయాలంటాడు. ఇద్దరూ ఆటలాడాలనీ, పుస్తకాలు చదవాలనీ; క్లబ్బుల్లో, సమాజాల్లో, సొసైటీల్లో మెంబర్లయి ఎవరి పనులు వారు చూసుకోవాలనీ; స్త్రీలకి పురుషుల స్నేహాలూ, పురుషులకి స్త్రీల స్నేహాలూ ఉండాలనీ; ఉదయాల్లో, వెన్నెల్లో, సాయంత్రాల్లో ఇద్దరూ షికార్లకి వెళ్లాలనీ; ఉత్త కామం వలన కాక ఇతర విషయాల్లో ఒకరినుంచి ఒకరు ఆనందం పొందేలాగా వృద్ధి చెందాలనీ అంటాడు. కవిత్వం, సంగీతం, కళాభిరుచీ; వీటిల్లో పరవశులయ్యే స్త్రీపురుషుల మధ్య ఆకర్షణ సజీవంగా ఉండే అవకాశం ఉందంటాడు. భార్యాభర్తలూ, ప్రేమికులూ తమ మీద అధికారం గలవారినీ, చాడీలు చెప్పేవారినీ వారు తల్లిదండ్రులయినా దూరంగా పెట్టాలంటాడు. పిల్లల్ని కనడంలో ప్లానింగ్ అవసరమంటాడు. స్త్రీ సంపాదన సహజీవనానికి గౌరవాన్ని ఇస్తుందంటాడు. తన మీద ఆధారపడ్డ స్త్రీపై ఎంత ప్రేమ ఉన్నా పురుషుడికి అది త్వరగా నశిస్తుందంటాడు. ఇద్దరూ పరస్పరం గౌరవాన్ని నిలబెట్టుకోవటానికి కృషి చేయాల్సిందేనంటాడు. వీలున్నంతవరకూ ఎవరి పని వారు చేసుకుంటూ వేరు వేరు ఇళ్లల్లో ఉండాలంటాడు. ఇద్దరిలో ఎవరికైనా వేరొకరిపై మోహమో, ప్రేమో తగ్గితే సులభమైన పద్ధతుల్లో విడాకులు తీసుకునే పద్ధతి అనుసరించాలంటాడు.

స్త్రీలకీ పురుషుడికి మల్లేనే శృంగార జీవనం, అనుభవం అవసరమని భావించేంతగా సమాజం ఎదగాలంటాడు.

ఆనాడు అందుబాటులో లేని గర్భ నిరోధక మార్గాలనూ, గర్భ విచ్ఛిత్తి పద్ధతుల్ని సైన్స్‌లాగా బోధించి, అవాంఛిత గర్భం వలన స్త్రీలు సమాజానికి వెలియై చావుని కోరి తెచ్చుకునే పరిస్థితులనుండి స్త్రీలని రక్షించడానికి చలం పడిన తపనకి స్త్రీలు యావన్మంది చలానికి హృదయదాస్యం చేయాల్సిందే.

ఒక్క నిమిషం విశ్రాంతినివ్వక, మహాప్రణయ మారుత వేగం మీదనో, అగాధ వియోగ భారం కిందకి, చీల్చి, నలిపి, ఊపిరాడనీక తన జీవితాన్ని పాలించిన స్త్రీ కోసం చలం పడిన వేదనే 'స్త్రీ'.

తిరగబడి, నలిగి, జీవితాన్ని అర్పిస్తేనే కానీ స్త్రీలు తాము పోగొట్టుకున్న ఆత్మల్ని తిరిగి పొందలేరనే మార్గ నిర్దేశనం చలం 'స్త్రీ'.

నీతి, ధర్మం, ఆచారం నేషనలైజ్ అయిపోయాయని 94 ఏళ్ల క్రితం చెప్పి వాటి మీద తిరగబడి చూపించి, ఆ తిరుగుబాటే నిజమైన స్త్రీ స్వేచ్ఛ అని ప్రకటించాడు చలం 'స్త్రీ'లో.

తెల్లారి లేస్తే మడులూ, ఆచారాలూ, అలుకులూ, పిడకలూ, అధికారాలూ... అవన్నీ వదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనో వ్యవధినీ, సంతోషాన్నీ, ఉత్సాహాన్నీ, మానవులకి కలగాలని కలలు గన్న చలం తానొక్కడే లేక తన లాగా ఒక్కొక్కరే ఎంత తిరగబడ్డా రాని మార్పులు సమాజంలో సమూలంగా వచ్చే ఇతర పెద్ద మార్పులవలన సాధ్యపడతాయని గ్రహించి స్త్రీపురుష సంబంధాల్లో సుఖం రావాలంటే, వికాసం కలగాలంటే దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారాలి. వంటా, చాకిరీ, పిల్లల్ని కనడం, పెంచడం ఇవన్నీ ఇప్పటికన్నా సుఖమూ, సులభమూ అయ్యే పద్ధతులు రావాలి. అట్లాంటి మార్పులని తీసుకొచ్చేది కమ్యూనిజమే అనిపిస్తోంది అంటాడు 'స్త్రీ'లో చలం.

స్త్రీకి శరీరం ఉంది- దానికి వ్యాయామం ఇవ్వాలి.

ఆమెకి మెదడు ఉంది- దానికి జ్ఞానం ఇవ్వాలి.

ఆమెకి హృదయం ఉంది- దానికి అనుభవం ఇవ్వాలి.

ఇదీ చలం స్త్రీలకి చేసిన మహోపకారం, సమాజానికి ఇచ్చిన తాత్విక ప్రతిపాదన.


రచయితలకు విజ్ఞప్తి

వ్యాసాలు, కవితలు, కథలు మాతృకకు ఈ-మెయిల్ ద్వారా కానీ, పోస్ట్‌లో కానీ పంపవచ్చు. తాము పంపే రచనలు తమ సొంత రచనలేననీ, ఇతర ఏ పత్రికకూ ప్రచురణకు పంపలేదనీ, ఇంతకు ముందు ఏ పత్రికలో ప్రచురించలేదనీ, వారి సొంత పుస్తకంలో ముద్రించ లేదనీ చెబుతూ హామీ పత్రం కూడా జత చేయాలి. రచనలు, కథలు, వ్యాసాలు, ప్రింట్‌లో 3, 4 పేజీలకు మించకుండా వుండేలా జాగ్రత్తపడాలని కోరుతున్నాం.

ఆన్‌లైన్ పత్రికలు, ఫేస్ బుక్, బ్లాగులలో ప్రచురించినవి కూడా మాతృకలో ప్రచురణకు అర్హం కావు. ప్రచురణ జాప్యమైన సందర్భంలో రచయితలు సహకరించాలని కోరుతున్నాము. రచనల ఎంపిక విషయంలో మాతృక సంపాదకవర్గానిదే చివరి నిర్ణయం. మహిళా రచయితలకు మాతృక అత్యంత ప్రాముఖ్యం ఇస్తుందని తెలియచేస్తున్నాము.


మాతృక సంపాదకవర్గం





ఓ పువ్వు పూసింది

చలం



అర్ధరాత్రి అడివిలో పువ్వు పూసింది. చుట్టూ చీకటిని చూసి, భయమేసి, 'అమ్మా' అని ఏడ్చింది. ఆకులూ, తొడిమలూ దగ్గరగా తీసుకుని భయంలేదని వూయించాయి ఆ తెల్లని పసిపువ్వుని.

"ఏదీ?" అంది పువ్వు.

"ఎవరు?" అంది తల్లి తీగ చీకట్లోంచి.

"నన్ను నీదగ్గరికి తీసుకువొచ్చాడూ, అతను."

"ఎవరు తీసుకొచ్చారు? నేనే తెచ్చుకున్నాను నిన్ను; నా గారాన్ని, నా బంగారాన్ని, నాముద్దుల మురిపాన్ని నిన్ను."

"నువ్వేనా? ఎవరో అనుకున్నాను. నువ్వేనా నా చేతిని పట్టుకుని నక్షత్రాల మధ్యనించి ఆడుతూ, నవ్వుతూ, అట్లా తేలివొచ్చి నన్నిక్కడ దించింది? ఓసారి కనపడు."

"తెల్లారనీ, నన్ను చూద్దుగాని. ఇప్పుడు పడుకో."

"భయమేస్తోంది. కిందికి పడిపోతానా?"

"నేను పట్టుకున్నాను కాదూ!"

"ఆకలేస్తోంది అమ్మా!"

పువ్వు నోట్లోకి వెచ్చగా, తియ్యగా, వొంటినంతా సంతోషంతో నింపుతో పాలు వొచ్చాయి.

"వొచ్చావా?" అని వొళ్లో పెట్టుకుని వూపింది గాలి.

"అమ్మా! ఏమిటి అట్లా పాకుతోంది నా వెనక?"

"ఏం లేదు; అది పాము. తిండికోసం తిరుగుతోంది."

"నన్ను తింటుందా?"

"నిన్నెందుకు తింటుంది? చాలా మంచిది. పిట్టపిల్లల్ని తింటుంది! మన జోలికి రాదు."

పెద్ద పెద్ద చెట్ల వెనకనించి అర్ధచంద్రోదయమౌతోంది. కళ్లు పెద్దవిగా విప్పింది పువ్వు. చెట్ల కొనలు మెరుస్తున్నాయి. నేల మీద సందుల్లోంచి చారలుగా వెన్నెల పాకుతోంది. చీకటిని పక్కలకి తోసుకుంటూ. చుట్టూ అడివిని చూసి

"చూడు, అమ్మా చూడు," అంటూ చప్పట్లు కొట్టి ఆడింది పువ్వు.

నిద్రకళ్లతో పాడుతోంది తల్లి.

తలెత్తి తల్లి వంక చూసింది.

"ఎంత అందంగా వున్నావు అమ్మా!"

తన కళ్లకి అందక తల్లిని తీగెలు చీకట్లలోకి పెనవేసుకున్నాయి. పరిమళాలలో విరబోసుకుని నల్లని నీడల్లో వూగుతున్నాయి ఆకు గుబుర్లు.

"ఎవరి మీదనమ్మా కావిలించుకుని అల్లుకున్నావు? అతనెవరు గంభీరంగా అట్లా నుంచున్నాడు నీ బరువు మోస్తూ."

"మీ నాన్న."

"ఆమ్మా, అమ్మా, అమ్మా! ఎవరు అట్లా కిరకిరమంటారు! అమ్మా, పట్టుకో నన్ను."

"అవి కోతులు. మీ నాన్న కోసం వొస్తాయి. నిన్నేం చెయ్యవు

అవి."

"మరి నాన్న వాటిని..."

తన పేరు పిలుస్తున్నారు, పాడుతూ. వెన్నెలలో తేలి తనచుట్టూ మూగుతున్నారు పుష్పకిన్నెరలు. తనెరుగును వాళ్లని.

"పుట్టావా? నువ్వు ఇక్కడ పుట్టావా?"

చుట్టూ మూగి, పువ్వుని కదుగుతున్నారు. రేకుల్లో చిన్న చిన్న నొక్కులు అందంగా దిద్దారు. మంచు ముత్యాల హారాలు వేశారు. వాళ్ల వెనక తనకి కనపడకండా నీడలో ఎవరు నుంచున్నారు? తనకి తెలుసు ఎవరో! ఎప్పటెప్పటినించీ, అనంతకాలంనించి, అనేక రూపాలలో, అనేక లోకాలలో, అనేక ఆనందాలలో తనతో చెయ్యి కలిపి ఎన్నడూ తనని వొదలని ఆ నీడ ఎవరు?

తన తల పైనుంచి, చీకట్లలోనించి, తియ్యని పిలుపు, దూరంగా దేనికోసమో అరుపు, ఆకులన్నీ నిలిచి వింటున్నాయి. గాలి చిన్న తరంగాలతో పులకరించింది.

ఎవరు? ఎవరు? ఎంత వెతికినా కనిపించని ఎవరు?

"అమ్మా. అమ్మా. ఎవరు?"

"కోవెల."

"ఎవర్నీ పిలుస్తుంది?"

"ప్రియుణ్ణి."

"రాదేం?"

"చీకటి."

"మళ్లీ పిలవమను."

"పిలుస్తుంది."

"ఎంత అందమమ్మా ఈ లోకం? నేనెక్కడ వున్నాను ఇక్కడికి రాక!"

పువ్వుకి ఎదురుగా, జ్వలించే పెద్ద కాంతి పుష్పం అంధకారపు తూర్పుశాఖన వికసించి జ్వలిస్తోంది. తేలికగా కప్పి నవ్వించే మబ్బు తెరలోంచి తన వెలుగు చేతుల్ని జాస్తోంది పువ్వు వేపు.

ఉత్సవాలు, వాయిద్యాలు, అరుపులు, సంతోషాలు. వూదుస్తున్నారు, తోరణాలు కదుతున్నారు, జయజయధ్వానాలు చేస్తున్నారు. ప్రతి మబ్బుకీ రంగుల్ని అలంకరిస్తున్నారు. ఆత్రుతగా, సంతోషాన్ని ఆపుకోలేక, ఇటూ అటూ పరుగెత్తుతున్నారు, అనిల కుమారులు దుమ్ముదులుపుతూ, అందర్నీ మేలుకోమంటూ, ఎండిన ఆకుల్ని దూరంగా తోసేస్తూ. చెట్లు గాలిలోకి నోళ్లు తెరుచుకుని ఆరగిస్తున్నాయి ప్రథమ భోజనాన్ని.

కాంతి, కాంతి. ప్రపంచమంతా కాంతి. ఆకాశాన్నంతా ఆనందంతో నింపుతూ కాంతి. అలల మల్లే కాంతి విరుచుకుపడుతోంది లోకంమీద.

లోకం రూపమే మారింది. సగం చందమామ నవ్వుతో నమస్కరించి ఆకాశం లోపల కరిగిపోయినాడు. లోకాధిపతివలె వెలిగిన వేగుచుక్క భయంతో ఏ మూలకో వొదిగాడు, మబ్బులు సిగ్గుతో రంగుల్ని కడిగేసుకుని, తెల్లని వొళ్ళుతో పక్కపక్కల ముడుచుకున్నాయి.

దేదీప్యమానమైన కాంతితో ఎర్రగా, ఎక్కడా కల్మషాన్నీ, అంధకారాన్నీ, అల్పత్వాన్నీ సహించని, క్షమించని దివ్యనిర్మల తేజస్సులు చిమ్ముకుంటూ బయలుదేరాడు మార్తాండుడు.

పక్షులన్నీ రెక్కలు చాచి ఎగురుతున్నాయి. మృగాలు వొళ్లు విరుచుకుని కదులుతున్నాయి. పవనకుమారులు చెట్ల ఆకు చివర్లలో కూచుని భయంగా చూస్తున్నారు.

సమస్తమూ మరిచి కళ్లు తెరుచుకుని చూస్తున్న పువ్వువైపుకి తీక్షణంగా ఒక్క కిరణాన్ని విసిరాదు సూర్యుడు.

"చచ్చాను." అని కళ్లు మూసుకుంది కన్య. వొళ్లంతా వొణికింది. దెబ్బతిన్నట్టు సొమ్మసిలింది. తానంతా ఎర్రగా ఐపోయింది. ఒక్కసారి తన మెదట్లోంచి, నేలలోంచి చీల్చుకుని తనలోకి దిమ్మరించే అమృతంతో తానంతా నిండిపోయింది.

"అమ్మా!" అని ఒక్క అరుపు అరిచింది. భయం కాదు. సంతోషం కాదు. చావు కాదు. పుటక కాదు. నవయవ్వనం.

తనలోకి ఆ లేత ఎండ, వెన్నెల, కింద గడ్డి నవనవ, ఆకాశంలోని నీలపు నునుపు, తన తండ్రి కొమ్మల బలం, కోవెల కంఠంలోని జాలి, గాలిలోని అర్థంలేని అల్లరి, తన తల్లి వేళ్ల కింది భూమిలోని అనర్గళ సారం అన్నీ ప్రవహించాయి.

తన రేకుల్లో తళతళలు, తన యీనెల్లో నున్నటి వుబుకు, తన బొడిపెల్లో పగలడానికి సిద్ధమైన మదపు సౌరభం, తన తొడిమలో విశాలమౌతున్న బలం, తన సమస్తంలో ఆగని, అంతులేని కారణం లేని కాంతి.

అకస్మాత్తుగా తనని ముంచుతో, చీలుస్తూ, పైన దొర్లే సముద్రం అలలమల్లే, మూర్ఛలు తెప్పించే పరిమళం. తనని, తల్లిని, గాలిని, ఆకాశాన్ని నింపి, పొర్లి, అలలుగా, జ్వాలలుగా తనలోనించి పరిమళాలు.

పట్టలేక ఫక్కుమని నవ్వింది. ఆ నవ్వు ఎండకే కాంతినిచ్చింది.

ఆ మత్తుకి, ఆ మాధుర్యానికి ఆకాశం కిందికి దిగి రావొద్దా? గాలి యీ వార్త ముల్లోకాలలో ప్రకటించవొద్దా? ఆ కాంతి అంతా ఒకటై తనకి హారతి ఇవ్వద్దా? చెట్లు, పక్షులు, కీటకాలు, మృగాలు, యీ అనంతాకాశం, సూర్యచంద్రులు, యీ లోకమే తన పరిమళ సౌభాగ్యం కోసం సృష్టి పొందలేదా?

తన ముందు ఇంకెవరు?

అల్లరిగా గంతులేసింది. చప్పట్లు కొట్టింది. కళ్లలోంచే కాంతుల్ని విసిరింది. ఎవరు అటు వెళ్లినా ఆకుల వెనక దాక్కుని తొంగిచూసి పకపక నవ్వింది. తన రేకుల్ని వూపింది. పరిమళాల్ని ఎక్కడా అంతంలేని భాగ్యం మల్లే విరజిమ్మింది ప్రపంచం మీద.

సంగీతాలతో, నృత్యాలలో సోలుతూ, తూగుతూ, చుట్టూ మధుపాలు సేవించి వెంబడి రాగా, పూలని లెఖ్కకింద తలెత్తి చూడకుండా, గర్వంగా, యవ్వనంతో మదించి, వొంటినిండా పచ్చని పుష్పరజం చల్లుకునిపోతున్నాడు మధూపం.

ఎండలో రజంలోంచి నల్లగా మెరిసే అతని దేహం, క్రూరమైన తొండం, రక్తం వలె ఎర్రనైన కళ్లు, గాలిని శూలాలవలె గుచ్చే పెద్ద మీసాలు చూసి వొణికింది పువ్వు.

"అమ్మా! ఎవరది?" అని తల్లి ఆకుపచ్చ పమిటలో దూరింది.

నవ్వి కూతురు తల నిమిరింది.

"నీ జోలికి రాడులే." అంది కొంటెగా తల్లి.

"రాడా! ఎంత పొగరు?" అంటూ ఆకుల్లోంచి సగం తొంగిచూసి, పరిమళాల్ని విసిరింది పువ్వు. వూపిరాడనీక మొహానికి అడ్డుపడి, రెక్కల బలాన్ని లాగేసే ఆ పరిమళానికి తలతిరిగి ఆగాడు మధూపం.

"అమ్మా! ఆగాడు." అంది భయంగా పువ్వు.

కాని తనని ఆగనీక, నిలవనీక, ఏమిటి ఆ బాధ, తియ్యని మత్తెక్కించే ఆ వేదన! ఏమిటో తనకి తెలీక, భయపెట్టి, తనని తొందరచేసే ఆ కాంక్ష!

తిరిగాడు తన వేపు.

పొమ్మన్నాడు అనుచరుల్ని. మళ్లీ ఇంకోసారి కొత్త పూరజం అతని నిండా చల్లి అలంకరించి ఎగిరిపోతున్నారు మిత్రులు. చుట్టూ ఆకులమీద వాలి నవ్వుతున్నారు, పోకిరివాళ్లు.

తనవేపు ఎగురుతున్నాడు అతను, బలంగా, ధైర్యంగా అతనికి ఎవరు ఎదురు అన్నట్టు. ఎండలో మెరుస్తూ, తేలుతూ, గాలిని చీల్చుకుంటూ వొస్తున్నాడు అనివార్యంగా.

సిగ్గు, సిగ్గు, సిగ్గు.

తన గర్వం, తన ఆధిక్యత, విజృంభణ... ఏమీ లేవు. దాక్కుంది ఇంకా లోపలగా.

వొస్తున్నాడని భయం, సంతోషం.

తీరా రాడేమోనని దిగులు, న్యూనత.

వొస్తున్నాడని గర్వం, సిగ్గు.

ఏమిటి అంత స్వతంత్రం?

ఏమిటి ఇంత ఆలస్యం?

తను తప్ప ఇంకేం కనపడకండా ఐ, తనచుట్టూ ప్రాధేయపడి పాడాలి.

తాను మాత్రం అందక, ఆకుల్లో తప్పించుకుని వేధించాలి.

నిర్లక్ష్యంగా, అవలీలగా, ఆకుల్ని వొత్తిగించి, తనని నలుగురి ముందూ బాహాటం చేశాడు. క్రీగంటితో చూసి, "పో, ధూర్తుడా!" అంది. కాని తన కంఠస్వరమేనా అది? ఏమిటా తియ్యదనం? ఆ ఆహ్వానం? తనెంత ప్రయత్నించినా తనకి లోబడని ఆ హృదయారాటం?

వెడల్పయిన స్వరంతో, జుమ్ముమనే ఆ ఆపులేని ప్రేమగీతాన్ని ఆలపిస్తూ తన చుట్టూ తిరుగుతున్నాడు - ముందుకాళ్లని తనవేపు జాచి. రెక్కలమీద రంగురంగులుగా మెరుస్తూ ఎండ. అతని వొంటిమీది రజపు మదపువాసన తలతిప్పుతోంది.

పొంగివొచ్చే వరదమల్లే ముంచేసింది, తనకింకేం తోచకుండా ఆ మధుపగీతం. సముద్రపు హెూరుమల్లే, రక్తపు పోటుమల్లే.

అడుగుతున్నాడు, నవ్వుతున్నాడు, తల వొంచి ముందు కాళ్లతో ప్రాధేయ పడుతున్నాడు. "నీకోసమే అనంతకాలంనించి వెతుకున్నాను. నా ఐశ్వర్యాన్ని నీ పాదాల ముందు గుమ్మరిస్తాను. తలెత్తి ఒకసారి నావంక చూడు," అంటున్నాడు.

అన్నీ అబద్ధాలు. కాని, ఎంత మధురమైన అబద్ధాలు!

నీవొక్కతవేనే నాకు అన్నాడు. ఆ పుష్పరజమంతా ఎక్కడిదో? ధూర్తుడు.

తెల్లని రేకలు మెరిపించి చిన్న నవ్వు నవ్వి దాక్కుంది ఆకులమధ్య గాలి సహాయంతో.

అతను, బలహీనంగా, మృదువుగా కొమ్మల్లోనూ దాక్కునే తన కోసం! ఇంకా రాడేం, వెళ్లిపోడు కదా! మెరుస్తూ, రెక్కల వూపుతో, లెక్క లేని పువ్వులమధ్య ముల్లోకాలలో అవలీలగా సంచారం చేయగలిగిన అతను - ప్రత్యేకం తనకోసం - తన ముందు ప్రాధేయపడుతున్నాడు.

"పో!" అంది, పోతాడేమోనన్న భయంతో.

మధూపం ఆ మాటతో ఆమె తన స్వంతమైనట్టు, అధికారమైనట్టు, సంకోచం లేకుండా విహరించే రాజ్యసీమ ఐనట్టు, కరుకుగోళ్లతో, మృదుపత్రాలు ఏమౌతున్నాయో అనే దృష్టి లేకుండా వాలాడు పువ్వుమీద.

"అమ్మా!" అని పెద్ద కేకేసింది - ప్రాణం పోతున్నట్టుగా.

అమ్మ పలకలేదు. తనని వొదిలారా? అందరూ వొదిలారా? ఇదే అంతమా? తన ప్రాణాలు ఎగిరిపోతున్నాయి.

నిర్దయగా, ఏమీ తన అనుజ్ఞ లేకుండా, క్రూరంగా, గోళ్లతో చీల్చి, తల దూర్చి, తను ఎన్నడూ తనలో ఉన్నదని తెలీని, తన గర్భకుహరాంతరాన్ని, తొండంతో ఛేదించి తాగుతున్నాడు మధువునంతా.

వొళ్లు చీలికలౌతోంది. రక్తాన్నే తాగుతున్నాడు. వెనక కాళ్లతో పక్కల్ని సాగతీసి చింపుతున్నాడు. ఇంక తనెట్లా బతకడం? ఎట్లా మొహమెత్తడం?

కాని అప్రయత్నంగా రేకలతో అతన్ని కప్పి దాచుకుంది. తన ఈనెలతో సన్నని వొంపుతీరిన నడుముని కావిలించుకుని దగ్గరికి

లాక్కుంది. తనలోని పచ్చని పరిమళపు గంధాన్నంతా అతని నిండా చల్లింది. తననే తానర్పించుకుంది.

ఇంక నన్ను వొదిలివెళ్లకుమని వేడుకుంది. నేను నీదాన్నంది. నీకన్న ఇంకేం లేదంది.

ఇంకా, ఇంకా. ఇంకా – నాలో ఇంకేం మిగలకుండా నా ప్రాణాన్నే, ఆత్మనే తాగెయ్యమని రహస్యం పలికింది.

ఝల్లుమంది వొళ్లు. తాను చూసిన సూర్యులు వెయ్యిమంది మన కళ్లముందు భగ్గుమన్నారు. రాత్రి నక్షత్రాలన్నీ ధగధగ తనచుట్టూ నాట్యం చేశాయి. సముద్రాలు హెూరుమన్నాయి. ఎట్లా భరించడం యీ ఆనందం, యీ బాధ, యీ తీపి, యీ తీపు!

గుండె బద్దలు కాదా! నాళాలు చీలిపోవా! తన రేకులే చించుకుని రాలిపోవా?

ఆగలేక పట్టుకుంది. దగ్గిరిగా కప్పేసింది. మూర్ఛపోయింది.

వొదిలేశాడు తనని. కరుణామయుడు, మధురమూర్తి. తనని వొదిలేసి, తన కళ్లలోకి నవ్వాడు. ఏమియ్యగలదు తాను? చాలా హాయిగా, సంతుష్టితో తన కళ్లల్లోకి నవ్వాడు.

ఎవరు? తానెట్లా తీర్చుకోగలదు, ఈ కృతజ్ఞతని?

నమ్రతతో నమస్కరించింది.

తనమీద కాళ్లూని, అవలీలగా గాలిలోకి ఒక్క దూకు దూకి, చీకటివెలుగులాగు మెరిసి రెక్కల్ని జాచి, ఒక్క చూపు తనవైపు వెనక్కి చూడకుండా,

వెళ్లిపోయినాడు, ఆతని నెచ్చెలిగాళ్లని ఒక్క కేకతో పిలిచి. వాళ్లతో ఉల్లాసంగా నవ్వుతూ తన ఉనికినే మరిచి, అతని వెంటబడి అడ్డుపడే తన హృదయాన్నే తోసేసి, తనకు తెలీని, తాను అందుకోలేని, నీలపు లోకాల్లోకి, ఆకుపచ్చ కాంతుల మధ్యనించి ఎగిరిపోతున్నాడు. కనపడ్డంత దూరం దిగులుతో తల వొంచి చూస్తోంది. తానా? కదలడం చాతకాదు.

ఆకుల తెరలచాటున సిగ్గుగా పెరిగిన కన్య. ఏమని తాను లోకుల కళ్లముందు, సిగ్గు విడిచి, అతన్ని అనుగమించగలదు?

తనకే రెక్కలుంటేనా? ఇంక ఎటూ చూడకుండా తల్లిని, తండ్రిని, ఆకుల్ని, మిత్రుల్ని, సమస్తమూ మరిచి అతని వెంట సహచారిణి ఐ సేవ చెయ్యదా?

కాని అబల.

తన చుట్టూ చిన్నచిన్న వనకన్యలు చేరి పాడుతున్నారు. దీవిస్తున్నారు. లాలిస్తున్నారు.

తన వొంటివంక గర్వంగా చూసుకుంది. ఎంతో సాఫల్యంతో, నిండుతనంతో, లోతులో, బరువెక్కిన తనవంక చూసుకుని పొంగిపోయింది.

సూర్యుడు పైకి లేచి పెద్ద చెట్ల ఆకు నీడల్ని మంటపెడుతున్నాడు. గుంపులుగుంపులుగా చిలకలు, ఆకుపచ్చ మెరుపుల మల్లే ఎగిరిపోతున్నాయి. సీతాకోక చిలకలు తప్పతాగి ఎండలో తూలుతున్నాయి. రంగు రెక్కల్ని గర్వంగా గాలిలో చాచి, సోమరిగా తేలిపోతున్నాడు గరుడుడు మబ్బుల మధ్య.

మెల్లిగా పొట్టివైపోయే నీడల్ని సోమరిగా చూస్తూ, శాంతంగా కూచుంది పువ్వు బలంగా శక్తిని భూమి వేళ్లలోంచి తనలోకి లాక్కుంటో. తన అందమంతా పోతేనేం? పరిమళం లేకపోతేనేం? కేసరాలు అవిసి వొడిలి తన పత్రాల మీదనే వాలిపోతేనేం? తన వైపుకి కాంక్షతో మధుపాలు చూడకపోతేనేం? ఇప్పుడు తన చూపు తన లోపలికి... తన జీవితానికి అర్థమే మారిపోయింది.

తన లోపల కొత్త ప్రాణం కదులుతోంది. చోటు కోసం వెతుక్కుంటూ తన పక్కల్ని సాగతీస్తోంది.

మధూపం తననిండా విరజిమ్మిపోయిన పుష్పరజంతో పచ్చనై జారిపోయిన తన పత్రాల్ని ఎండ వెచ్చదనానికి వప్పచెప్పి, తన చుట్టూ జరిగే సృష్టి ఉత్సవంలో తానూ ఒక ముఖ్యపాత్రధారిణిననే గర్వంతో, ఇంకేం కావాలి అనే స్తిమితంతో, నిర్లక్ష్యంగా చూస్తోంది – క్షణమైనా ఆగక నిరంతరంగా అలలమీద నాట్యం చేసే సృష్టి లీలని.

గాలి మీద చిందులు తొక్కుతోంది ఎండ.

ఆకాశాన మధ్య మండిపడే భాస్కరుడి కంటపడింది. ఆ పువ్వుతల్లి. క్రూరంగా చూస్తో ఎదట నిలిచింది కాలం. పరిమళం లేని, మధువు లేని, రంగు తప్పిన ఆ పువ్వుని అనవసరమని తల వూపింది సృష్టి. రేకులు రంగుతప్పి ముడతలుపడ్డాయి. కేసరాలు ఒక్కొక్కటే వూడి జాలిగా కింద ఆకులమీద రాలి గాలివూపుకి దుమ్ములో పడ్డాయి. కాని దృష్టిని తన గర్భం వేపు తిప్పి, తననీ, తన అందాన్నీ, ప్రపంచాన్నే మరిచింది పువ్వు.

మబ్బులనించి చివరి రంగుల్ని పిలుచుకుని సూర్యుడు ఎప్పుడు కడసారి శలవు చెట్ల చిటారికొమ్మల మీది గరుడులనించి తీసుకొనివెళ్లిపోయాడో, ఎప్పుడు శాంతిగీతాల్ని వాయుకుమారులు పాడి కొమ్మల్లో కూచున్నారో, ఒక్క క్షణం విశ్రాంతి లేక తిరిగిన జీవులన్నీ ఎక్కడెక్కడ అన్ని వ్యావృత్తుల్నీ వొదిలి నీడల్లో వొదిగాయో, పక్షులూ, కోతులూ తన తలపై గుబుర్లలో ఎప్పుడు మాటుమణిగాయో, గమనించనైనా లేదు పువ్వు. వెతికివెతికి మూలమూలల దాక్కున్న వెలుతురుని మింగేస్తోంది వెయ్యి నాలికలతో చీకటి.

మొదటి నక్షత్రపు మిణుకుమిణుకులోంచి జారిన కాంతిరేఖమీద కూచుని వొచ్చి నిలిచాడు తన ముందు.

తన పేరు పిలిచాడు.

"ఎవరు?" అంది పువ్వు. కాని తెలుసు తనకి.

గజగజ వొణికింది. చుట్టూ చూసింది ఏడుస్తూ.

"రా." అన్నాడు.

నువ్వు నడిచిన దారి

చీకటి హృదయాలకు ఉపశమనం

(2వ భాగం)

పద్మజాషా

తెలుగు అనువాదం: శివలక్ష్మి



దాదాపు ఇరవై సంవత్సరాల తరువాత, సుధా భరద్వాజ్ నివసించే ప్రపంచంలోకి ఇషా ఖండేల్వాల్ వచ్చారు. సుధా భరద్వాజ్ ఎదుర్కొంటున్న సమస్యలనే ఆమెతో సమానంగా, ఇషా ఖండేల్వాల్ కూడా ఎదుర్కొంటూ అంతే తీవ్రమైన రూపాలలో ప్రతిఘటిస్తున్నారు.

ఇషా మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో నివసించే ఒక రిటైర్డ్ బ్యాంకు అధికారికి రెండవ కుమార్తె. ఆమె తల్లి ప్రభుత్వ కళాశాలలో ఒక ప్రొఫెసర్. కళాశాల విద్యార్థిగా ఆమె జీవితం భద్రంగా, సంతోషంగా గడిపేశానని చెప్పారు ఇషా. నీముచ్‌లో తలిదండ్రుల మధ్య పెరిగేటప్పుడు, సీబీఎస్ఈ సిలబస్ పాఠ్య పుస్తకాలు తప్పించి ఏమాత్రం చదవలేదని ఆమె చిరునవ్వుతో ఒప్పుకున్నారు. ఆంగ్ల భాష మాట్లాడటం ఎలాగో తెలుసుకోవడానికి ఆంగ్ల వార్తా టెలివిజన్‌ని చూడమని వారి తండ్రి వారిని ప్రోత్సహించేవారు. ఇషాకు ఇంజనీరింగ్‌లో ఆసక్తి లేదు. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పట్టభద్రురాలయింది. అయితే, కళాశాలలో ఉన్నప్పుడు ఆమె అభిరుచులు రాజకీయ రంగం వైపుకి మళ్లడం ప్రారంభమయింది. కళాశాల రెండో సంవత్సరంలో ఆమె హఠాత్తుగా న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఒక న్యాయవాది కావడానికి ముందు సమాజాన్ని అర్థంచేసుకోవాలని బలంగా ఆకాంక్షించారు. అందువల్ల ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ లా ప్రోగ్రాంలో ప్రవేశించారు. అది ఒక రకంగా సొంత ఇంటికి ప్రయాణించడం వంటిది.

అక్కడే న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్న షాలిని గీరాను ఆమె కలుసుకున్నారు. షాలిని, ఇషా ఇద్దరూ కళాశాల న్యాయ సహాయక సంఘంలో ఆసక్తిగా పాల్గొనేవారు. మధ్యప్రదేశ్ నుండి

"నా పాపాయి." అంది.

"నీ ప్రాణాన్ని నీ పాపాయికిచ్చి నాతో రా." అన్నాడు నవ్వుతో.

"ఎట్లా రానూ!" అని అరిచింది చివరి అరుపు.

తన చేతిని పట్టుకుని, కన్నీళ్లు తుడిచాడు.

"చూడు," అన్నాడు.

లోకమంతా పెద్ద వెలుగు. అన్ని రూపాల్నీ, భిన్నత్వాల్నీ తనలో కరిగించుకుంటున్న మెత్తని వెలుగు. నేలమీది ఎండుటాకులనించీ, ఆకాశాన నక్షత్రాలదాకా, అన్నిటినీ ఏకంచేసే దివ్యకాంతి. అంతా, అంతా, ఆ వెలుగంతా అతను. అన్ని చోట్లా అతను.

పొట్టలోని ఆకల్లని నింపుతూ, పట్టుకు చీల్చుకు తింటూ, చీకట్లో దాక్కుంటూ, పిల్లలకి రసం తాగిస్తూ, చంపుస్తూ, ఏడుస్తూ, నవ్వుతూ, కోపంతో, దూకుతూ, ఆనందంతో వూగుతూ - ప్రతిమూలా అతను, తన పాపాయిని లాలిస్తూ తాగిస్తూ, అతను.

"రా!"

నవ్వుతూ, తన వార్ధక్యం, నిరర్థకత్వం, ఎండుతనం అంతా పోయి, బాల్యం, యవ్వనం, బలం, సంతోషం, మాతృత్వం, ప్రేమ, అన్నీ అతని ముందు అర్పించి మొక్కింది.

అతని చెయ్యి పట్టుకుని ఆనంతాకాశంలోకి ఒక్క దూకు దూకింది.

ఇంక భయమనేది లేదు. విచారం లేదు. సందేహంలేదు. సమస్తమైన ప్రపంచంతో, కాలంతో అతి సన్నిహితుడతడు. అతని వేళ్లను పట్టుకున్న తననింక ఏ మూల ఏ రూపంతో నిలిపినా ఆ కొత్త వుండదు. తన కోసం చేతులు జాచివుంటాయి. చిరునవ్వులు వెలిగివుంటాయి. తన ఆగమనం కోసం గొప్ప విలువలుంటాయి.

ఆకాశంలో తేలుతూ, భక్తితూ అతని మొహం వంక చూసి ఫక్కున నవ్వింది - ఆనందాన్ని అణుచుకోలేక.

(1948 - భారతి, రజితోత్సవ పత్రికలో ఈ కథ ప్రచురితం అయ్యింది)

వచ్చిన ఇషా, ఛత్తీస్‌ఘఢ్ వంటి ప్రదేశాలలో ఏమి జరుగుతోందో మొట్ట మొదటిసారిగా తెలుసుకోవడం మొదలుపెట్టారు. ఎలాగంటే ఆ సమయంలోనే శాలిని, సోనీ సోరి కేసులో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. అప్పుడే బినాయక్ సేన్ విడుదల కోసం ప్రచారం కూడా ముమ్మరంగా సాగుతోంది. షాలిని గీరా ద్వారా, ఇషా ఢిల్లీలో పౌర హక్కుల సమాజానికి చెందిన విభాగాలకు పరిచయమయ్యారు. మానవ హక్కుల న్యాయవాదులతో అభిప్రాయాలు పంచుకోవడం ప్రారంభించారు. అకస్మాత్తుగా ఇలాంటి పనులు చేయడానికే న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేయాలనుకున్నానని మనసులో ఆమె కర్థమైంది. న్యాయం పొందడానికి ఆమె చట్టాన్ని ఒక సాధనంగా చూస్తారు. అలా చేయలేకపోతే న్యాయవాదిగా కొనసాగడంలో అర్థమేమీ లేదనుకున్నారామె.

ఒక మార్వాడీ సామాజిక వర్గానికి చెందిన బలమైన సంప్రదాయవాద నేపథ్యంగల కుటుంబం నుంచి వచ్చారు ఇషా. న్యాయవాదిగా, అందులోనూ మానవ హక్కుల న్యాయవాదిగా పని చెయ్యాలనుకుంటున్న విషయం ఆమె కుటుంబ సభ్యులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఛత్తీస్‌ఘఢ్ వెళ్ళి ఆదివాసీలతో పనిచేయడమేమిటి పిచ్చి, వెర్రి కాకపోతే అని ఆందోళన చెందారు. "ఆదివాసీల పట్ల అన్యాయాలూ, ఎన్నెన్ని తప్పులు జరుగుతున్నాయో అర్థం చేసుకుంటున్న మా నాన్నకి భావజాలపరంగా వ్యతిరేకత ఉండేది కాదు. కానీ వాళ్ళు విపరీతంగా భయపడిపోయారు. నా మీద ఎంత విశ్వాసమున్నప్పటికీ, ప్రభుత్వానికే మా నాన్న తన మద్దతునిచ్చారు. రాష్ట్రాలకున్న విశేషాధికారాలు మా నాన్నకు తెలుసు. రాష్ట్రాన్ని ప్రశ్నించి, సవాలు చేసేవాళ్లను ఎంతకైనా తెగించి తుదముట్టిస్తుందని ఆయనకు తెలుసు"- అని అన్నారు ఇషా.

జాగ్ లాగ్ (జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్) ద్వారా ప్రారంభం నుంచి, సుదీర్ఘకాలం బస్తర్‌లో పనిచేస్తున్న నందిని, సుధా భరద్వాజ్ వంటి మరి కొందరు వ్యక్తులు బస్తర్‌లో పని చేయగలిగిన తమదైన ఒక గ్రూప్ తప్పనిసరిగా ఉండాలనుకున్నారు. ఎందుకంటే సల్వాజుడుం సమయంలో, ప్రతి ఒక్కరూ ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోయారు. బస్తర్ నుంచి భూమి సమస్యలు, జరుగుతున్న ఘోర సంఘటనల గురించి రిపోర్ట్ చేసేవారెవరూ లేరు. అండర్ ట్రయల్స్‌లో ఉన్నవారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఆ సంఖ్య రోజు రోజుకీ పెరిగి పోతుంది. సమస్యను పరిశీలించడానికి పరిశోధకుల బృందం అవసరమని వారు భావించారు. వారు పరిశోధన చేయటానికి సమూహంగా ఉండకూడదు అని కూడా వారు భావించారు, అయితే అవసరమైనప్పుడు అక్కడ జోక్యం చేసుకోగలిగిన న్యాయవాదులకు వారు శిక్షణ ఇవ్వాలనుకున్నారు. శాలిని అప్పటికే ఛత్తీస్‌ఘఢ్ ముక్తి మోర్చాతో కలిసి పని చేస్తున్నారు. సుధా భరద్వాజ్ ట్రేడ్ యూనియన్ అసోసియేషన్‌లో ఉన్నారు. ఇషా మొదటిసారి ఛత్తీస్‌ఘఢ్‌ను సందర్శించినప్పుడు, ట్రేడ్ యూనియన్ కార్యకర్తగా పని చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు.

కానీ ఒక చట్టపరమైన సహాయ బృందాన్ని ప్రారంభించే ఆలోచనలతో ఆ బృందంలో చర్చ జరుగుతుండగానే, నెమ్మదిగా అక్కడున్నవారిలో చాలామంది పనిచెయడానికి సిద్ధమై ముందుకొచ్చారు. స్థానిక న్యాయవాదులు కూడా ఆ అవసరం వుందని అంగీకరించారు. 2014 ఎన్నికల ముందు, ప్రభుత్వాన్ని ప్రజల సమస్యలకు స్పందించేలా, మరింత బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా చెయ్యడానికి ఈ బృందం ఏర్పడింది. వెంటనే సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని సేకరించడం మొదలుపెట్టారు. అసలు జైలులో ఉన్నవారెందరు? వారిలో అండర్ ట్రయల్స్‌గా జైలులో ఉన్నవారెందరు? వారెలాంటివారు? వారెలాంటి కేసుల్లో ఎలా ఇరికించబడ్డారు? ఇప్పుడేం జరుగుతోంది అనే సమాచారం అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ కమిటీ చట్టబద్ధంగా జోక్యం చేసుకోవడం ప్రారంభించింది.

ఈ ప్రదేశాల్లో సహజసిద్ధమైన సెక్సిజం ఎలా పని చేస్తుందనే విషయాన్ని చాలా తమాషాగా, ఆసక్తికరంగా చెప్పారు ఇషా. ఇక్కడి అధికారులు జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్‌లో పని చేసే యువతులు హానికరమైన వారు కాదని భావించి, తరచూ వారిని కాపాడుతుంటారు. వారు ఖైదీలను కలుసుకోవడానికి, వారితో మాట్లాడటానికి, స్థానిక న్యాయవాదుల బృందంతో కలిసి పనిచేయడానికి, చివరికి వారితో కలిసి ఒక సదస్సు నిర్వహించడానికి కూడా అనుమతించేవారు. అయితే జస్టిస్ వికె అగర్వాల్ పరిధిలోని సర్కేగుడా ఎన్‌కౌంటర్లో న్యాయవిచారణ ప్రారంభమైనప్పుడు పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి.

2012లో, జూన్ 28, 29 తేదీల మధ్యలో వచ్చే 'బీజ్ పండుమ్' అనే పండుగ కోసం ప్లాన్ చేసుకోవడానికి సర్కేగుడా, కొట్టగూడ, రాజ్ పెంట గ్రామస్తులు సర్కేగుడాలో గుమికూడారు. ఈ మూడు గ్రామాలకు చెందిన పదిహేడు మందిని భద్రతా బలగాలు బిజాపూర్‌లో చంపేశాయి. మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్ సమయంలో 'బీజ్ పండుమ్' చేసుకుంటున్న గ్రామస్తులు చనిపోయారని భద్రతా బలగాలు అసత్యాలు చెప్పుకొచ్చాయి. దాన్ని ఖండిస్తూ, అది పూర్తిగా అబద్ధమని అక్కడ ఎటువంటి ఎన్‌కౌంటర్ జరగలేదని గ్రామస్తులు ఖచ్చితంగా చెప్పారు. ఇక ఈ విచారణలో జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ గ్రామస్తుల్ని ప్రతినిధులుగా తీసుకోవడం ప్రారంభించింది.

2012లో తమ పనిని ప్రారంభించిన సమయంతో పోలిస్తే, 2014 నాటికి జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ వారు స్పష్టమైన మార్పును చూశారు. కొత్త ఇన్స్పెక్టర్ జనరల్ ఎస్.ఆర్.పి. కల్లూరీని తీసుకొచ్చారు. ఇషా మాటల్లో, 'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో వారు చర్చ కోసం, సంభాషణ కోసం చూశారు. వారు కనీసం ఒక్కమాటైనా మాట్లాడతారేమోనని ఎదురు చూశారు. కానీ ఢిల్లీలో ఈ కొత్త ప్రభుత్వం వచ్చిన, ఒక నెల తర్వాత కల్లూరీని తెచ్చారు. రాజ్‌నాథ్‌జీ ఒక ఇంటర్వ్యూలో చర్చలేమీ జరగబోవని ప్రకటించారు. చర్చలు ప్రమాదకరంగా మారుతాయన్నారు'.

త్వరలో జాగ్‌లాగ్ వారు ప్రతిచోటా వారి మీద గట్టి నిఘా ఉందని గ్రహించారు. ఇషా ఈ విధంగా అన్నారు, "కొత్త ప్రభుత్వం

మా మీద కాస్తంత ఆసక్తి కనబరిచినట్టుగా అనిపించి, మేము కొత్త ఇనస్పెక్టర్ జనరల్ కల్లూరిని కలుసుకుని, మేము ఏ పని చేస్తున్నామో వివరించి చెప్తామని నిర్ణయించుకున్నాం. మేము అతన్ని కలుసుకున్నప్పుడు, అతను చెప్పిన విషయాలు నన్ను దిగ్భ్రాంతికి గురి చేశాయి. 'ఛత్తీస్‌ఘఢ్‌లో అత్యంత క్రూరమైన అధికారిగా నాకు పేరుంది' అని చెప్పుకోవడానికి అతను చాలా గర్వపడుతున్నాడు. అతను చాలా కఠినుడని అతని కర్ణ కఠోరమైన కంఠధ్వని సూచిస్తుంది. అతనలా చెప్పగలడని గానీ, చెప్తాడని గానీ మేమసలు ఆలోచించలేదు. ఇది పూర్తిగా మా ఊహకందని విషయం!" కల్లూరితో తన సంభాషణ గురించి ఇషా కొనసాగిస్తూ, "మీకు సుధా భరద్వాజ్ తెలుసా? మీకు నందిని సుందర్ తెలుసా? అయితే మీరు మా శత్రువు కేంప్‌లో ఉన్నట్లే, ఓకే, మీరు మీ పని చెయ్యండి, మేము మా పని చేస్తాం" అని కల్లూరి అన్నారు. అంతే, సంభాషణ ముగిసింది! "కల్లూరి మీడియాను పిలిచి, జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ సభ్యులు నక్సలైట్ల మద్దతుదారులని ప్రచారం చేయడం మొదలెట్టారు. ఆయన ఆ గ్రూప్ సభ్యులు నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నారని చెప్పేవారు. నేను నక్సలియన్ కేసులు చేస్తున్నానని చెప్పుకునేవారు. భూమి కార్యకలాపాలు తీవ్రతరం కావడంతో, తప్పనిసరిగా, జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ ప్రమేయం కూడా తీవ్రమైంది.

సోనీ సోరి 2014లో జైలు నుండి బయటపడింది. ఆమె మూసేసిన ఎన్నో కేసులను తిరిగి పైకి తెస్తూ, వాటికోసం ఒత్తిడి చేస్తూ, పనిచేయడం ప్రారంభించింది. జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ బాధితులకు ప్రాతినిధ్యం వహిస్తూ, వారి పక్షాన నిల్చింది. మాలిని సుబ్రహ్మణ్యం కేసుల గురించి నివేదికలిస్తున్నారు. బేలా భాటియా కేసుల గురించి రాస్తున్నారు. ఖచ్చితమైన సమాచారాన్ని రాబట్టడానికి వివిధ కోణాల నుండి అందరూ సంయుక్తంగా చేస్తున్న ఒక తీవ్ర ప్రయత్నమిది. "ప్రతిచోటా కనిపిస్తూ పనిచేసే ఈ మహిళల సమూహంతో ఎలా డీల్ చెయ్యాలో, ఏమి చేయ్యాలో తెలియక వారు అలసిపోయారు. మేము ఏమి జరిగిందనే దాని గురించి సత్యాన్ని బయటికి తీసుకువచ్చాం. సమాచారం బయటికి వచ్చింది. మా గొంతులు బిగ్గరగా ఉన్నాయి"-అన్నారు ఇషా నవ్వుతూ.

వేధింపు తీవ్రతరమైంది. సోని ఆప్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించటానికి వెళ్లినప్పుడు, ఆమె సహచరుల్ని అరెస్టు చేస్తారు లేదా సోనిని హింసలు పెడతారు. 2015లో, గ్రామాల మీద యాదృచ్ఛిక దాడులు, ప్రజల అరెస్టులతో దర్భా సంఘటనలు ప్రారంభమైనప్పుడు, జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ కొన్ని కేసులకు ప్రాతినిధ్యం వహించింది. ఆ సమయంలోనే కొంతమంది కేసులను రిపోర్టు చేస్తున్న పాత్రికేయుడు సంతోష్ యాదవ్‌ను అరెస్టు చేశారు. సంతోష్ యాదవ్ కేస్‌కి కూడా జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ ప్రాతినిధ్యం వహించింది. జగదల్పూర్ బార్ అసోసియేషన్, జగదల్పూర్‌లో, జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ న్యాయవాదులు పని చేయకూడదని తీర్మానించింది.

ఇషా ఇలా అన్నారు- "తీర్మానం పాస్ చేసే ముందు బార్ మమ్మల్ని ఆపడం, ప్రశ్నించడం ప్రారంభించింది. నేను బార్ అసోసియేషన్ గురించి మాట్లాడుతున్నప్పుడు, నాన్ ఆదివాసీ న్యాయవాదుల గురించి మాట్లాడుతున్నాననుకోవాలి. ఉత్తర్‌ప్రదేశ్ నుండి, బీహార్ నుండి వచ్చినవారున్నారు. ఈ మా వివాదం పట్ల వారు చాలా ఆసక్తితో ఉన్నారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనల నుండి వారు డబ్బు సంపాదిస్తున్నారు. అందరూ అలాంటివారని నా ఉద్దేశ్యం కాదు, కొందరు సున్నితమైన న్యాయవాదులు కూడా ఉన్నారు. సెన్సిటివ్ లాయర్స్ గనక స్థానిక సమస్యల గురించి పనిచెయ్యాలనుకుంటే అది వారికి కష్ట తరమవుతుంది. వెంటనే సులభ టార్గెట్స్‌గా మారిపోతారు. జగదల్పూర్ బార్-పోలీసులు ఒకటే మాటగా ఉంటారు. కాబట్టి మాకు ఏమి జరుగబోతుందో మాకు తెలుసు. అప్పుడు నా మీద, శాలిని మీద నకిలీ డిగ్రీలతో అనుమానాస్పద న్యాయవాదులుగా ఉన్నారనే ఫిర్యాదు మోపారు.

వెంటనే, లైంగిక వేధింపుల కేసులు వెలుగులోకి రావడం ప్రారంభమైంది. డబ్ల్యుఎస్ఎస్ (WSS) అంటే విండోస్ షేర్ పాయింట్ సర్వీసెస్ (windows Share point Services) అనే సంస్థ ద్వారా నిజనిర్ధారణ కమిటీలు అనేక కేసులను తీసుకు వచ్చారు. మీడియా కూడా కేసుల నివేదికలివ్వడం ప్రారంభించింది. 2016, జనవరి నుండి, వారు మాలినిని బెదిరించడం మొదలు పెట్టారు. బీజాపూర్‌లో బేలా భాటియా, సోనీ సోరీ, నందిని సుందర్ ముగ్గురి దిష్టి బొమ్మలను దహనం చేశారు. సోనీ సోరీ ఇంటికి చంపేస్తామనే బెదిరింపులు వచ్చాయి. మాలిని సుబ్రహ్మణ్యం ఇంటిమీద రాళ్ల వర్షం కురిసింది. ఒక చర్చిమీద దాడి జరిగింది. జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ వారి కేసును తీసుకుంది. వార్తాపత్రికల్లో 'నక్సలైటైన క్రైస్తవుల' కేసులకు జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కథనాలు వచ్చాయి.

కలెక్టర్, కమీషనర్ల బృందం ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్లనక్కరలేదని వారించారు. అయినప్పటికీ, మాలిని పనిమనిషిని పట్టుకుని రకరకాలుగా హింసించి వేధించారు. ఇషా, షాలిని నివాసముంటున్న ఇంటి యజమానిని రాత్రివేళ బంధించి తీసుకువెళ్లి వాళ్లిద్దరినీ ఇల్లు ఖాళీ చేయించి వెళ్లగొట్టమని బెదిరించారు. అతను నడిపించుకుంటున్న ఒక కారు వల్ల వచ్చే ఆదాయం మాత్రమే అతని జీవనోపాధి. ఆ కారుని స్వాధీనం చేసుకుని, మేము జగదల్పూర్ విడిచిపెట్టిన తర్వాత మాత్రమే అతనికా కారు తిరిగి ఇచ్చారు. జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన రోజే, సోని సోరి ముఖం మీద నల్లటి రసాయనాన్ని పోసి, ఆమె ఎవరో గుర్తు తెలియకుండా ఉండడం కోసం అమానుషంగా దాడి చేశారు. ఇప్పుడు మొత్తం జగదల్పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్ బృందం చెదరగొట్టబడింది కానీ ఇప్పటికీ వేర్వేరు ప్రాంతాల నుండి పనిచేస్తోంది.

ఇషా మధ్యప్రదేశ్ నుంచి వచ్చినప్పటికీ, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలోని ఘర్షణాయుతమైన వాతావరణం 2000 నుండి మాత్రమే

బయటపడింది. బస్తర్లో చాలా పౌర సమాజ కార్యకలాపాల గురించి ఇషాకు తెలియదు. ఇప్పుడు కూడా, రాజకీయ పార్టీలు క్రియాశీలంగా ఉన్నాయి, కానీ దళిత అధికార్ మంచ్, కోయా భూంకాల్ సమాజ్ వంటి కొన్ని సంస్థలకు పౌర సమాజ ప్రమేయం చాలా పరిమితంగా ఉంది. స్థానిక ఆదివాసీ సమస్యలను లేవనెత్తిన ఎవరినైనా ఎదిరించగల డబ్బు, శక్తి, ప్రభావాన్ని కలిగి ఉన్న శక్తివంతమైన ఆదివాసీలు కాని ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు నిరంతరం బస్తర్ నుండి బయటికి వెళ్లగొట్టాలనే ఉద్దేశ్యంతో స్థానికులైన కాంగ్రెస్ నాయకుడు మనీష్ కుంజం, సోని సోరి వంటి వ్యక్తులను కూడా వేట కుక్కల్ని వేటాడినట్లు వెంటపడి వేధించగలరు. ఒక ఎన్‌కౌంటర్ సమస్యను లేవనెత్తి నందుకు మహేంద్ర కర్మ భార్య అయిన రేవతి కర్మపై అపహరణ కేసును బుక్ చేశారు.

"రాష్ట్రం కఠోరంగా, ఘోరంగా మారింది. వారు చెడ్డ పేరొస్తుందనే భావనకీ, అవమానాలకీ అలవాటు పడిపోయారు. ఏమాత్రం ఒత్తిడికి గురి కారు. వార్తాపత్రికలు కొన్ని నిజాల్ని రాస్తున్నప్పటికీ వాటి గురించి వారికేమీ పట్టింపు లేదు. ఈ లోపల అమాయక జీవుల్ని పెద్ద సంఖ్యలో లక్ష్యంగా చేసుకుని, నాశనం చేస్తున్నారు"- అని ఇషా చెప్పారు.

శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై వనరులను రక్షిస్తూ, పెంచుతూ, ఆ నీడలో తామూ జీవిస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్న వారొకవైపు- అభివృద్ధి పేరుతో ప్రకృతిపై ఆధారపడిన జీవితాలను దోపిడీ చేయడానికి, ప్రకృతి బిడ్డలను సర్వనాశనం చెయ్య తలపెట్టిన వారు మరొకవైపు, ఈ దారుణమైన యుద్ధానికి పరిష్కార మార్గమేమిటి అని నేను సుధా భరద్వాజ్ గారినీ, ఇషా ఖండేల్వాల్ గారినీ ఇద్దరినీ అడిగాను.

సుధా భరద్వాజ్ ఇలా చెప్పుకొచ్చారు - హింసల తీవ్రతను అణిచి వెయ్యాలి. వారు తమ తమ గ్రామాలకు తిరిగి రావాలని, వారి జీవితాలను శాంతితో పునఃప్రారంభించటానికి ఒక మార్గం సృష్టించడం చాలా అవసరం అని సుధ చెప్పారు. పౌర పరిపాలనను తప్పనిసరిగా పునరుద్ధరించాలి. కొంతకాలంపాటు అన్ని గనులు, వృక్షాలు, మొక్కలపై ఒక తాత్కాలిక నిషేధాన్ని విధించవలసి ఉంటుంది. మైనింగ్ ప్రాజెక్టులు, స్థానభ్రంశం వలన సైనికీకరణ అవసరం పడింది. ఉదాహరణకు, రాఘఘాట్ ప్రాంతంలో రాఘాట్ గనులను తెరవడానికి, ప్రభుత్వం 24 BSF శిబిరాలను ఏర్పాటు చేసింది.

"ప్రజలు నివశించడానికి అనుమతించాలి. మీ సొంత పార్లమెంటు ఆమోదించిన పెసా (PESA) వంటి చట్టాలను అనుసరించండి. వారి సమ్మతిని తెలియజేయడానికి ప్రజలకు అవకాశమివ్వండి. వారికి కావలసిన అభివృద్ధిని వారే నిర్ణయించుకునే చొరవనివ్వండి. ఇవాళ పాలకులకు ప్రతి ఒక్కరూ ఒక శత్రువుగా, మావోయిస్ట్‌గా కనిపిస్తున్నారు"- అని సుధా భరద్వాజ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

1980లలో ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్‌లో ఇంకా భాగంగా ఉన్నప్పుడు, అప్పటి మంత్రిగా ఉన్న రామచంద్ర సింగ్దేయో బస్తర్ కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ పథకం అన్ని గ్రామాలనూ, ఆదివాసీల సాంప్రదాయిక వృత్తులన్నింటినీ పంచుకుంది. బస్తర్ ఖనిజాలతో సమృద్ధిగా ఉందని ఈ ప్రణాళిక గుర్తించింది. కాని వారి తక్షణ దోపిడీ తీసుకువచ్చే మార్పులను అధిగమించడానికి సమాజం సిద్ధంగా లేదు - అని సుధా భరద్వాజ్ గుర్తు చేసుకున్నారు.


పల్లెటూళ్లలో నిత్యావసర వస్తువులను ప్రతిరోజూ అమ్మే వర్తకుల మార్కెట్, ఇతర మార్కెటింగ్ వ్యవస్థలు ప్రారంభంలో బలోపేతం చేయాలని ఈ ప్రణాళిక సిఫార్సు చేసింది. వ్యవసాయం, అటవీ ఆధారిత కుటీర పరిశ్రమలు ప్రారంభించాలి. సాధారణ, సాంకేతిక విద్యలను ప్రోత్సహించాలి. తద్వారా ప్రజలు పారిశ్రామికీకరణ ద్వారా తెరవబడిన అవకాశాల ప్రయోజనాలను పొందగలుగు తారంటారు సుధా భరద్వాజ్. "అది చేయటానికి సెన్సిబుల్‌గా ఉండాలి. ఖనిజాలు ఎక్కడికీ పోవు కదా? కానీ ప్రపంచం ఆర్థిక సంక్షోభంతో కొట్టు మిట్టాడుతుంది. సాధ్యమైనంత వేగంగా ఖరీదు గురించే గాక, ఖనిజ వనరుల దోపిడీ వైపు రద్దీ ఉంది. వేచి చూసే పరిస్థితే లేదు. దానికోసం ప్రజల ప్రాణనష్టం ఎంతగానైనా ప్రభుత్వాలకు పట్టదు. ఆదివాసీ సామూహిక మారణ కాండతో మనం జీవిస్తున్న ఈ శతాబ్దం ముగిసే అవకాశం ఉందన్నారెవరో! ఇప్పటికే మన కళ్లముందే అనేకమంది నిరాశ్రయులైన గ్రామస్తులు నకిలీ పోరాటంలో చంపబడుతున్నారు"- అని సుధా భరద్వాజ్ వాపోయారు.

వయస్సులో సుధా భరద్వాజ్ కంటే ఇషా ఖండేల్వాల్ 20 ఏళ్లు చిన్నదైనప్పటికీ ఇద్దరూ వివిధ రూపాల్లో అవే పోరాటాలు కొనసాగిస్తున్నారు. ✿

ఆమె అనంతం

ఆమె నిర్ణయం!

తులసి



వట్టి పిరికిది... సంప్రదాయవాది... జీవితాన్ని అనవసరంగా వృథా చేసుకుంటోంది... మొన్నటిదాకా తనపై నా అభిప్రాయాలివి. ఇప్పుడు కాదు. ఆ నిర్ణయం తీసుకుంది తనేనా అనిపిస్తోంది. ఆరేళ్ల నుంచి నేను చెవిలో జోరీగలా నసపెడుతున్నా ఎప్పుడూ ఆ వైపు దృష్టి కూడా పెట్టని తను, ఇప్పుడు మనస్ఫూర్తిగా నిర్ణయం తీసుకుందంటే తనలో కంటే నాలోనే ఒక ప్రకంపన.

కీర్తి ఆరేళ్లుగా తెలిసినా... పరిచయమైన ఏడాది తర్వాతగానీ తన జీవితం గురించి నోరు విప్పలేదు. మా ఇద్దరి స్వభావాలు భిన్నంగా ఉన్నా స్నేహితులమయ్యాం. ఇద్దరి వయసులో చాలా తేడా ఉంది. నా కంటే తను 16 ఏళ్లు పెద్ద. కానీ నేను ఆరిందలా సలహాలిస్తే నవ్వుతూ స్వీకరించేది. ఆ ఒక్క విషయంలో తప్ప నా ఆలోచనలను ఎప్పుడూ గౌరవించేది. బహుశా మా అమ్మ, శేఖర్ తర్వాత నన్ను అంతలా ఇష్టపడ్డ వ్యక్తి తనే. అందుకే తన జీవితంపై నాకు చాలా కలలుండేవి. ఎవరి మనసూ నొప్పించని తత్వం తనది. ఎవర్నైనా తిట్టాల్సి వచ్చినా ముందుగా వారిలోని మంచిగుణాలను పొగిడాకే తిట్టే రకం. తనకు బంధుగణం, తోబుట్టువులు చాలామందే ఉన్నా వ్యక్తిగతంగా ఒంటరి అని తెలిసినప్పుడు మనసు చివుక్కుమంది. ఇంత మంచి మనిషి, మనిషితో పోటీపడే అందమైన మనసున్న మనిషి ఎందుకు ఒంటరైందో తెలుసుకోవాలనిపించింది. ఆ విషయాన్ని నేరుగా అడగకుండా పెళ్లెప్పుడు చేసుకుంటారు అనే మరో రూట్లో అడిగేదాన్ని. మా ఇంటికి రా అన్ని విషయాలూ చెప్తానంది. ఓ సారి వెళ్లాను. అన్నీ చెప్పింది. అవేమీ పెద్ద తెలుసుకోవాల్సిన విషయాలు కాదు. పిల్లల జీవితాలను పెద్దలు శాసించడం వల్ల జరిగిన యాక్సిడెంట్లు. ఒక్క శాతం కూడా తన ప్రత్యక్ష ప్రమేయం లేకుండా వందశాతం బాధను పాతికేళ్లుగా నెత్తిన మోస్తోంది తనవి కాని ఆ నిర్ణయాల ఫలితంగా. బాధను అనుభవించడం తప్ప ఆ బాధ్యతను ఎవరిమీదా మోపలేదు తను. పాపం తన బాధను మనసారా పంచుకోవాలని తన గురించి స్నేహితులకు చెప్పాలని ఎప్పట్నుంచి అనుకుందో... అంతా చెప్పాక తన కళ్లు కట్టలు తెంచుకున్నాయి. చిన్న పిల్లకు పెద్ద గాయమైతే వెక్కి వెక్కి ఏడ్చినంతగా ఏడ్చింది. తుఫాను వెలిశాక... భోంచేస్తూ అడిగాను. చిన్నప్పుడు పెళ్లి గురించి, ప్రేమ గురించి మీ ఆలోచనలు ఎలా ఉండేవని. అప్పుడు చెప్పింది.

జీవితాన్ని నలుపు తెలుపు రంగుల్లో తప్ప, ఈస్ట్‌మన్ కలర్లో ఎప్పుడూ చూడలేదట. ఎవరొస్తారో తెలియని భర్తతో ఎన్నో ఊసులు చెప్పి, పాటలు పాడేదాన్నని, పుడతారో లేదో తెలియని పిల్లల్ని ఎలా పెంచాలో ఊహించుకున్నానని చెప్పింది. ఎప్పుడైనా భర్తకు తనపై కోపం వస్తే ఎలా బుజ్జగించాలో రాసిపెట్టుకున్నట్లు చెప్పింది. బయట పిల్లల్ని ఎవరైనా కొడుతుంటే తన బిడ్డల్ని ఒక్కసారి కూడా ఏడిపించకుండా ఎంత నేర్పుగా పెంచాలో నేర్చుకున్నానని చెప్పింది. ఆదివారం భర్తతో కలిసి సినిమాకు వెళ్లడం, వెళ్లొచ్చాక ఆ కబుర్లు చెప్పుకుంటూ పడుకోవడం... ఇద్దరికీ ఇష్టమైన పాటలు వింటూ సముద్ర తీరంలో కబుర్లు చెప్పుకోవడం... ఇవన్నీ అప్పట్లో తన కలలు, నాకు కథలు కథలుగా చెప్పిందారోజు. ఈ కథల్లో ఎక్కడా ఉద్వేగం, విషాదం, ఒంటరి జీవితాన్ని ఊహించినట్లు నాకు అనిపించలేదు. తను ఊహించుకున్న జీవితం వేరు. తన భర్త, పిల్లలే లోకంగా ఎలా గడపాలో మాత్రమే తను నేర్చుకుంది. కలలు కంది. కానీ తనకు జరిగిన పెళ్లి ద్వారా ఇవేమీ నెరవేరలేదు. పెద్దలు తెచ్చిన ఆ భర్తే తను కలలుకన్న వాడు అనుకుంది. కానీ అతను

అప్పటికే ఎవరినో ప్రేమించి ఆ విషయం ఇంట్లో వాళ్లకు చెప్పలేక సతమతమౌతున్నాడట. పెళ్లయ్యాక అతను ఆ ప్రేయసి కోసం వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోవడం కంటే కూడా తనను అంతగా ప్రేమించే వాళ్లు ఈ లోకంలో ఎవరూ లేరా అన్న బాధే తన మాటల్లో నాకు వినిపించింది. అప్పుడే కీర్తి కట్టుకున్న అందమైన ఇల్లు నిట్ట నిలువునా కూలిపోయింది. అప్పటికే ఇద్దరు అక్కలు పెళ్లి చేసుకోకుండా వాళ్ల జీవితాన్ని గడుపుతున్నారు. వాళ్లలో ఎప్పుడూ పెళ్లి చేసుకోలేదే అన్న బాధను చూడలేదు తను. అందుకే వాళ్లనే అనుసరించి తన ఆశలన్నీ ఆకాశానికి విసిరేసింది. అవి మళ్లీ తనను చేరుకునే రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. తన బతుకు తానే బతకాలని నిర్ణయించుకున్నాక ఒక ఉద్యోగం చూసుకుంది. సొంత ఇల్లు కొనుక్కుంది. ఆ ఉద్యోగం కారణంగానే మరో ఆలోచన లేకుండా పాతికేళ్లు గడిపేసింది.

అన్ని ఆఫీసుల్లో ఒంటరి మహిళలపై వేసినట్లే తనపైనా ఏవో పుకార్లు పుట్టించారు, వెనక్కి తిరిగి నిందలు వేశారు. వాటి గురించి ఎప్పుడైనా ఎవరైనా ఆమె చెవిలో వేస్తే భోరున ఏడవడం తప్ప గల్లా పట్టుకొని ఎవడ్రా నువ్వు, ఏం తెలుసురా నా గురించి నీకు... అని అడగలేని తీరు తనది.

కాస్త సంపాదన, ఇంట్లో ఏ బాదరబందీలు లేకపోతే ఒంటరి జీవితాన్ని మించిన సుఖం లేదన్నదే నా ఫీలింగ్ కూడా. ఈ విషయాన్ని మా శేఖర్‌కి చెప్తే సరే పిల్లల్ని వదిలి దేశాలు తిరిగొస్తానంటే పో అని కోప్పడినా నా అభిప్రాయం అదే. కానీ కీర్తి డిఫరెంట్. నాలా విశాల ప్రపంచంలో పక్షిలా ఎగరాలనుకునే రకం కాదు తను. తనకు ఓ గూడు, తోడు కావాలని కలలుగన్న పక్షిపిల్ల. అలా ఉంటేనే తను హ్యాపీ. అదే తన జీవిత లక్ష్యం అని చిన్నప్పుడే ఫిక్స్ అయ్యింది. కానీ పెళ్లి ద్వారా అయిన అనుభవం తనను భయపెట్టేసింది. కుదిపేసింది. మళ్లీ అటు వైపు చూడకుండా చేసింది. అందుకే అక్కల చాటు చెల్లిగా ఇంతకాలం ఉండిపోయింది. ఆ అక్కలిద్దరూ సంపాదించడం, తనూ ఉద్యోగం చెయ్యడం వల్ల ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేకపోయినా మానసికంగా తను ప్రశాంత జీవి కాదు.

ఆ రోజు తనతో పాటు వాళ్లింటికి వెళ్లి తన జీవితాన్ని చూసొచ్చాక నా మనసులో ఓ ఆలోచన వచ్చింది. కాస్త తనని ట్యూన్ చేసి ఎలాగైనా తను కలలుగన్న జీవితంలోకి పంపాలి అనుకున్నా. ఆ ప్రయత్నాలు చాలా చేశాను కూడా. ఎవరైనా కాస్త నిజాయితీగల నెమ్మదస్తులు కనిపిస్తే ఇలాంటి వ్యక్తైతే సూటవుతాడు అనిపించేది. ఒకసారి ఏదో సమావేశంలో మిస్టర్ కూల్ లాంటి వ్యక్తి కనిపించారు. ఏవో కారణాలతో పెళ్లి చేసుకోలేదని తెలిసింది. అప్పట్లో తను జీవితం గురించి ఊహించుకున్నట్లే నేను వీళ్ల జీవితాలు ముడిపడితే బాగున్నని ఊహించుకున్నా. ఆయన మామూల్ కూల్ కాదు... ఎదుటివ్యక్తి కోపంలో కోట శ్రీనివాస్‌రావు బ్రదర్ అయినా సరే, తను మాత్రం శోభన్‌బాబు తమ్ముడిలానో, ముదిరిన మహేష్ బాబులానో ప్రశాంతంగా డీల్ చేస్తారు. ఆయనతో ఎప్పుడూ తన గురించి చెప్పలేదుగానీ కీర్తి దగ్గర ఆయన కూల్ క్యారెక్టర్‌ని ఎస్టాబ్లిష్ చేసేదాన్ని. తాను విననట్టే ఉండి వెంటనే టాపిక్ మార్చేసేది. ఇలా కాదని ఓ రోజు నేరుగా మెసేజ్ చేశా. మీరు బాగా ఆలోచించండి... మీరు మానసికంగా సిద్ధపడితే అతను కరెక్ట్ పర్సన్ అని. నా గురించి మా పెద్దవాళ్లు తీసుకున్న నిర్ణయం అలా జరిగింది. ఇప్పుడు మళ్లీ నువ్వు నా గురించి నిర్ణయాలు తీసుకుంటున్నావా అంది. అంతే నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నిజమే కదా అనిపించింది. కష్టమో సుఖమో అది ఆమె జీవితం, తను ఒక విధానంలో సాగుతోంది. మళ్లీ మధ్యలో నా అజ్ఞాన ప్రదర్శన ఎందుకు అనిపించింది. ఎవరి అనుభవాలను బట్టి వాళ్ల జీవితాలుంటాయిగానీ, నేను ఊహించుకున్నట్టు ఎందుకు జరుగుతుందని నన్ను నేను కన్విన్స్ చేసుకున్నా. ఇంకా నయం అటు వైపు అతన్ని ఎప్పుడూ ఈమె పేరు చెప్పి కదపలేదు, లేదంటే నాకు రెండు వైపులా ఎర్త్ ఉండేది అనుకొని ఊపిరి పీల్చుకున్నా.

ఆ తర్వాత నేనెప్పుడూ మళ్లీ తన వ్యక్తిగత జీవితం గురించి సలహాలు ఇచ్చే సాహసం చెయ్యలేదు. ఎప్పటికైనా తను కలలుగన్న జీవితం తనకు దక్కాలని ఆశించా. తనకు సంబంధించిన విషయాలూ, వాళ్ల బంధువుల వివరాలు ఇలా ప్రతిదీ నాకు చెప్పేది. చివరికి ఎప్పుడో చిన్నప్పుడు విడిపోయిన తమ బంధువులతో ఈమధ్యనే ఎలా కలిసిపోయిందీ కూడా చెప్పింది. ఆ పల్లెటూరి వాతావరణం తనను ఎంతగా కట్టిపడేస్తోందో అలలు అలలుగా చెప్పేది. అలా చెప్తున్నప్పుడు తనలో కొత్త ఉత్సాహం కనిపించేది. మీ లాంటి వాళ్లకు పల్లెటూర్లే కరెక్ట్... ఓ పది రోజులు పొలంలో నాట్లేస్తే పల్లెటూర్లను రొమాంటిగ్గా చూసే ధోరణి మార్చుకొని వాస్తవాలు చూస్తారు అనే దాన్ని. నిజంగా అక్కడే ఓ గుడిసె కట్టుకొని ఉండిపోతే బాగున్ను అని తనూ అనేది. తను ఎప్పుడూ సెలవు పెట్టినా పల్లెటూరి పిల్లైపోయారా ఈ రెండ్రోజులూ అని టీజ్ చేసేదాన్ని. అదే తనకు ఆనందాన్ని ఇస్తోందని అర్థమైంది.

ఒక రోజు పొద్దున్నే ఫోన్ చేసి ఇవాళ బాక్స్ తెచ్చుకోవద్దమ్మా బయట తిందాం అంది. ఇద్దరం కలిసి హోటల్‌కి వెళ్లాం. అక్కడ మాకోసం ఓ అతిథి అప్పటికే ఎదురు చూస్తున్నారు. ఆయన్ను పరిచయం చేసింది కీర్తి. పేరు వాసుదేవ్. తన తరచూ వెళ్లే ఆ పల్లెటూరి బంధువు అని చెప్పింది. మీరు ఏం చేస్తున్నారు సార్ అంటే మీకు అన్నం చేసి పెట్టే పని చేస్తా అన్నారు. మామూలు రైతా, 'మహర్షి' లాంటి రైతా అన్నా. ఫ్యాషన్ కోసం కాదమ్మా... ప్యాషినేట్ రైతునే అన్నారు. బాగా చదువుకున్న మట్టి మనిషి అని అర్థమైంది. నా గురించి తనకు ఎంత తెలుసో ఆయన మాటల్లో అర్థమైంది. నా పిల్లలు, నా రాతలు అన్నీ చూసిన వాడిలాగే మాట్లాడారు. కీర్తి తనకు చాలా ప్రత్యేకం అని అతని ప్రతి మాటలో నేను గమనించాను. ఆమె తీరూ అదే చెప్తోంటే నాకు ఆ రోజు ఓ పండగలా తోచింది. భోంచేసి అలాగే ఇంటికి వెళ్లిపోయా. మర్నాడు కలిసినప్పుడు అడిగా... ఏంటి సంగతి అని. నువ్వు తెలివైనదానివి కదా అంది. అందుకే తెలుసుకున్నా. మరి పెద్దల సంగతి ఏంటీ అన్నాను. చాలానే జరిగాయని చెప్పుకొచ్చింది. చాలా ఏళ్ల క్రితం దూరమైన బంధువులు ఏడాది క్రితమే కలిశారట. 'వాసుదేవ్ నేను తరచూ వెళ్లొచ్చే ఆ పల్లెటూరి రైతు. ఆ మట్టిలా స్వచ్ఛంగా ఉండే అతని తత్వం నాకు నచ్చాయి. వాళ్ల ప్రేమాభిమానాలు నేను

జీవితంలో ఎప్పుడూ చూడనివి. వాసుదేవ్ అంటే ఎలా ఒక ఆరాధనా భావం మొదలైందో చెప్పలేను. అక్కడికి వెళ్లిన ప్రతిసారీ నా ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్టే ఉండేది. తనను చూస్తే నేను చిన్నప్పుడు ఊహించుకున్న జీవితం మళ్లీ మళ్లీ గుర్తొచ్చేది. తను నాకు దగ్గరగా ఉంటే ఏదో చెప్పలేనంత ధైర్యంగా అనిపించేది. ఈ వయసులో ఇలాంటి భావాలేంటి నాలో అని చాలా సార్లు చెక్ చేసుకున్నా. నా మనసు ఎక్కడా ఇది తప్పు అని చెప్పడం లేదు. అతను నన్ను అంతగా ప్రేమించడం వల్ల నాలో కలిగిన భావాలే ఇవి అని తెలుసుకున్న తర్వాత ఇక ఎక్కడా దాచిపెట్టలేదు. తను కూడా మా వాళ్లందరికీ నచ్చాడు.' అంది. అయితే ఇంకేం అంతా ఒప్పేసుకున్నారన్న మాట అన్నాను. 'నచ్చింది మా బంధువుగానేగానీ, నా సహచరుడిగా కాదమ్మా... చాలా జరిగాయ్' అని చెప్పుకొచ్చింది. 'అందరికీ నచ్చాడు కదా అని నన్ను పెంచి పెద్ద చేసిన అక్కకు ముందుగా చెప్పా. తన రియాక్షనే నేను ఊహించనంత షాక్ కొట్టేలా చేసింది. వాసు పేరు కూడా ఎత్తొద్దు అని చివాట్లు పెట్టింది. అతను ఇంటికి రావొద్దని కండిషన్లు పెట్టింది. అదేంటీ అంటే నా గురించి అంతా చెడుగా అనుకుంటారట. వాసుకు ఉన్న ఆస్తి చూసే నేను అతన్ని వల్లో వేసుకున్నానని అనుకుంటారట. లోకులు కాకులవడం ఎవరికీ మంచిది కాదట. మిగతా వాళ్లూ ఆమెకే వంతపాడారు. అవతల వాసు వాళ్ల ఇంట్లో కూడా సానుకూలంగా లేరు. మా మధ్య ఏవో చుట్టరికాలు కలుపుకుంటే ఇద్దరి వరసలూ సక్రమంగా రావట. వయసులో నా కంటే వాసు మూడేళ్లు చిన్న. అది కూడా అంతా తప్పుబడుతున్నారు.'

తను వయసు తేడా గురించి చెప్పినప్పుడు నాకు తనలో ఓ అంజలీ టెండూల్కర్, ఓ ఐశ్వర్యారాయ్... ఓ ప్రియాంకా చోప్రా కనిపించారు.

'వయసు, జాతకాలు, పెద్దవాళ్ల అనుమతి ఏవీ చూడకుండా నిర్ణయం తీసేసుకోవడమేనా... మీరు ఎలా కలిసుంటారు. వాళ్ల ఇంట్లో వాళ్లు ఏమంటారు. అది ముందే పల్లెటూరు, అక్కడ ఎన్నేసి అనుకుంటారు. నువ్వు మాతో ముందుగా చర్చిస్తే మంచీ చెడూ తెలిసేది కదా... జీవితంలో ఇప్పటికే తిన్న ఎదురుదెబ్బలు చాలవా' అన్నట్టు మాట్లాడారు మా వాళ్లు. నన్ను అన్నిటికంటే నేను ఆస్తి కోసం తనను వల్లో వేసుకున్నాను అని అంతా అనుకుంటారా అనేది పదే పదే గుచ్చింది. తన నెలసరి సంపాదన కంటే నా సంపాదనే ఎక్కువ కదా... నేను ఉన్న పళంగా ఉద్యోగం మాని తనతో అక్కడ కాపురం పెట్టెయ్యను కదా... నాకు ఇల్లు, సరిపోయేంత డబ్బు ఉన్నాయి కదా అని చెప్పింది నాతో. అయినా తనపై నేను ఆధారపడటం కాదు... తననే నేను పోషించగలను అన్న ధైర్యం నాకు ఉంది అని కూడా చెప్పింది.

మరి మీ వాళ్లను ఎలా డీల్ చేశారు... అన్నాను.

ఇంతకాలం నేను ఒక్కదాన్ని. ఇప్పుడు మేము ఇద్దరం కదా ఆ ధైర్యంతో చెప్పా...

'ఇది నా నిర్ణయం' అని...!!

పీడిత ప్రజల గొంతుక, పోరు పాటల కేతనం కామ్రేడ్ అరుణోదయ రామారావుకి విప్లవ జోహార్లు!




పీడిత ప్రజల గొంతుక, పోరు పాటల కేతనం కామ్రేడ్ అరుణోదయ రామారావు అకస్మిక మరణం పట్ల పీవోడబ్ల్యూ జాతీయ కార్యవర్గం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తుంది. అరుణోదయ రామారావు మరణం పీడిత, తాడిత ప్రజల విప్లవ పోరాటాలకు తీరనిలోటు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ కామ్రేడ్ రామారావుకి విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. కామ్రేడ్ అరుణోదయ రామారావు కర్నూలుజిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో 1955లో జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సి వరకు చదువుకున్నారు. చిన్నప్పటి నుండి కళలపట్ల, కళారంగం పట్ల ఎక్కువ ఆసక్తి కలిగివుండేవాడు. పద్యాలు, పద్యనాటకాలతో పరిచయం వుంది. 1973లో కర్నూలు జిల్లాలో జరిగిన రైతుకూలీ సంఘం మహాసభల సందర్భంగా "ఓ పల్లెటూరి కూలి రైతా" పాటతో విప్లవ కళారంగానికి పరిచయం అయ్యాడు. నీలం రామచంద్రయ్య తదితర విప్లవ నాయకుల పరిచయంతో కళారంగంలోకి ప్రవేశించాడు. ఆనాటి నుండి మరణించే వరకు పీడిత ప్రజల విముక్తే లక్ష్యంగా పోరాటమే ప్రాణంగా బ్రతికాడు. 1977లో జరిగిన ఎన్నికల ప్రచారంలో కామ్రేడ్ సత్యనారాయణ సింగ్ వక్తగా, కాశీపతి అనువాదకుడిగా, రామారావు పాటగాడుగా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ప్రశంసలందుకున్నారు.

విప్లవ సాంస్కృతిక సంఘం నిర్మాణ అవసరాన్ని గుర్తించి 1980 మార్చిలో ఒంగోలులో ప్రథమ అరుణోదయ రాష్ట్ర మహాసభలు నిర్వహించడంలో ప్రముఖమైన కృషి చేశారు. ఆ సభలో కామ్రేడ్ కానూరి వ్యవస్థాపక అధ్యక్షులుగా రామారావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తదనంతరం ఆయన ఇంటిపేరు అరుణోదయగా మారిపోయింది. రాష్ట్రంలో కానూరి రచించిన "విప్లవ సింహం రామనర్సయ్య" బుర్రకథలో రామారావు ప్రధాన కథకుడిగా, వంతలుగా సుంకన్న, కానూరి దళం రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. "అన్న అమరుడా మన రామనర్సయ్యా" అనేపాటతో ప్రేక్షకుల కళ్ళల్లో నీళ్ళు తెప్పించేవారు. జననాట్యమండలి తరఫున గద్దర్, అరుణోదయ తరుఫున రామారావు 1980 దశకంలో వివిధ సభల్లో పాల్గొని విప్లవ సాంస్కృతికోద్యమానికి మంచి గుర్తింపు తెచ్చారు. రాష్ట్రంలో అనేక శిక్షణా శిబిరాలు నిర్వహించి అనేక మంది కళాకారులను తీర్చిదిద్దారు. విప్లవ రాజకీయాల కొరకు నిలబడ్డాడు. అందరితో కలగలుపుగా వుండే రామారావు మరణం ఊహించనిది. ఆయన భార్య అరుణ కార్మికరంగంలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నది. వారికి ఇద్దరు కుమారులు. కామ్రేడ్ రామారావు మరణం విప్లవోద్యమానికి ముఖ్యంగా దళిత, ఆదివాసీ ఉద్యమాలకు తీరనిలోటు. ఆయనకు పీవోడబ్ల్యూ జాతీయ కార్యవర్గం విప్లవజోహార్లు అర్పిస్తోంది.

పీవోడబ్ల్యూ జాతీయ కార్యవర్గం

ఫోకస్

ఇష్రత్ జహాన్ మరణం- క్రూర మత రాజకీయాలు



రమాసుందరి

ఒకప్పటి గుజరాత్ పోలీసు ఆఫీసర్స్ డీజీ వంజార, ఎన్‌కె అమీన్ మీద కేసులను ఈ ఏడాది మే రెండవ తేదీన సిబిఐ కోర్టు కొట్టి వేసింది. 2004లో జరిగిన 'ఇష్రత్ జహాన్' నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో వీరు ముద్దాయిలు. సిబిఐ చేసిన విచారణలో; 'ఇష్రత్ జహాన్' అక్రమ నిర్బంధం, హత్య విషయంగా వీరిద్దరూ ఆరోపణలకు గురి అయ్యి గత 7 సంవత్సరాలుగా జైళ్లూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇప్పుడు వారు తమని వదిలివేయాలని వేసుకొన్న పిటిషన్‌ను కోర్టు ఆమోదించింది. వీళ్లిద్దరిలో డీజీ వంజార డిఐజీ రేంజ్ ఆఫీసర్. ఇది ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రభుత్వం వారిద్దరికీ ఇచ్చిన వరమో, లేక ఎన్నికల్లో వారు నోరు ఎత్తకుండా ఉంచే ప్రయత్నమో అర్థం కావాలంటే ఇష్రత్ జహాన్ పూర్తి కథను తెలుసుకోవాలి.

పోలీసు ఆఫీసర్లు జైలు శిక్ష అనుభవించటమేమిటి? స్వంత నేరాలకా? ఉద్యోగపరమైన నేరాలకా? పోలీసులకు ఉద్యోగపరమైన నేరాలు ఉంటాయా? చట్టాలు అలాంటి నేరాల గురించి ఏమి చెబుతాయి? వాటిని నేరాలు అంటారా? అసలు పోలీసులు ఉద్యోగపరమైన నేరాలు చేయటానికి కారణాలు ఏమై ఉంటాయి? వాటిలో వాళ్ల సొంత పైత్యం ఎంత? పొలిటికల్ వత్తిడులు ఎన్ని? ఈ ప్రశ్నలకన్నింటికీ ఇష్రత్ జహాన్ కథ సమాధానం చెబుతుంది. అంతేకాదు అధికార రాజకీయాలు ఎంత భయానకంగా ఉంటాయో, వాటికి కాషాయ రంగు అద్దితే అవి మైనారిటీల ప్రాణాలను ఎంత సులభంగా హరించి వేయగలవో కూడా ఆమె కథ చెబుతుంది.

అనేక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, క్రిమినల్ నేరాలు చేసి అధికార పీఠంపై మరో ఐదేళ్ల స్థానం సంపాదించిన బీజేపీ నేర చరిత్రను ఇష్రత్ జహాన్ ఒక్కత్తే చెప్పగలదు. బీజేపీ 2019 ఎన్నికలలో గెల్వటానికి నిన్న మొన్న పుల్వామాలో 40 మంది సైనికుల శవాలను ఎలా వాడుకొన్నదో, అంతకు ముందు 2002లో తానే సృష్టించిన గోద్రా తదనంతర మారణకాండలో మూడు వేలమంది ప్రాణాలను ఎలా బలి తీసుకొన్నదో- అలాంటి కథనే 2004లో అహమ్మదాబాద్ నడిరోడ్డు మీద పండపెట్టిన ఇష్రత్ జహాన్ శవం చెబుతుంది. ఇప్పటికీ 15 సంవత్సరాలు గడిచి పోయినా పసివాడని ఆమె అమాయక ముఖం, 'నేను చేసిన తప్పేమిటి?' అని ప్రశ్నిస్తున్నట్లుగా, అప్పటి బుద్ధిజీవుల స్మృతి పథం నుండి ఇప్పటికీ వైదొలగని ఆ ముఖం- బీజేపీ నేడు రక్తసిక్తమైన కాళ్లతో నడిచొచ్చిన హింసాత్మక దోవ గురించి కళ్లకు కట్టినట్లుగా చెప్పగలదు. ఇష్రత్ ఈ ప్రపంచంలో జీవించింది 19 సంవత్సరాలు అయినా; ప్రపంచం, రాజకీయాలు ఆమెకు ఏమీ తెలియక పోయినా; ఈ దేశంలో పుట్టిన ఒక మైనారిటీ యువతిగా ఆమె జీవితం పొడవునా, మరణం చుట్టూ అధికార దాహ రాజకీయాలు అల్లుకొని ఉన్నాయి. అందుకే ఒక్క 45 రోజులకే ఆమె కథ సుదీర్ఘమై పోయింది.

ఇష్రత్ జహాన్ ఎవరు?

ముంబైకి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముంబ్ర పట్టణంలో (థానే జిల్లా) నివసించే రెజా కుటుంబంలో పుట్టిన రెండో అమ్మాయి. రెజా కుటుంబం బీహార్ నుండి అక్కడకు వలస వచ్చింది. ఆమె కాకుండా ఆ కుటుంబంలో అయిదుగురు పిల్లలు ఉన్నారు. 2002లో ఆమె తండ్రి బ్రైన్ ట్యూమర్‌తో మరణించటంతో ఆమె కుటుంబం మొత్తం ఒక చిన్న అద్దె ఇంట్లో మిగిలిపోయింది. ఇష్రత్ ఇంటి పెద్ద కూతురు కానప్పటికీ, బాధ్యత వహించి కుటుంబ పోషణ కోసం చాలా పనులు చేసింది. అకౌంటింగ్ పని చేసేది. స్థానిక కోచింగ్ సెంటర్‌లో బోధించేది. ట్యూషన్లు చెప్పేది. ఇవన్నీ కాకుండా ఇష్రత్ స్థానిక కాలేజీలో బియేస్సీ రెండో సంవత్సరం డిగ్రీ చదువుతుండేది. వాళ్ల అమ్మ షమీమా కౌసర్‌కి ఎంబ్రాయిడరీ మీద వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. చెల్లెళ్లనూ తమ్ముళ్లనూ బాగా చదివించి వారికి గౌరవనీయమైన జీవితం అందచేయాలని తల్లీకూతుళ్లు కలలు కనేవారు. అన్ని చేతులు నోట్లోకి పోవటానికి నిత్యం కష్టపడటం తప్ప బయట ప్రపంచంలో ఏమి జరుగుతుందో కూడా వారికి పెద్దగా తెలియదు.

ఆమె చేసిన అనేక ఉద్యోగాలతో పాటు, ఇష్రత్ వాళ్ల కుటుంబానికి పరిచయం ఉన్న జావీద్ షేక్ అత్తర్ల షాపులో అక్కౌంట్స్ చూడటానికి పార్ట్ టైమ్ ఉద్యోగిగా చేరింది. ఆమె చనిపోయే సమయానికి కేవలం 45రోజుల ముందు మాత్రమే ఆమె ఆ ఉద్యోగంలో చేరింది. ఆమె కాలేజీ మధ్యాహ్నం 2 వరకే ఉండటంతో సాయంకాలం ఆమె షాపు పని చూసుకొనేది. కాలేజీలో ఆమెకు ఎప్పుడూ పూర్తి హాజరు ఉంటుంది. జావీద్ దగ్గర ఉద్యోగంలో చేరాక ఆ 45 రోజుల్లో కేవలం ఆమె 10 రోజులు మాత్రమే కాలేజీకి గైరు హాజరు అయ్యింది. ఆ పది రోజులు కూడా ఆమె అతనితో కలిసి ప్రయాణం చేసిన రోజులే.



ఇంతకీ ఈ జావీద్ షేక్ ఎవరు?

జావీద్ షేక్ అలియాస్ ప్రాణేష్ పిళ్లై కేరళలోని అలప్పుళ జిల్లాలోని తామరకులం గ్రామానికి చెందిన గోపినాథ్ పిళ్లై కొడుకు. గోపినాథ్ పిళ్లై ఉద్యోగ రీత్యా చాలా రోజులు పుణెలో ఉన్నాడు. కొడుకు పాలిటెక్నిక్ చదివితే ఉపయోగమని ఎలిక్ట్రికల్ కోర్స్‌లో పాలిటెక్నిక్ చదివించాడు. పుణెలో వారి కుటుంబం ఉన్నప్పుడే సాజిదా కుటుంబంతో ప్రాణేష్‌కు పరిచయం. తరువాత కాలంలో ముంబైలో ఎలిక్ట్రికల్ కాంటాక్ట్ పనులు చేసేటపుడు వారాంతాల్లో పుణె వచ్చి సాజిదా కుటుంబంతో స్నేహంగా ఉండేవాడని ప్రాణేష్ తండ్రి గోపీనాథ్ చెప్పాడు. సాజిదా, ప్రాణేష్‌లు ప్రేమించుకొని, ఆమెతో వివాహం కోసం ప్రాణేష్ ఆమె మతంలోకి (ముస్లిం) మారాడు. అప్పుడే అతని పేరు 'జావీద్ గులాం షేక్' గా మారింది. అదే పేరుతో పాస్‌పోర్ట్ సంపాదించి దుబాయ్ వెళ్లాడు. అయితే అంతకు ముందే అతనికి ప్రాణేష్ పిళ్లై పేరు మీద ఇంకో పాస్‌పోర్ట్ ఉండింది. దుబాయ్‌లో 18 నెలలు పనిచేశాక అతనికి అక్కడ ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అయితే అతను అంతక ముందు పనిచేసిన కంపెనీ అతని వీసాను రద్దు చేయటంతో అతను తిరిగి ఇండియా రావాల్సి వచ్చింది. అత్తర్ల షాపు పెట్టి అందులో నుండే ఒక ట్రావెల్లింగ్ ఏజెన్సీని నడపాలనుకొన్నాడు. దానికి లైసెన్స్ రాకపోవటంతో, అతని దుబాయ్‌లో లక్ష రూపాయల జీతంతో సీనియర్ కేబుల్ జాయినర్ ఉద్యోగం వచ్చినా, ఒక నెల అదనంగా ఇండియాలో ఉండిపోవాల్సి వచ్చింది. అదే షాపులో ఇష్రత్ పనిచేసేది. ఇష్రత్ చదువుతున్న గురునానక్ కల్సా కాలేజీలో ఆమె ఒక టర్మ్ ఫీజు 2500 జావీద్ కట్టాడు. ఇష్రత్ తండ్రి గతంలో జావీద్ దగ్గర పని చేశాడు. ఆ స్నేహంతో ఆమెను చదివించాలని అనుకొన్నానని తన తండ్రి గోపీనాథ్‌తో చెప్పాడు. ఆ విషయం జావిద్ భార్య సాజిదాకు కూడా తెలుసునని గోపీనాథ్ చెప్పాడు.

ఒంటరి ఆడపిల్లను ఆ ఉద్యోగంలో ఉంచటం తప్ప ఆమె తల్లి షమీమాకు వేరే మార్గం లేదు. నెలకు 3500 రూపాయలు జీతం ఇస్తానని ఒప్పుకొన్నాడు జావీద్. వేసవి కాలంలో పిల్లలు ట్యూషన్లకు రారు కాబట్టి, ఆ ఉద్యోగం తప్ప ఆ కుటుంబానికి వేరే గత్యంతరం లేదు. ఆ ఉద్యోగానికి ఇష్రత్ బయటకు వెళ్లే అవసరం కూడా ఉంటుంది. మొదటి రెండు ప్రయాణాలు పుణెకు, లక్నోకు జరిగాయి. మూడో ప్రయాణం నాసిక్‌కు వెళ్లాల్సి ఉంది. ఉద్యోగరీత్యా అయినా జావీద్‌తో కలిసి ప్రయాణం చేయటం తల్లికి ఇష్టం లేదు. అత్త ఇంటికి వెళుతున్నానని తల్లితో చెప్పి అతనితో మూడో ప్రయాణం అయ్యింది ఇష్రత్. ఆ ప్రయాణమే ఆ ప్రాణాలను బలికొన్నది. నాసిక్ నుండి జావీద్‌తో పాటు ఆమె దగ్గర పట్టణాలకు కారులో వెళ్లాల్సి ఉంది. తమ్ముడే వచ్చి 2004 జూన్ 11న ఆమెను బస్సు ఎక్కించాడు. అదే రాత్రి చెల్లికి ఫోన్ చేసి, తమను ఎవరో వింత వ్యక్తులు అనుసరిస్తున్నారని, భయంగా ఉందనీ చెప్పింది. అయితే జావీద్ తన దగ్గరే ఉన్నాడని చెప్పింది.

అలా చెప్పిన ఇష్రత్, జావీద్ ఇంకో ఇద్దరితో సహా జూన్ 15 తేదీన అహమ్మదాబాద్ సరిహద్దు ప్రాంతాల్లో ఒక జీప్‌లో ఎన్‌కౌంటర్ అయ్యి కనిపించింది. ఆ ఇంకో ఇద్దరు అంజాద్ అలీ రాణా, జిషాన్ జోహార్‌లు. వారిద్దరూ కాశ్మీరీలు. వారిద్దరిదీ వేరే కథ.

పోలీసులు ఇంటికి వచ్చి చెప్పిందాకా ఇష్రత్ కుటుంబానికి ఎన్‌కౌంటర్ విషయం తెలియలేదు. కుటుంబాన్ని మొత్తాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులు ఇంటికి తాళం వేసేశారు. అర్ధరాత్రి వరకూ వారిని వేధించి 2:30కు వారిని పంపించారు. తాళం వేసిన ఇంటి ముందు వారు తెల్లవార్లు గడిపారు. ఆమె లష్కర్ తోయిబా అనే తీవ్రవాద సంస్థకు చెందిన తీవ్రవాది అనీ, ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి, నేటి ప్రధాన మంత్రి నరేంద్ర మోడిని చంపటానికి లష్కర్ తోయిబా ఆమెను మానవబాంబుగా వినియోగించిందనీ పోలీసుల కథనాన్ని వాళ్లు శోకాశ్చర్యాలతో వినాల్సి వచ్చింది. ఏడు చేతులు లోపలికి పోవటానికి నిరంతరం శ్రమించే పిల్ల, కుటుంబం గురించి తప్పా ఇంకొకటి ఆలోచించని పిల్ల హటాత్తుగా ఎలా తీవ్రవాది అయ్యి చనిపోయిందో వారికి అర్థం కాలేదు. తీవ్రవాదులను కూడా ఎన్‌కౌంటర్ చేయొచ్చా, చేస్తే అది నిజమైన ఎన్‌కౌంటర్ అవునా, కాదా అనే ప్రశ్నలు వారికి అప్పుడు వచ్చే అవకాశాలు లేవు.

ఆ కుటుంబం తరువాత చాలా కష్టాలు పడింది. వారు ఉంటున్న ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చింది. ఒక తీవ్రవాది కుటుంబ సభ్యులుగా ముద్ర పడి, వారు అనేక అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎవరైనా వారికి సహాయం చేయ ముందుకు వస్తే వారు కూడా పోలీసుల వేధింపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కొన్ని మానవ హక్కుల సంఘాల, లాయర్ల సహకారంతో ఇష్రత్ తల్లి షమీమా కౌసర్ గుజరాత్ హై కోర్టులో పిటీషన్ వేసింది. తన కూతురు మీద జరిగింది నకిలీ ఎన్‌కౌంటర్ అనీ, ఆ ఎన్‌కౌంటర్ మీద సిబిఐ విచారణ జరగాలని ఆమె కోరింది.

అసలేం జరిగింది?

ఇష్రత్ చావుకి ముందు, తరువాత ఏమి జరిగిందీ అర్థం కావాలంటే మనకు ఈ క్రూర రాజకీయ వ్యవస్థ అనుపానులు అర్థం

కావాలి. పోలీసు, కోర్టుల భాష అర్థం కావాలి. చట్టాలకు ఎన్ని విధాలుగా భాష్యం చెప్పొచ్చో అవన్నీ తెలిసి ఉండాలి. న్యాయస్థానాలకు ఉండే పరిమితులూ, అధికారాలు తెలియాలి. మీడియా చేయగల మాయాజాలం, ప్రజలకు తెలియచెప్పటానికి అరుదుగా అది చేసే కృషి కూడా అర్థం కావాలి. పోలీసులలో ఉండే విభాగాలు, ఏ విభాగాలు ఎవరి కోసం పని చేస్తాయో తెలియాలి. వాటిలో ప్రభుత్వానికి దగ్గరగా ఉండేవి, ప్రభుత్వాలను శాసించే విభాగాలు కూడా ఉంటాయని అర్థం అవ్వాలి. ఇదంతా ఇప్పుడు చాలా మందికి అర్థం అవుతుంది. ఇంకా మెజారిటీ ప్రజలకు అర్థం కాలేదనే సత్యాన్ని ఇటీవల ఎన్నికలు రుజువు చేసినా, ఆనాటికి ఇవన్నీ చాలా కొత్త విషయాలు. ఎవరో గుప్పెడు మందికి తప్ప ఎవరికీ అర్థం కాని సంగతులు.

ఈ నకిలీ ఎన్‌కౌంటర్ గురించి పోలీసుల కథనం విన్న తరువాత, మీకెదన్నా సినిమా సీను గుర్తుకు వస్తే అది మీ తప్పు అవదు. క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఇన్స్పెక్టర్ జేజీ పర్మార్ సమర్పించిన ఎఫైయ్యార్ ప్రకారం ముందు 2004 జూన్ 1న అహమ్మదాబాద్ పట్టణ పోలీసు కమీషనర్ కేయార్ కౌశిక్‌కి అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడిపై హత్యా ప్రయత్నం జరగబోతుందని ఒక సమాచారం వచ్చిందట. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు వెంటపెట్టుకొని ముగ్గురు మనుషులు బ్లూ ఇండికా కారులో బొంబాయి నుండి అహమ్మదాబాద్ వస్తున్నారని జూన్ 14న క్రైమ్ బ్రాంచ్ జాయింట్ కమీషనర్ పీపీ పాండేకి సమాచారం వచ్చిందట. ఆ సమాచారంతో త్వరపడిన డీఐజీ డీజీ వంజార అహమ్మదాబాద్‌లో ఆరు చోట్ల దిగ్బంధనాలు ఏర్పాటు చేశాడట. తరువాత రోజు తెల్లవారు ఝామున 4గంటల సమయంలో, ఆ కారు అహమ్మదాబాద్ దక్షిణ సరిహద్దు నుండి నరోల్ చౌక్ దీ దాటిందట. ఎన్‌కె అమీన్‌తో పాటు పర్మార్, వారి బృందంతో అక్కడ ఉండి ఆ కారును వెంబడించారట. ఆ కారు ఎయిర్ పోర్ట్ రోడ్డు వైపు మలుపు తిరిగిందట. ఏసీపీ సింఘాల్ నాయకత్వంలో కొటార్‌పూర్ వాటర్ వర్క్స్ దగ్గర కారుని కనిపెట్టారట. అక్కడ మలుపులో కారు స్లో అవగానే ఏసీపీ సింఘాల్ బృందం నుండి ఒక కమెండో ఆ కారు వెనుక టైర్‌ను కాల్చాడట. అందువల్ల కారు ఆగిపోయిందట. కారులో ఉన్నవాళ్లు రెండు రివాల్వర్లు, రెండు కలాష్ నికోవ్‌తో విచక్షణా రహితంగా కాల్చారట. పోలీసులకూ, కారులో ఉన్న విద్రోహులకూ కాల్పులు జరిగాక కారులో మూడు మృత దేహాలు కనబడ్డాయట. ఇష్రత్ వెనుక సీటులో ఉందట. నాలుగో శవం రోడ్ డివైడర్ దగ్గర పడి ఉందట. ఈ ఎఫ్ఐయ్యార్‌లో పోలీసులకు ఎందుకు ఎటువంటి గాయాలు కాలేదో వివరాలు లేవు.

పోలీసుల ఎఫ్ఐయ్యార్ ప్రకారం అంజాద్ అలీ రాణా, జిషాన్ జోహార్‌లు పాకిస్తాన్ స్థావరంగా దక్షిణ ఆసియాలో పని చేస్తున్న లష్కర్ తోయిబా తీవ్రవాదులు. జావీద్ వారికి భారతదేశంలో దిశా నిర్దేశం చేయటానికి నియామకం అయిన వాడు. వీళ్ల ముగ్గురు గుజరాత్ అల్లర్లకు ప్రతీకారంగా నరేంద్ర మోడిని హత్య చేయదలుచుకొన్నారని ఎఫ్ఐయ్యార్‌లో పేర్కొన్నారు. విచిత్రంగా ఈ ఎఫ్ఐయ్యార్‌లో నాలుగవ వ్యక్తి ఇష్రత్ జహాన్ గురించి ఏమీ



రాయలేదు. ఆమె ఒక మహిళా తీవ్రవాది అని మాత్రమే రాశారు. నిజానికి చిన్న చిన్న దొంగతనాలు చేసే అంజాద్ అలీ రాణా, జిషాన్ జోహార్‌లను కాశ్మీర్ నుండి పట్టుకొచ్చి, వారిని పాకిస్తాన్ పౌరులుగా చిత్రించే ప్రయత్నం చాలా హాస్యాస్పదంగా చేశారు. వారి పాకిస్తాన్ పాస్‌పోర్టులు అని చెబుతూ కోర్టులో చూపించిన కాగితాలు చిత్తు కాగితాలలాగా ఉన్నాయని జావీద్ తరఫు లాయర్ అన్నాడు. వారి శవాలను స్వంతం చేసుకోవటానికి ఎవరూ రాలేదు.

ఒక కేసు - ఎన్నో విచారణలు

ఇష్రత్ తల్లి షమీమా, జావిద్ అలియాస్ ప్రాణేశ్వర్ పిళ్లై తండ్రి గోపీనాథ్ పిళ్లై గుజరాత్ హైకోర్టులో వేసిన పిటిషన్ల తరువాత, అప్పుడు కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఈ నకిలీ ఎన్‌కౌంటర్ ఆరోపణల మీద విచారణ జరపమని అఫిడవిట్ దాఖలు చేసింది. గుజరాత్ కోర్టు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎంక్వయిరీకి ఆదేశించింది. అప్పుడు రంగప్రవేశం చేశాడు అహమ్మదాబాద్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తమంగ్. 2009లో తనకిచ్చిన గడువుకి ఒక నెల ముందే, ఆయన ఇచ్చిన 243 పేజీల చేతిరాత రిపోర్ట్‌లో మొదటి సారిగా ఈ కేసును నకిలీ ఎన్‌కౌంటర్‌గా పేర్కొన్నాడు. పోలీసులు 'కోల్డ్ బ్లడెడ్ మర్డర్' చేశారని ఆయన ప్రత్యక్ష ఆరోపణ చేయటం విశేషం. వాళ్ల నలుగురిని ముంబై నుండి అహమ్మదాబాద్‌కు జూన్ 12ననే తీసుకొని వచ్చారనీ, జూన్ 14 రాత్రి వారిని పోలీస్ కస్టడీలో చంపివేసి, మరుసటి రోజు ఎన్‌కౌంటర్ కథ అల్లారనీ చెప్పాడు. 'ముఖ్యమంత్రిని సంతోషపెట్టటానికీ, అతని చేత పొగిడించుకోవటానికి, ప్రమోషన్లు పొందటానికి; ప్రణాళిక ప్రకారం, జాలి లేకుండా చేసిన హత్యలివి' అని ఖరాఖండిగా చెప్పాడు. వారి స్వంత ప్రయోజనాల కోసం అహమ్మదాబాద్ పోలీస్ కమిషనర్ కేయార్ కౌశిక్, జాయింట్ కమిషనర్ పీపీ పాండే, అప్పటికే వేరే కేసులో సస్పెండ్ అయి ఉన్న డీఐజీ డీజీ వంజార, అప్పటి ఏసీపీలు జీఎల్ సింఘాల్, ఎన్‌కె అమీన్‌లు ఈ ఎన్‌కౌంటర్ ప్లాన్ చేశారని అన్నాడు. ఫోరెన్సిక్ సాక్ష్యానికీ, పంచనామాకి మధ్య నున్న వైరుధ్యాలను ఈ రిపోర్ట్ ఉపయోగించుకొన్నది.



తీవ్రవాదులుగా చెప్పబడుతున్న వారు ఎన్నో రౌండ్లు కాల్పులు జరిపారని చెబుతున్నపుడు, ఒక్క కానిస్టేబుల్‌కి కూడా గాయం కాకపోయిన విషయం ఆయన ప్రశ్నించాడు. చుట్టుపక్కల ఉన్న ఒక్క చెట్టుకు కానీ, వాహనానికి కానీ ఒక్క బుల్లెట్ కూడా తగలక పోవటం ఆయన ఎత్తి చూపించాడు. తీవ్రవాదులు ఉపయోగించారని చెబుతున్న పిస్టోల్ తుప్పు పట్టి ఉందనీ, చాలా కాలం దాన్ని ఉపయోగించినట్లు లేదనీ ఆయన తన రిపోర్ట్‌లో అన్నారు.

ఈ రిపోర్ట్ ఇష్రత్ వ్యక్తిత్వానికి ఇచ్చిన సర్టిఫికేట్‌గా, తమ కుటుంబం తీవ్రవాద నింద నుండి బయటపడినట్లు ఆమె కుటుంబం భావించి వారంతా ఆనందపడ్డారు. అయితే రెండు రోజుల్లోనే గుజరాత్ హైకోర్ట్ జడ్జ్ ఝవేరి ఆ రిపోర్ట్ మీద స్టే యిచ్చి, తమంగ్ మీద చర్య తీసుకోవాల్సిందిగా ఆదేశించాడు. ఈ రిపోర్ట్ రాక ముందు ముగ్గురు ఐపీఎస్ ఆఫీసర్స్‌తో ఒక నెల క్రితం వేసిన ఒక కమిటీ రిపోర్ట్ కోసం వేచి చూడటానికే ఆయన ఇష్టపడ్డాడు. వాళ్లు ఏమి చెప్పారో కానీ, ఒక సంవత్సరం తరువాత సెప్టెంబర్ 24, 2010లో గుజరాత్ హైకోర్టు తాజా సిట్ (Special Investigation Team) విచారణను ఆదేశించింది.

సిట్ ఈ కేసును స్వీకరించటానికి చాలా తటపటాయించింది. అనేక మంది సిట్ చైర్మన్లు మారాక, జులై 2011లో రాజీవ్ రంజన్ వర్మ (1978 బాచ్ ఐపియస్ ఆఫీసర్) సిట్ ఛైర్మన్‌గా నియామకం అయ్యాడు. ఆయనతో పాటు మోహన్ ఝ, సతీశ్ వర్మా బృందం హైకోర్టు ఆదేశాల మేరకు సిబిఐతో కలిసి ఆయన తాజా ఎఫ్ఐయ్యార్‌ను 2011 డిసెంబర్‌లో సమర్పించింది. గతంలో పర్మార్ సమర్పించిన ఎఫ్ఐయ్యార్‌ను తిరస్కరిస్తూ తయారు చేసిన ఈ ఎఫ్ఐయ్యార్ చారిత్రాత్మకమైనది. కేయార్ కౌశిక్, పీపీ పాండే, డీజీ వంజార, జిఎల్ సింఘాల్, ఎన్‌కె అమీన్, ఇంకా ఏడుగురు ఇన్స్పెక్టర్లు, (వారిలో మొదటి ఎఫ్ఐయ్యార్ వేసిన పర్మార్ కూడా ఉన్నాడు) నలుగురు సబ్ ఇన్స్పెక్టర్లు, ముగ్గురు కమెండోలు, ఒక కానిస్టేబుల్‌తో కలుపుకొని ఇరవై మంది పోలీసుల్ని దోషులుగా చెబుతూ – ఈ ఘటనను నకిలీ ఎన్‌కౌంటర్‌గా సిట్ నిర్ధారించింది. ఈ నకిలీ ఎన్‌కౌంటర్ తేదీకి రెండు రోజుల క్రితం జూన్ 12నే ఇష్రత్ జహాన్, జావెద్ షేక్ ప్రయాణిస్తున్న కారుని వసాద్ టోల్ బూత్ దగ్గర ఆటంకపరిచి వారిని అదుపులోకి తీసుకొన్నట్లు సాక్ష్యాలు ప్రవేశపెట్టగలిగింది. అలాగే వారితో పాటు నకిలీ ఎన్‌కౌంటర్ అయిన అంజాద్ ఆలీని అహమ్మదాబాద్ సరిహద్దుల్లోని కోబ్రా సర్కిల్ దగ్గరి ఒక ఫార్మ్‌హౌస్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు చెబుతున్న ముందు రోజే అక్రమంగా అదుపులో ఉంచుకొన్నారని కూడా పోలీసుల వాగ్మూలాలతో నిరూపించింది. పోలీసులు ఎన్‌కౌంటర్‌కు ఉపయోగించామని చెబుతున్న ఆయుధాలు, వాహనాల లాగ్ బుక్స్ రికార్డులు సక్రమంగా లేవని చెప్పారు. ఈ సో కాల్డ్ ఎన్‌కౌంటర్‌లో ఉన్న ఎన్నో సాంకేతిక వైరుధ్యాలను సిట్ ఎత్తి చూపించింది. అన్నిటి కంటే కొట్టవచ్చినట్లు కనిపించిన వైరుధ్యం ఏమిటంటే, చనిపోయిన వారి పేర్లూ అడ్రెస్సులూ పేర్కొంటూ వారి శరీరాలకు పంచనామా జరపటానికి అప్పటి అహమ్మదాబాద్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌ని అనుమతి అడగటం. 'పంచనామా జరగక ముందే వారి పేర్లు, అడ్రెస్సులు తెలిసి ఉండకూడదు' అని సిట్ సభ్యుడు సతీశ్ వర్మ వ్యాఖ్యానించాడు. 'క్రైమ్ బ్రాంచ్‌కి సంబంధించిన అనేక మంది ఆఫీసర్లు ఈ ఎన్‌కౌంటర్‌గా చెప్పబడుతున్న ఘటనలో నియామకం అయ్యి, ఇన్వెస్టిగేషన్‌లో ఉండటం మానవ హక్కుల కమీషన్ నిర్దేశిత సూత్రాలకు విరుద్ధం.' అని ఆయన అన్నారు. వారు ప్రయాణం చేస్తున్న కారులో ఇప్పుడు కనిపిస్తున్న బుల్లెట్ రంధ్రాలు మొదట తీసిన ఫోటోలలో కనబడటం లేదని అన్నారు.

తరువాత రెండు సంవత్సరాల తరువాత జులై 3 2013న, సిట్ తాను పెట్టిన ఎఫ్ఐయ్యార్‌ని ఆధారంగా చేసుకొని, ఈ కేసులో మొదటి చార్జ్ షీట్‌ను అహమ్మదాబాద్‌లోని మీర్జాపూర్ సిబిఐ కోర్టులో ప్రవేశపెట్టింది. ఈ హత్యలో కీలక నిందితులు జేజీ పర్మార్, డీజీ వంజార, పీపీ పాండె, జిఎల్ సింఘాల్, ఎన్‌కె అమీన్, తరుణ్ బరోత్, అనాజు చౌదరీల మీద ఐపీసీ సెక్షన్లు 302, 364, 368, 346, 120-B, 201, 203, 204, 217, 218 కిందా; ఆయుధాల చట్టం కింద 25(I)(e), 27 కిందా కేసులు నమోదు చేసింది. 2014లో అదనపు చార్జ్ షీట్ కింద నలుగురు ఇంటెలిజెన్స్ ఆఫీసర్స్ (IB) ను చేర్చింది. వారిలో అప్పటి ప్రత్యేక డైరెక్టర్ రాజేంద్రకుమార్ కూడా ఉన్నారు. మోడి చంపబోతున్నారనే తప్పుడు సమాచారాన్ని ఇంటెలిజెన్స్ పేరుతో ఇచ్చి, ఈ ఘటనలు జరగటానికి, ఇష్రత్ జహాన్ తదితరుల హత్యకు కుట్ర పన్నాడని అతని మీద అభియోగం. అయితే 2015 జులైలో (అప్పటికి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చేసింది) ఐబీ ఆఫీసర్లను ప్రశ్నించాలనే సిబిఐ అభ్యర్థనను మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ తిరస్కరించింది.

ఈ కేసును ఇష్రత్ జహాన్ కుటుంబం వైపు నుండి మొదటి నుండి కోర్టులో వాదిస్తున్న బృంద గోవర్ అభిప్రాయం ప్రకారం ఈ హత్యలకు రాజకీయ ఉద్దేశ్యాలు, అనుమతులు ఉన్నాయి. అలా అని నిరూపించటానికి కావాల్సిన వివరాలు సిబిఐ దగ్గర ఉన్నాయి. చనిపోయిన వారిని ముందుగానే కిడ్నాప్ చేసి, నిర్బంధించి చంపినట్లు పోలీసులు సాక్ష్యాలు చెప్పారు. 'ఇప్పటి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, ఇప్పటి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలకు తెలిసే ఇదంతా జరిగింది. కానీ సిబిఐ ఆ విషయాన్ని

కావాలని పట్టించుకోవటం లేదు' అని ఆమె ఆరోపించారు. ఆమె అలా అనటానికి నిజంగానే ఆధారాలు ఉన్నాయి.

ఎవరు జైల్లో ఉండాలి?



ఈ కేసులో ఆరోపితులైన పోలీసు ఆఫీసర్లు డీజీ వంజార, ఎన్‌కె అమీన్లు తరువాత 2005లో జరిగిన ఇంకో ఎన్‌కౌంటర్‌లో నిందితులు అయ్యారు. ఈ రిపోర్ట్ వచ్చేనాటికి వారిద్దరూ జైలులో ఉన్నారు. 2005 నవంబర్‌లో అచ్చు ఇలాంటిదే ఇంకో ఎన్ కౌంటర్ వీరిద్దరి ఆధ్వర్యంలో జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో గాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్, అతని భార్య కౌసర్ బీ హత్యకు గురి అయ్యారు. ఇదే పోలీసు ఆఫీసర్లు డీజీ వంజార, ఎన్‌కె అమీన్లు 2006 డిశంబర్ 8న జరిగిన తులసీరామ్ ప్రజాపతి అనే వ్యక్తి లాకప్ చావులో కూడా నిందితులు. ప్రజాపతి సోహ్రాబుద్దీన్ హత్యకు సాక్షి. సోహ్రాబుద్దీన్‌కు మాజీ మంత్రి హరేన్ పాండ్య (నరేంద్ర మోడికి అప్పటి రాజకీయ ప్రత్యర్థి) హత్యకు లింకులు ఉన్నాయి. సోహ్రాబుద్దీన్ హత్యలో అమిత్ షా కూడా దోషిగా అరెస్టు అయ్యాడు. అది ఇంకో కథ. మొత్తానికి నరేంద్ర మోడి, అమిత్ షా వారి రాజకీయ సోపానానికి ఈ పోలీసు ఆఫీసర్లు మనస్ఫూర్తిగానే కృషి చేశారని చెప్పవచ్చు.

డీజీ వంజార అహమ్మదాబాద్ జైలులో ఉన్నప్పుడు వారానికి మూడు రోజులు ఇంట్లోనే ఉండేవాడని వినికిడి. ముంబై జైలుకు వెళ్లాక అది కుదరలేదు. పైగా వంజార, బీజేపీ తన విడుదలకు కృషి చేస్తుందని భావించాడు. మరి అన్ని ఎన్‌కౌంటర్లు చేసి, ప్రజల నుండి మోడీకి సానుభూతి సంపాదించి పెట్టి, మోడి కోసం తన ఉద్యోగ జీవితాన్నే త్యాగం చేసిన తరువాత బీజేపీ తనకు జైలు నుండి బయటకు రావటానికి రెడ్ కార్పెట్ పరుస్తుందని ఆశించటంలో అతని తప్పు లేదు. కానీ ఏ కారణం చేతనో అది వెంటనే జరగలేదు. అప్పుడు నోరు విప్పిన వంజార చాలా విషయాలు మాట్లాడాడు. “వివిధ బూటకపు ఎన్‌కౌంటర్లకు నేను, నా అధికారులు బాధ్యులుగా గుజరాత్ సిఐడి/ కేంద్ర ప్రభుత్వ సిబిఐ గుర్తించి మమ్మల్ని అరెస్టు చేశారు. అదే నిజం అయితే, షొరాబుద్దీన్, తులసీరాం, సాదిక్ జమాల్, ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసులను విచారిస్తున్న సిబిఐ అధికారులు ఈ విధాన రూపకర్తలను కూడా అరెస్టు చెయ్యాలి. ఎందుకంటే మేము ఫీల్డ్ ఆఫీసర్లం మాత్రమే. ఈ ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యపూర్వక విధానాన్ని మాత్రమే మేము అమలు చేశాము. మా చర్యలన్నింటినీ గుజరాత్ ప్రభుత్వమే అత్యంత సమీపం నుండి ప్రోత్సహించింది, మార్గదర్శకత్వం వహించింది, పర్యవేక్షించింది. ఈ దృష్ట్యా, ఈ ప్రభుత్వం ఉండాల్సింది గాంధీ నగర్‌లో కాదనీ, నవీ ముంబైలోని తలోజా సెంట్రల్ జైలులోనో లేదా అహ్మదాబాద్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులోనో అది ఉండాలనీ నేను దృఢంగా అభిప్రాయపడుతున్నాను.” అని అన్నాడు.

మోడి ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా రూపొందించిన 'టెర్రరిస్టు వ్యతిరేక' విధానం కింద తమ విధుల్లో భాగంగానే తాము ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డామని డీజీ వంజార చేసిన వాదన కాకతాళీయం ఏమీ కాదు. మోడి ప్రభుత్వం తమ సహచర రాజకీయ నాయకులను కాపాడుకుంటూ వారి ఆదేశాలను అమలు చేసిన పోలీసు అధికారులను మాత్రం బలిపశువులను చేసిందని వంజార చేసిన ఆరోపణకు బీజేపీగానీ, నరేంద్ర మోడి గానీ, తిట్టిపోతకు గురయిన అమిత్‌షా గానీ స్పందించలేదు. తన ఐపియస్ పదవికి రాజీనామా ఇస్తూ హోమ్ మంత్రిత్వ శాఖకు రాసిన ఉత్తరంలో తాను 'ఇంత సుదీర్ఘ కాలం పాటు దయాపూర్వక మౌనం వహించానంటే కారణం' అది కేవలం నరేంద్ర మోడి పట్ల తనకు వున్న 'గొప్ప నమ్మకం, అత్యున్నత గౌరవం' వల్లనే అని పేర్కొన్నాడు. “గౌరవనీయులయిన గుజరాత్ ముఖ్యమంత్రి తాను ఋణపడి ఉన్నాననీ, భారత మాతకు తాను చెల్లించాల్సిన రుణం ఉన్నదనీ ఈ మధ్య తరచుగా చెబుతున్నారు. అది నిజమే. నిజానికి ప్రతి పౌరుడు నిర్వర్తించవలసిన పవిత్ర కర్తవ్యం అది. కానీ ఆయనకు ఒక విషయం గుర్తు చేయడం అసందర్భం కాబోదు. ఢిల్లీ వైపుగా కవాతు చేసే తొందరలో ఉన్న ఆయన జైలుపాలయిన పోలీసు అధికారులకు చెల్లించాల్సిన ఋణం సంగతి మాత్రం మర్చిపోరాదు” అంటూ ప్రధాని అయిన తర్వాత మోడి ఏమి చేయాలో మాజీ పోలీసు అధికారి ముందే హెచ్చరించాడు.

అంతే కాదు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు గుజరాత్ ముఖ్యమంత్రి అనుమతి ఉన్నదని కేసులో నిందితుడైన పోలీసు అధికారి డీజీ వంజార చెప్పినట్లు ఎన్‌డిటీవీ చెప్పింది. గుజరాత్‌లో డిఎస్పీగా పని చేసి రిటైర్ అయిన డిహెచ్ గోస్వామి ఇచ్చిన సాక్ష్యంలో నరేంద్ర మోడి ప్రస్తావన ఉన్నట్లు ఎన్‌డిటీవీ తెలిపింది. ఎన్‌కౌంటర్ జరిగిన 2004లో ఆయన క్రైమ్ బ్రాంచిలో పని చేశారు. సిఆర్‌పిసి సెక్షన్ కింద ముంబైలోని మేజిస్ట్రేట్ కోర్టులో ఇచ్చిన సాక్ష్యంలో ఆయన డీజీ వంజారతో పాటు నరేంద్ర మోడి, అప్పటి గుజరాత్ హోమ్ మంత్రి అమిత్ షాల పేర్లు పేర్కొన్నారు.

ఎన్‌డిటీవీ ప్రకారం

ఎన్‌కౌంటర్ జరగడానికి రెండు రోజుల ముందు జూన్ 12, 2004 తేదీన గోస్వామి తన సీనియర్ పోలీసు అధికారి జివిఎల్ సింఘాల్‌తో కలిసి అహ్మదాబాద్‌లోని క్రైమ్ బ్రాంచి కార్యాలయానికి వెళ్లారు. సాయంత్రం గం. 7:30- గం. 8:30ల మధ్యలో వారు ఆ కార్యాలయానికి వెళ్లగా ఆ సమయంలో అక్కడ ఇష్రత్‌ను ఎన్‌కౌంటర్ చేయబోతున్న విషయమై చర్చ నడుస్తోంది. ఇంటలిజెన్స్ బ్యూరో గుజరాత్ స్టేషన్ చీఫ్‌గా ఉన్న రాజేంద్రకుమార్‌తో ఐపిఎస్ అధికారులు డీజీ వంజార, పీపీ పాండేలు ఇష్రత్ బృందాన్ని ఎలా ఎన్‌కౌంటర్ చేయాల్సిందీ చర్చిస్తున్నారు. చర్చ జరుగుతుండగా

'ముఖ్యమంత్రితో ఈ విషయం మాట్లాడండి' అని రాజేంద్రకుమార్ వంజారతో అంటుండగా గోస్వామి విన్నారు. ఆ తదుపరి రోజు గోస్వామి, సింఘాల్‌తో కలిసి మళ్లీ క్రైమ్ బ్రాంచి కార్యాలయానికి వెళ్లారు. ఇష్రత్ బృందాన్ని ఎన్‌కౌంటర్ చేయడం పట్ల సింఘాల్, వంజారతో తీవ్ర అభ్యంతరం తెలిపారు. అయితే వంజార, సింఘాల్ అభ్యంతరాలను లక్ష్యపెట్టలేదు. 'నాకు ముఖ్యమంత్రి, హోమ్ మంత్రుల నుండి అనుమతి లభించింది' అని వంజార పేర్కొన్నట్లు గోస్వామి తన సాక్ష్యంలో తెలిపారు.

అంటే అర్థం స్పష్టమే. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడి, అప్పటి హోమ్ మంత్రి అమిత్‌షాల ప్రత్యక్ష అనుమతితోనే ఐబి అధికారులు, గుజరాత్ పోలీసు అధికారులు కుట్ర చేసి ఇష్రత్ బృందాన్ని బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారని గోస్వామి సాక్ష్యం ద్వారా అర్థం అవుతోంది. ఐబి అధికారి రాజేంద్రకుమార్ ఆధారాలు లేకపోయినా ఇష్రత్ బృందానికి టెర్రరిస్టులు అనే ట్యాగ్ తగిలించి లష్కర్ తోయిబా సభ్యత్వం కూడా అంటగట్టి వారు మోడిని హత్య చేయబోతున్నారు అని ఒక బూటకపు హెచ్చరికను సృష్టించారని సిబిఐ చెబుతున్నట్లుగా పత్రికలు తెలిపాయి. అమాయక ముస్లిం యువతి, యువకులు ఒక భారీ రాజకీయ అధికార చదరంగంలో ఎలా పావులు కాగలరో, పావులుగా మారి కూడా టెర్రరిస్టులుగా ఎలా ముద్ర పడగలరో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు.

భారతదేశంలో ఉనికిలో లేని నకిలీ టెర్రరిస్టు సంస్థను సృష్టించి, అది తనను చంపటానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా ప్రచారం చేసి; అందుకు ఇష్రత్, జావేద్ లాంటి వారిని బలి ఇచ్చి, అందుకోసం పోలీసు, ఇంటెలిజెన్స్ సంస్థలలో వ్యక్తులకు ప్రమోషన్ల, ప్రయోజనాల పాలు పోసి పెంచుకొన్నారు ఈ ద్వయం. తమ దారికి అడ్డం వచ్చిన వారిని, తమ స్వంత పార్టీ వారినైనా సరే నిర్మూలించగలరని హరేన్ పాండ్య హత్య ద్వారా ప్రపంచానికి తెలియచేసారు.

బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 2015లో ఎన్‌కె అమీన్ బెయిల్ మీద బయటకి వచ్చి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉద్యోగంలో పునర్ నియామకం అయ్యాడు. ఇదే కేసులో అరెస్టు అయిన పీపీ పాండే కూడా బెయిలు మీద బయటకు వచ్చి, తను జైలు వెళ్లటానికి కారకుడైన సతీశ్ వర్మా మీద విచారణాధికారిగా నియమితుడు అయ్యాడు. అంటే ప్రభుత్వం తలుచుకొన్న వారిని చంపవచ్చు. చంపటానికి పోలీసులనే వినియోగించవచ్చు. వారిని శిక్షల నుండి రక్షించవచ్చు. మళ్లీ ప్రమోషన్లతో ఉద్యోగంలో నియామకం చేయవచ్చు. ఫాసిస్టు తరహా ప్రభుత్వాలలోనే ఇది సాధ్యం అవుతుంది.

ఈ కేసు వాదిస్తున్న బృందా గోవర్ పదే పదే సిబిఐ ఆడుతున్న నాటకాన్ని బహిర్గతం చేస్తున్నారు. సిబిఐ అసలు నిందితులైన అమిత్ షా, నరేంద్ర మోడీలను ఎందుకు వదిలివేస్తుంది అనే ఆమె ప్రశ్నలో నూరు శాతం తార్కికత ఉంది. అంత సమాచారాన్ని దగ్గర పెట్టుకొని సిబిఐ కావాలనే వారిద్దరినీ తప్పిస్తుందని ఆమె అంటారు. బిల్కిస్ బాను కేసులో (గత సంచికలో ఆమె గురించి చదివే ఉంటారు) నరేంద్ర మోడి, అమిత్‌షాల పాత్రను నిరూపించటం కష్టమే కానీ, ఇక్కడ వారికి వ్యతిరేకంగా అన్ని ఆధారాలు దొరికినా కూడా అన్నింటిని కావాలని ఏమార్చారు.

ఇంతకీ ఇష్రత్ జహాన్ తీవ్రవాదా?

సిబిఐ తన చార్జ్ షీట్‌లో ఇష్రత్ జహాన్ టెర్రరిస్టా, కాదా అని విషయం పేర్కొనలేదు. టెర్రరిస్టు అయితే చంపవచ్చా అనేది వేరే చర్చ. ఇష్రత్ బృందం ఎన్‌కౌంటర్ వాస్తవమైనదా లేక బూటకమా అన్నదే తాము తేల్చమని కోరాము తప్ప వాళ్లు టెర్రరిస్టులా కాదా అని కోరలేదని, కాబట్టి టెర్రరిస్టు కోణం వదిలి ఎన్‌కౌంటర్ కోణం పైనే దృష్టి కేంద్రీకరించి విచారణ పూర్తి చేయాలని గుజరాత్ హైకోర్టు సిబిఐని గట్టిగా హెచ్చరించిందని అప్పట్లో పత్రికలు నివేదించాయి.

అయితే 2004 జులై ప్రాంతంలో లష్కర్ తోయిబా సంస్థ 'ఇష్రత్ తమ కార్యకర్త' అని ప్రకటించిందని పాకిస్తాన్ పత్రిక 'ఘజ్వా టైమ్స్' వార్త వచ్చింది. ఈ వార్తను భారత మీడియా గగ్గోలుగా ప్రచారం చేసింది. అయితే లష్కర్ తోయిబా సంస్థ అది పొరపాటు ప్రకటన అని తరువాత ప్రజలకు క్షమాపణ చెప్పింది. అప్పుడు అధికారంలో ఉన్న యుపీయే ప్రభుత్వం మొదటి వేసిన అఫిడవిట్‌లో లష్కర్ తోయిబా ప్రకటన గురించిన ప్రస్తావన ఉండింది. అయితే రెండో సారి 2009లో ఆ ప్రస్తావన లేదు. అంటే ఇష్రత్ టెర్రరిస్టుగా ఆనాటి ప్రభుత్వం గుర్తించలేదు. సిట్, సిబిఐ సంస్థలు రెండూ చనిపోయిన వారికి లష్కర్ తోయిబాతో సంబంధాలను నిరూపించలేకపోయాయి.

అయితే విచిత్రాలన్నీ మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చాక జరిగాయి. మొదటి విచిత్రం: యూపీయే ప్రభుత్వం తయారు చేసిన రెండో అఫిడవిట్‌లో ఇష్రత్ తీవ్రవాది అనే ప్రస్తావన లేదు. ఈ రెండో అఫిడవిట్‌లో తనను బలవంతంగా సంతకం చేయించారనీ, సిగరెట్‌తో కాల్చారని అప్పుడు హోమ్ శాఖలో అండర్ సెక్రెటరీగా పని చేసిన ఆర్వీఎస్ మణి కొత్తగా ఆరోపణ చేయటం. అఫిడవిట్‌ను మణి తరపున ఒక లాయర్ తయారు చేస్తాడు. మొదటి అఫిడవిట్ గుజరాత్‌లోనే తయారు అయ్యింది. అఫిడవిట్ కావలసినట్లుగా తయారు చేయగలిగితే 'ఆయన హైకోర్టు జడ్జిగా నియమితులయ్యేలా చూస్తానని చెప్పు' అని పీపీ పాండే, సింఘాల్‌కు చెబుతున్నట్లుగా ఆడియోలో రికార్డ్ అయింది. ఈ మణి అనే వాడు హిందుత్వ మనిషి అనే విషయం స్పష్టం.

ఇక రెండో విచిత్రం: డేవిడ్ హెడ్లీ అనే అంతర్జాతీయ నేరస్తుడు ఉన్నాడు. అతని తల్లి అమెరికన్, తండ్రి పాకిస్తానీయుడు. అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా, తరువాత కాలంలో ఐఎస్ఐ ఏజెంటుగా అతనికి అనేక రూపాలు ఉన్నాయి. అమెరికా నిఘా సంస్థలు అతన్ని అనేక విధాలుగా ఉపయోగించుకొని, అతనికి అవసరం అయినపుడు ఆదుకొంటూ వచ్చాయి. 2008 ముంబై దాడుల్లో అతని హస్తం ఉందని తెలిసినా, అతను అమెరికన్ పౌరుడు అవటం వలన భారత ప్రభుత్వం అతన్ని అరెస్టు చేయలేక పోయింది. యూపిఏ ప్రభుత్వ హయాంలో హెడ్లీని భారత జాతీయ పరిశోధన సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ -ఎన్ఐఏ) విచారణ చేయడానికి అమెరికా అసలే ఒప్పుకోలేదు. అనేక విధాలుగా బతిమాలుకున్నాక అమెరికా వెళ్లి అక్కడ జైలులో హెడ్లీని 'ఇంటర్వ్యూ' చేయడానికి

మాత్రమే అమెరికా ఒప్పుకుంది. అది కూడా ఇంటర్వ్యూలో హేడ్లీ వెల్లడి చేసే వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బైటికి చెప్పకూడదని భారత ప్రభుత్వం నుండి హామీ తీసుకున్నాకనే ఒప్పుకుంది. అతగాడు మొదటి విడత ఎగ్జామినేషన్‌లో ఇష్రాత్ జహాన్ లష్కర్ సభ్యురాలు అని హెడ్లీ చెప్పాడు. దానిని బీజేపీ, టైమ్స్ నౌ అందుకుని హాహాకారాలు చేశాయి. ఇష్రాత్ జహాన్ కుటుంబాన్ని మరోసారి క్షోభకు గురి చేశారు. మళ్లీ రెండో విడతలో క్రాస్ ఎగ్జామినేషన్‌కు వచ్చే సరికి మొదటిసారి చెప్పిన విషయాన్ని వెనక్కి తీసుకున్నాడు. ఇష్రాత్ జహాన్ లష్కర్ సభ్యురాలు అన్న సంగతి తనకు పూర్తిగా తెలియదని ఇతర లష్కర్ నేతలు చెప్పుకుంటుండగా మాత్రమే తాను విన్నానని క్రాస్ ఎగ్జామినేషన్‌లో హెడ్లీ చెప్పాడు.

కానీ ఇష్రాత్ జహాన్ గురించి హేడ్లీ చెప్పింది పుకారు మాత్రమే అని ఎన్ఐఏ అప్పుడే కొట్టిపారేసింది. ఇష్రాత్ జహాన్ ఎలాంటి టెర్రరిస్టు కాదనీ, ఆమె అమాయక భారతీయ యువతి అని భారత దేశ అత్యున్నత నేర పరిశోధనా సంస్థ (సిబిఐ), గుజరాత్ హైకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ససాక్ష్యంగా రుజువు చేశాయి. దరిమిలా గుజరాత్ హైకోర్టు అది బూటకపు ఎన్‌కౌంటర్ అని తీర్పు చెప్పింది. అసలు ఎవడో సిఐఏ ఏజంటూ, ఆ తర్వాత ఐఎస్ఐ ఏజంటూ ఆ తర్వాత లష్కర్ తొయిబా తరపున కూడా పని చేసిన టెర్రరిస్టూ ఐన డేవిడ్ హెడ్లీ సాక్ష్యం నమ్ముతారా లేక భారత పరిశోధనా సంస్థలు, కోర్టులు చేసిన నిర్ధారణలను నమ్ముతారా? సిబిఐ, భారత కోర్టుల నిర్ధారణలను త్రోసిరాజని హెడ్లీ సాక్ష్యాన్ని నమ్మి హైలైట్ చేయడం, అమాయక దేశ పౌరులను నేరస్తులుగా చిత్రీకరించడం జాతీయ వ్యతిరేకత, దేశ ద్రోహంలు కావా?

మీడియా పాత్ర

భారత మీడియా ఇషత్ జహాన్‌కు వ్యతిరేకంగా ఎంత చేయాలో అంత చేసింది. ఆమె తీవ్రవాది అని నమ్మించి ప్రచారం చేయటానికి మనుషులకుండే కామన్ సెన్స్‌కు కూడా పరీక్ష పెట్టింది. జావీద్ షేక్ అలియాస్ ప్రాణేశ్వర్ పిళ్లై తండ్రి గోపీనాథ్ పిళ్లై ఆవేదనగా మాట్లాడుతూ 'లండన్‌లో రైలు యాక్సిడెంట్ జరిగితే మృతుల దేహాలు ఒక్కటి కూడా మీడియాలో చూపించలేదు. అక్కడి ఫోటోగ్రాఫర్లు సంచలన ఫోటోల కోసం వెంపర్లాడరు. కానీ ఈ నకిలీ ఎన్‌కౌంటర్ తరువాత, చనిపోయినవారిని నడిరోడ్డున పండుకోబెట్టి ఫోటోలు తీసి, ఏమి జరిగిందో కూడా కనీస విచారణ చేయకుండా, నరేంద్ర మోడిని చంపటానికి ప్రయత్నించారని ప్రపంచమంతా పంచారు. ఆ ఫోటోలు వారి తల్లిదండ్రులకు ఎంత క్షోభ కలిగిస్తాయో ఎవరూ పట్టించుకోలేదు. మా బిడ్డల్ని మేము ఎంతో ప్రేమగా పెంచుకొంటాము. వారికి ఎండ నుండి, వాన నుండి రక్షణ ఇస్తాము. వారిని చీమా, దోమా కుట్టినా విలవిలలాడుతాము. అలాంటి మా పిల్లలను అన్యాయంగా చంపివేసి, దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ ప్రచారం చేశారు. ఇప్పుడు ఇది నకిలీ ఎన్‌కౌంటర్ అని నిరూపితం అయ్యింది. వారికి టెర్రరిష్టు లింకులు లేవని తెలిసింది. పత్రికలు గత స్థాయిలోలాగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తాయా?' అన్నారు. 'నా కొడుకు తీవ్రవాది కాదు. వాడు ఇస్లాంలోకి మారింది ఆ మతం మీద ప్రేమతో కాదు. తను ప్రేమించిన అమ్మాయి కోసం' అన్నాడు. తన కొడుకు చావుకు గుజరాత్ ప్రభుత్వం బాధ్యత వహించాలని గోపీనాథ్ పిళ్లై ఇంకా కోర్టులో పోరాడుతుండగానే, గత ఏప్రిల్‌లో ఒక రోడ్డు యాక్సిడెంట్‌లో అతను మరణించడం విచారకరమే కాదు, అనుమానాస్పదం కూడా.

ఇద్దరు స్త్రీలు - ఇద్దరు పురుషులు

ఇషత్ జహాన్ అనే అమాయక ముస్లిం యువతి; కుటుంబ పోషణ కోసం ఉద్యోగానికి పోయి, నకిలీ ఎన్‌కౌంటర్‌కు గురి అయ్యి, తీవ్రవాదిగా ముద్ర వేయించుకొని, తరువాత కాదని నిరూపణ అయ్యి చరిత్ర పుటల్లో ఆనాటి అమాయక ముఖచిత్రంతో మిగిలి పోయింది. ప్రగ్యా ఠాకూర్ అనే మహిళ మాలెగావ్ బాంబు పేలుళ్లలో నిందితురాలు. కోర్టులు ఆమెను నిర్దోషిగా విడుదల చేయగా, అధికార బీజేపీ ఆమెను అక్కున చేర్చుకొని ఎంపీగా గెలిపించుకొన్నది. హేమంత్ కర్కారే అనే పోలీస్ ఆఫీసర్ మాలెగావ్ పేలుళ్లలో ప్రగ్యా ఠాకూర్‌కి వ్యతిరేకంగా సాక్ష్యాలు సమకూర్చి, ఆమెను అరెష్టు చేసి, ముంబై టెర్రర్ దాడిలో అనుమానాస్పదంగా మరణించాడు. మరణించాక ప్రతిష్టాత్మక అశోక చక్ర అవార్డు పొందినా, చనిపోయిన పది సంవత్సరాల తరువాత హిందూ వ్యతిరేకి అనే ప్రచారంలో అతను నేరస్థుడు అయ్యాడు. డీజీ వంజార అనే పోలీస్ ఆఫీసర్, ఇషత్ మరో ముగ్గురి నకిలీ ఎన్‌కౌంటర్ చేసి, ఇంకా ఇతర తప్పుడు ఎన్‌కౌంటర్స్ కూడా చేసి; కొంత కాలం జైలు శిక్ష అనుభవించి, బీజేపీ ప్రేమకు పాత్రుడయ్యి, సిబిఐ కోర్టు ద్వారా నిర్దోషిగా (ఇతర నిందితులతో బాటు) విడుదల అయ్యాడు.


పై నిజాలు భారత భవిష్యత్ గురించి ఏమి చెబుతున్నాయి?

ఈ దేశంలో ముస్లిములే ఎప్పటికి తీవ్ర వాదులు. కాషాయ గుడ్డలు ధరించిన వాళ్లు ఎవరూ తీవ్రవాదులు కాలేరు. ("ఏ హిందువూ, ఇప్పటికీ ఎప్పటికీ, తీవ్రవాది కాలేడు- ప్రధాన మంత్రి నరేంద్ర మోడి") అధికార పార్టీకి అనుకూలంగా పని చేసిన పోలీస్ ఆఫీసర్స్ జైల్లో ఉన్నా బయటకు వస్తారు. ప్రజల కోసం పని చేసేవాళ్లు చనిపోవచ్చు. లేక అర్బన్ నక్సలైట్లుగా జైల్లో శాశ్వత చిరునామా సంపాదించుకోవచ్చు.

ఇషత్ తల్లి ఇప్పటికీ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఇంకా రావాల్సి ఉంది. 'నాకు పూర్తి సత్యాన్ని తెలుసుకొనే హక్కు ఉంది. నా కూతురు ఇషత్ జహాన్‌ను చంపటానికి వ్యూహ రచన చేసిన వాళ్లు ఎవరు? ఒక అమాయక ముస్లిం యువతి భయానక హత్య వలన ప్రయోజనం పొందినవారు ఎవరు? నాకు పూర్తి న్యాయం రావాల్సిన హక్కు ఉంది. ఆ న్యాయం నాకు రావాలంటే ఈ హత్య కుట్ర మొత్తం బట్టబయలు కావాలి. నా అమాయక బిడ్డను నిర్మూలించిన వారిని గుర్తించాలి. వారిపై కేసు పెట్టాలి. ప్రశ్నించాలి. శిక్షించాలి.' ✿

ఏ గుర్తింపూ లేని జీవితాల కథలు రెండు– ఐడీ, లయర్స్ డైస్

ల.లి.త.




ముంబై చాలామందికి కలల నగరం. మరెంతో మందికి ఏదోరకంగా తిండికి ఇబ్బంది లేకుండా బతుకు బండిని లాగటానికి అనువైన నగరం. మార్కెటింగ్ రంగంలో మంచి ఉద్యోగం వెదుక్కోవాలని సిక్కిమ్ నుంచి ముంబై వస్తుంది చారూ శ్రేష్ఠ. అంధేరీలో తన స్నేహితురాలి ఫ్లాట్‌లో ఆమెతో కలిసి ఉంటుంది. ఆమె ఒక్కతే ఇంట్లో ఉన్న ఓ రోజున ఇంటి గోడకు రంగు వేయటానికి ఒక పెయింటర్ ఇంటికి వస్తాడు. పెయింటింగ్ సామాను బైటకు తీసి, బట్టలు మార్చుకుని రంగు వేసే పని మొదలు పెడతాడు. కొంచెంసేపట్లోనే కిందపడిపోయి అపస్మారకంలోకి వెళ్ళిపోతాడు. ముక్కూ మొహం తెలియని ఆ వ్యక్తికి వచ్చిన ఆపదను చారూ ఎలా నెత్తిన వేసుకుంటుంది, తరువాత ఏమౌతుంది? ఇదొక కథ. మళయాళ దర్శకుడు కమల్ కేఎం హిందీలో తీసిన సినిమా 'ఐ.డి.' (ఐడెంటిటీ).

హిమాచల్ ప్రదేశ్‌లో చైనా బార్డర్‌కు దగ్గరగా హిమాలయాల మధ్యవున్న చిత్కూల్ గ్రామం. కమల తన బిడ్డ మాన్యతో అక్కడ ఉంటుంది. ఆమె భర్త ఇళ్లు కట్టే పనిలో కూలీగా బ్రతకటం కోసం ఢిల్లీకి వెళ్తాడు. ఆరు నెలలుగా కమలకు భర్త నుండి ఏ సమాచారమూ లేదు. అతని సెల్‌ఫోన్ మౌనంగా ఉండిపోతుంది. విసుగెత్తిన కమల ఊరి పెద్దలు వారించినా వినకుండా మాన్యనూ, మాన్య పెంచుకుంటున్న ఒక చిన్న మేకపిల్లనూ తీసుకుని భర్తను వెదుక్కోవటం కోసం ధైర్యంగా ఢిల్లీకి ప్రయాణం కడుతుంది. బోర్డర్ పోలీస్ ఫోర్స్ నుండి పారిపోయి వస్తున్న నవాజుద్దీన్ ఆమెకు తారసపడతాడు. కలిసి నడిచిన దారిలో వీరిద్దరి అనుభవాలు ఏమిటి? ఆమెకు భర్త ఆచూకీ తెలుస్తుందా? ఇది ఇంకొక కథ. మలయాళీ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తీసిన హిందీ సినిమా 'లయర్స్ డైస్'.

మధ్యతరగతి ఆనందాల్లోనో లేక మాఫియా ఫైటింగ్ రక్తపాతాల్లోనో మునిగితేలుతున్న సినిమాల మధ్యలో, వలస వెళ్లేవారి బ్రతుకు బాధల గురించి సినిమాలు తీద్దామన్న ఆలోచన వచ్చినందుకే దర్శకులు కమల్‌నూ గీతూ మోహన్ దాస్‌నూ అభినందించాలి. పైగా ఈ సినిమాలు ఎంతో ఆలోచనతో పట్టుగా రాసుకున్న స్క్రీన్‌ప్లేలను అనుసరించి తీసినవి. విమర్శకుల ప్రశంసలు అందుకున్నవి.

స్థానభ్రంశం చెందినవాళ్ల (Displaced people) గురించి రిత్విక్ ఘటక్ మొదలుకొని చిన్నా పెద్దా దర్శకులు కొన్ని సినిమాలు తీశారు. బెంగాల్ విభజన కారణంగా బ్రతుకులు చెదిరిపోవటాన్ని నిమాయ్ ఘోష్ 'ఛిన్నామూల్', ఘటక్ సినిమా 'సుబర్ణరేఖ' చూపిస్తాయి. దేశ విభజన వల్ల జరిగిన స్థానభ్రంశం గురించి తీసిన



సినిమాల్లో ఎంఎస్ సత్యు తీసిన 'గరమ్ హవా' చక్కని క్లాసిక్. వలస బ్రతుకుల మీద వచ్చిన సినిమాల గురించి ఆలోచిస్తే, భూమిని రక్షించుకునే తాపత్రయంతో కలకత్తా వీధుల్లో రిక్షావాలాగా మారిన రైతు కథ బిమల్‌రాయ్ తీసిన 'దో భీగా జమీన్', డెబ్భైల న్యూవేవ్ కాలంలో ముజఫర్ అలీ తీసిన 'గమన్', తొంభైల్లో సాయి పరాంజపే తీసిన 'దిశ' సినిమాలు ముఖ్యంగా గుర్తుకు వస్తున్నాయి. కరువు వల్లనూ వ్యవసాయం మీద బ్రతకలేకపోవటం వల్లనూ మెరుగైన జీవితంకోసం పట్టణాలకు పయనమైనవారి జీవితాలనూ, భద్రతలేని నగర జీవనంలోని ఆటుపోట్లనూ కళ్లముందుంచే ఈ సినిమాలకూ, ఇరవై ఒకటో శతాబ్దంలో వచ్చిన 'ఐ.డి', 'లయర్స్ డైస్' లకూ పెద్దగా భేదం లేకపోవటం గమనించాలి. అసంఘటిత రంగాల్లో పని చేసేవారి బ్రతుకుల్లోకి నిరంతరం తొంగిచూసే అభద్రత అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉంది. దళారీలు పైపైకి ఎదగటం, ప్రత్యేక నైపుణ్యాలేవీ లేనివారు మురికివాడల్లో ఉంటూ ప్రతిరోజూ పనికి వెదుక్కోవటం అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉంది. డెబ్భైఏళ్లుగా ఈ సబ్జెక్ట్ మీద వస్తున్న సినిమా కథలన్నీ ఒకే రకంగా సాగుతున్నాయి.

'ఐ.డి.' సినిమాకు వస్తే, పరిచయంలేని మురికివాడల్లోకి ఉన్నత మధ్యతరగతి అమ్మాయిని ప్రయాణించేలా చేస్తాడు దర్శకుడు కమల్. ఊరూ పేరూ లేని పెయింటర్ చావు వలన వలస జీవితాల్లోకి తొంగి చూసే అవకాశం చారూకు వస్తుంది. అయితే, దాన్ని పరిశీలించకుండా విదిలించుకుని తన దారిన తను పోయే అవకాశం కూడా ఉంది చారూకు. మధ్యతరగతిలో చాలామంది అదే పని చేస్తారు. ఒక గవర్నమెంట్ హాస్పిటల్‌లో అతన్ని చేర్పించి చేతులు దులుపుకోవచ్చు. కానీ అతన్ని కొంత డబ్బు కట్టి, ఇంటికి దగ్గరున్న ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్చుతుంది. అతని సెల్ ఫోన్ పట్టుకుని ఆచూకీ తీయటానికి ప్రయత్నిస్తుంది. బాధ్యత తీసుకోవలసిన లేబర్ కాంట్రాక్టర్ మొహం చాటేస్తే మంచి పౌరురాలిగా అతన్ని నిలదీస్తుంది. పెయింటర్ గురించి సరిగ్గా రాసి పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ చేస్తుంది. (రిపోర్ట్ అంటే ఇలా ఉండాలని పోలీస్ ఆఫీసర్ మెచ్చుకుంటాడు కూడా). చనిపోయిన పెయింటర్‌ను తన సెల్‌ఫోన్లో ఫోటో తీసి మురికివాడల్లో అతని కుటుంబం కోసం ఒంటరిగా వెదుకుతుంది. ఈ అన్వేషణలో తనకు పరిచయంలేని ఒక అధోజగత్తును దర్శిస్తుంది చారూ. దానిలో ముంబై లోకల్ ట్రైన్స్‌లో ఆమె చేసే దీర్ఘ ప్రయాణాలు ఉంటాయి. కుప్పలుగా పేరుకున్న చెత్త డంపింగ్ యార్డుల మధ్య, మురికి కాలువల మధ్య రేకుల షెడ్లలో బ్రతికే మనుషుల ముఖాలు ఆమె స్మార్ట్ ఫోన్లో కనబడుతున్న పెయింటర్ ముఖాన్ని గుర్తించటానికి తెగ ప్రయత్నం చేస్తాయి. ఆమెకు రకరకాల సలహాలు ఇస్తాయి. మసీదులో అనౌన్స్ చేయిస్తాయి. ఒక ట్రాన్స్ జెండర్ తన ప్రేమ గొడవ మధ్యలోనే చారూకు సాయం చేస్తుంది. తన సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోతున్న పిల్లవాడు పొరపాటున దాన్ని మురుక్కాలవలో పడేయటంతో చారూ అన్వేషణ ముగింపుకు వస్తుంది. ఏ విధమైన ప్రభుత్వ ఐడెంటిటీ లేకుండా, చారూ ఫోన్లో మాత్రమే మిగిలిన ఆ పెయింటర్ ఫోటో ఐ.డి. ఆ విధంగా మురుక్కాలవలో కలిసిపోతుంది. ఆచూకీకి ఏ విధంగానూ ఉపయోగపడని అతని బేసిక్ ఫోన్ చారూను వెక్కిరిస్తుంది. కొసమెరుపుగా, ఐ.డి. ప్రూఫ్ సమర్పించని కారణంగా ఆ కనెక్షన్‌ను రద్దు చేసినట్టుగా సెల్ఫోన్ కంపెనీ నుండి వచ్చిన మెసేజ్ మిగులుతుంది చారూ చేతిలోవున్న అతని ఫోన్లో.

కమల్ చారూ పరిస్థితికీ పెయింటర్ పరిస్థితికీ మధ్యవున్న తేడాను సినిమా అంతటా మనకు చూపిస్తూనే ఉంటాడు. పెయింటర్ భౌతికంగా లేకపోయినా అతని బేసిక్ ఫోన్ ద్వారా ఆమె చేతిలో అతను తన ఉనికిని చాటుకుంటూనే వుంటాడు. అతని గురించి చారూ చేసిన అన్వేషణలో ఈ రెండు ఫోన్లూ తప్పనిసరిగా కనిపిస్తూ, వారిద్దరి ఆర్థిక స్థాయి మధ్యవున్న తేడాను కళ్లముందుకు తీసుకొస్తూనే ఉంటాయి. జీవితంలో చారూ ధ్యేయం వేరు. ప్రచార రంగం, మార్కెటింగ్ రంగం చారూకు ఎక్కువ ఇష్టం. అవి మనుషులను మనుషులుగా వుండనివ్వవనీ వట్టి వినియోగదారులుగా మార్చేస్తాయనీ ఆమెకు తెలిసినట్టు తోచదు. మార్కెటింగ్ రంగంలో ఉన్నతోద్యోగం చేయాలన్నది ఆమె ధ్యేయం. పైకి ఎదగాలన్న మధ్యతరగతి ఆశయానికి ఆమెలోని మానవతావాదాన్ని juxtapose చేస్తాడు కమల్ ఈ సినిమాలో. ఇవి రెండూ కలిసే ఉంటాయని కూడా నిరూపిస్తాడు. మార్కెటింగ్ రంగంలో పెద్ద ఉద్యోగాలు చేస్తున్న సంపాదనాపరులైన యువత, కింది వర్గాల పట్ల వితరణ చూపించటం మనం చూస్తున్నదే. కానీ చారూ చేసిన పని వితరణను మించినది. పెయింటర్ ఎవరో

తెలుసుకోవాలన్న పట్టుదల కూడా ఉంటుంది తనలో. డంపింగ్ యార్డ్ లో తిరుగుతూ ఉండగా ఆమెకు ఉద్యోగం వచ్చినట్టు ఫోన్ వస్తుంది. అక్కడ తిరుగుతూ అడిడాస్ వస్తువులను నార్త్ ఇండియాలో ప్రచారం చెయ్యటానికి తను చేయబోయే అనాలిసిస్ గురించి తను చేరబోయే కంపెనీ బాస్‌తో మాట్లాడుతుంది. స్థల కాలాలతో సంబంధం లేకుండా అప్పుడామె మాటల్లో ముఖంలో కనిపించే సంతోషాన్ని చెత్త కుప్పల మధ్యలో చూపిస్తూ, నిట్టనిలువుగా రెండుగా విడిపోయిన సమాజాన్ని గురించి ఏ ఆలోచనా చేయలేని కెరీరిస్ట్ ధోరణులను ఎగతాళి చేస్తాడు కమల్. ఈ సినిమాలో నాకు బాగా నచ్చిన దృశ్యం ఇది. గమనించాలే గానీ ఇప్పటి సమాజంలో ఇటువంటి వైరుధ్యాలు కొల్లలుగా కనిపిస్తాయి. పట్టుకోగలిగితే విజువల్ మీడియాలో ఇలాంటి షాట్స్‌కు షాక్ వాల్యూ చాలానే ఉంటుంది. పెయింటర్‌ను హాస్పిటల్‌లో చేర్పించి ఇంటికి వచ్చిన చారూకు ఇంట్లో స్నేహితురాలి పుట్టినరోజు పార్టీలో పాల్గొనవలసివస్తుంది. హాస్పిటల్‌లో చావుబతుకుల మధ్యవున్న ఐడీ లేని వ్యక్తి గురించిన ఆలోచనలు ఒకపక్కా, పార్టీ వాతావరణం మరోపక్కా చారూను పిచ్చెక్కిస్తాయి. ఆమె మానసిక పరిస్థితి ఎవరికీ పట్టదు. వాళ్ల గోలలో ఆమె పాల్గొనలేకపోతుంది. ఈ సీన్ కూడా చాలా డ్రమటిక్‌గా, ఒకరి భాష, ఉద్వేగమూ మరొకరికి అర్థంకాని వాతావరణం ఎలావుంటుందో చూపిస్తుంది. తరువాత చివరకు వచ్చేసరికి సినిమా కొంత డాక్యుమెంటరీ ధోరణిలోకి వచ్చినట్టు కనిపించినా, ఐ.డి. లో ప్రేక్షకుల ఆసక్తిని తగ్గించని లక్షణం ఉంది. ప్రేక్షకులను ముంబైలోని అంధేరీ ఉన్నత మధ్య తరగతి ఫ్లాట్స్ నుండి రఫీక్ నగర్, మన్ ఖుర్ద్‌లోని మురికివాడల్లోకి కమల్ చేయించిన ప్రయాణం కష్టంగా ఉన్నా కనువిప్పుగా కూడా ఉంటుంది.


'లయర్స్ డైస్' కూడా బిగువుగా సాగే రోడ్ మూవీ. దీనిలో కూడా అన్వేషణే వస్తువు. వలస కూలీ కోసం అతని భార్య కమల చేసే అన్వేషణ ఈ సినిమా. బోర్డర్ ఫోర్స్ నుంచి పారిపోయి వచ్చిన నవాజుద్దీన్ కొంత దురాశ, కొంత మంచితనం కలిగున్న వ్యక్తి. తను చేసే సాయానికి కమల నుండి వీలైనంత వరకూ డబ్బు లాగాలని ప్రయత్నిస్తాడు. అతనికి ఆమె పట్ల ఆకర్షణ కూడా ఏర్పడుతుంది. కమల, నవాజుద్దీన్‌ల మధ్య వున్న డబ్బు లావాదేవీల మధ్యలోనుంచే ఆకర్షణ లీలగా దోబూచులాడుతూ ఉంటుంది. హిమాలయాల్లో ఉన్న చిత్కూల్ నుంచి ఢిల్లీ వరకూ చిన్న పాప, మేకపిల్లతో పాటు సాగిన వాళ్లిద్దరి ప్రయాణంలో వెదుకులాట, ఎదురుచూపు, నమ్మకం, అపనమ్మకం, సహానుభూతి, డబ్బు యావ... ఇవన్నీ కూడా కలిసి నడుస్తాయి. ఉన్నత హిమాలయాల మంచు ఆవరణల నుంచి, ఢిల్లీ చాందినీ చౌక్ ఇరుకు సందుల ఉక్కబోత వరకూ సాగిన ప్రయాణం కమల భర్త చనిపోయాడన్న నిజం తెలియటంతో విషాదంగా ముగుస్తుంది. కమల భర్త చనిపోయిన భవన నిర్మాణ స్థలంలోనే నవాజుద్దీన్ కూలీగా చేరతాడు. కమల ఇల్లు చేరుతుంది. భద్రత లేని జీవితాల్లో చావు నిశ్శబ్దంగా వచ్చి పోతుంది. దగ్గరివారికి తెలియజేసే బాధ్యత నుండి ఏజెంట్లూ దళారీలూ సులువుగా తప్పించుకుంటారు.

ఈ సినిమాకు 'లయర్స్ డైస్' అనే పేరు పెట్టారంటే బహుశా ఆ లయర్ దళారీ అయివుండవచ్చు. కూలీల జీవితాలు వాళ్ల చేతిలోని పాచికలే. కూలీలు అనారోగ్యం పాలైనా, చనిపోయినా ఏ పరిహారమూ ఇవ్వకుండా తప్పించుకోవాలనుకునే యజమానులూ మోసగాళ్లే. నవాజుద్దీన్ కూడా ఒక చిన్నపాటి లయర్. తీరిక దొరికినప్పుడు చుట్టూవున్న పదిమందితో పాచికలు వేసి డబ్బు లాగుతూ ఉంటాడు. కమలకు చేసిన సాయానికి ప్రతిఫలంగా దళారీ లాగానే డబ్బు తీసుకున్నా కొంత నిజాయితీని కూడా ప్రదర్శిస్తాడు. నిజానికి అతను మోసంచేసి పారిపోదామని ఆలోచిస్తే కమల చేసేదేమీ లేదు. కానీ ఆమెతోనే ఉంటాడు. కమల భర్త చనిపోయిన విషయాన్ని ఆమెకు వెంటనే చెప్పడు. ఆమె ఆ తరువాత తనతోనే వుండిపోతుందన్న ఆశ ఏదో ఉందనిపించేలాంటి ప్రవర్తన అతనిది. స్క్రిప్ట్‌లో చిన్న చిన్న లోపాలున్నా ఆసక్తికరంగా బలంగా కథను నడిపించారు నటులు గీతాంజలి థాపా, నవాజుద్దీన్ సిద్దికి. చదువుకున్న అర్బన్ యువతిగా, పల్లెటూరి అమ్మాయిగా ఈ రెండు సినిమాల్లోనూ ముఖ్యపాత్రలను పోషించిన గీతాంజలి థాపా నటన గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో ఆమె కన్నుల నిండా నింపుకుని పొలికించిన ఆర్తి మరువలేనిది.

ఈ రెండు సినిమాల్లోనూ అన్వేషణ, ఉద్వేగంతో కూడిన ప్రయాణం ఉంటాయి. ముఖ్యమైన కమ్యూనికేషన్ ఎయిడ్ సెల్‌ఫోను కావటం వల్ల దానిద్వారానే అన్వేషణ జరగటం ఎలాగూ తప్పదు. ఎంతో ప్రయత్నం తరువాత కమల భర్త సెల్‌ఫోన్ చివరకు ఢిల్లీలో మోగుతుంది. ఆ ఫోన్ నవాజుద్దీన్ బేగ్‌లో కమలకు దొరికి, భర్త ఇక లేడని అర్థమవటంతో ఆమె అన్వేషణ ముగిసిపోతుంది. చారూ స్మార్ట్‌ఫోన్ బురదలో జారిపోగా, ఆమె చేతిలో పెయింటర్ సెల్‌ఫోన్ మిగులుతుంది. ఆమె అన్వేషణ కూడా అక్కడే ముగుస్తుంది. సెల్‌ఫోన్ లాంటి వ్యక్తిగత కమ్యూనికేషన్ వ్యవస్థలు కూడా అవసరానికి పని చెయ్యని పరిస్థితులు ఎలా ఉంటాయో ఈ రెండు సినిమాల్లో తెలుస్తుంది. రెండిటిలోనూ లేబర్ కాంట్రాక్టర్లు కూలీల బాధ్యతను ఎంత మాత్రం తీసుకోకుండా తప్పించుకుంటారు.

'లయర్స్ డైస్' లో ఆరునెలలుగా కమలనుంచి ఫోన్ కాల్స్ వెళ్తున్న ఆమె భర్త సెల్‌ఫోన్ ఎవరి దగ్గర ఉందో, అది నవాజుద్దీన్ దగ్గరకు అంత సులువుగా ఎలా వచ్చిందో అర్థం కాదు. ఇలాంటి లోపాలు పక్కన పెడితే కమ్యూనికేషన్ విప్లవం రోజుల్లో కూడా అడ్రసులూ ఐడీలూ కూడా సరిగ్గా దొరకని పరిస్థితి వలస కూలీల జీవితాల్లో ఉండవచ్చునన్నది అతిశయోక్తి కాదు. ఊరూ పేరూ తెలియకుండా నగర నాగరికతలో ఏ హక్కులూ లేకుండా నిశ్శబ్దంగా అంతరిస్తున్న ఎంతోమంది వలస కూలీల పరిస్థితిని కళ్లకు కట్టే ఈ రెండు సినిమాలూ మనకు అందించిన దర్శకులు కమల్, గీతూ మోహన్ దాస్‌లు అభినందనీయులు. సంగీతం, సినిమాటోగ్రఫీలు సినిమాలకు తగ్గట్టుగా ఉన్నాయి. లయర్స్ డైస్‌లో నటనకు గీతాంజలి థాపాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు వస్తే, ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా రాజీవ్ రవికి జాతీయ అవార్డు వచ్చింది. ఐ.డి. కూడా చాలా అంతర్జాతీయ బహుమతులను అందుకుంది.

కతలు వెతలు



ఈ ...

బమ్మిడి జగదీశ్వరరావు

అది వూరు! కాదు, అడివి అంటారు కొందరు!

అది యిల్లు! కాదు, దేశం అంటారు యింకొందరు!

ఇదే స్వర్గం అని కొందరు! కాదు కాదు... యిదే నరకం అని మరికొందరు!

ఈ భూమ్మీదే ముల్లోకాలూ అని కొందరు! కాదు కాదు... ఏడేడు పద్నాలుగు లోకాలూ అని యింకొందరు! పైనున్న భూలోక భువర్లోక సువర్లోక మహర్లోక జనలోక తపోలోక సత్యలోక- ఊర్ధ్వలోకాలూ... కిందనున్న అతల వితల సుతల రసాతల మహాతల తలాతల పాతాళ- అధోలోకాలూ... అన్నీ యిక్కడే! ఈ భూమ్మీదే!

ప్రాణిలోకం యెప్పుడూ సుఖాన్ని కోరుకుంటుంది గాని వున్న లోకాన్ని బట్టి సుఖం దుఃఖంగానూ దుఃఖం సుఖంగానూ మారిపోతుంటుంది...

"ఇంతకీ యేలోకంలో వున్నావు మాలోకం?" అని మగ ఈగ తన వెనుక రెండు కాళ్లతో ఆడ ఈగ రెక్కల్ని నిమిరి మరీ అడిగింది!

"సరసాలాడావంటే సచ్చావే?!" హెచ్చరించి కొరకొరా చూసింది ఆడ ఈగ!

"సృష్టిలో పుట్టి సృష్టిలో పెరిగి సృష్టి కార్యానికి దూరంగా వుంటానంటావా?" మదంగా దీర్ఘాలు తీసింది మగ ఈగ!

"ఒక్కసారికి వంద గుడ్లు పెట్టు తెలుస్తుంది... ఆడపుట్టుక యెంత పాడు పుట్టుకో" తుల్ల గసిరింది ఆడ ఈగ!

ఆడ ఈగ చుట్టూ మగ ఈగ ప్రదక్షిణలు చేసింది! కనికరించమని! కరుణించమని! కోరిక తీర్చమని! వేడుకుంది! వేడుక చెయ్యమని! వేడుకనియ్యమని!

"నువ్వు కొవ్వు పట్టి అలా కొట్టుకో! అయినా అది నీ తప్పు కాదు! అంతులేని కామభోగాలు అనుభవించడమే అధోలోకాలకి గతి! అందుకే అధోలోకాలకి సూర్యరశ్మి వుండదు! కళ్లు తెరిచినా చీకటే! మోక్షపు వెలుగు దక్కినప్పుడే జీవికి లోక విముక్తి..." ఆడ ఈగ యింకా చెప్పబోయేదే-

"నువ్వు గుడి వెనక్కి వెళ్లినప్పుడే గుండెపోటు తెప్పిస్తావని నాకు తెలుసే, మురుగు తీర్థాలకి ముచ్చటపడి వెళ్లినప్పుడే మనుషుల మాయరోగాలన్నీ అంటించుకొస్తావని నాకు తెలుసే..." మగ ఈగ యింకా యింకా నిందించబోయేదే-

మధ్యలో పిల్ల ఈగలు జుమ్మంటూ వచ్చి ముసురుకున్నాయి! వాటికి కొత్తగా రెక్కలు రావడంతో యిల్లూ వాకిళ్లూ చాలడం లేదు! పగలూ రేయీ తెలడం లేదు! పెంట మీదవి యింటిమీద వాలుతున్నాయి! ఇంటి మీదవి పెంట మీద వాలుతున్నాయి! ఫలానికీ మలానికీ తేడా లేకుండా వొకటే ఆట! ఒకటే పాట! ఈ... అని!

'చెవిదగ్గర జోరీగలాగ ఆ గోలేమిటి? అవతలకు వెళ్లి ఆడుకోండి.. పొండి' అని గీ మంది మగ ఈగ! పిల్ల ఈగల రొదలని భరించలేకపోయింది! పిల్ల ఈగలు గాలిని రెక్కల కిందకు నెట్టి వుషారుగా పైకి లేచాయి! వాటి వాటమూ వాలకమూ చూసిన తల్లి ఈగ ముచ్చట పడింది! ఆ ముచ్చట మూడు క్షణాల్లో మాయమైపోయింది?!

"ఆగండర్రా" తల్లి ఈగ కేకకి పిల్ల ఈగలు యెక్కడివక్కడ గాలి స్తంభించినట్టు దిగ్బంధించినట్టు ఆగిపోయి 'ఏంటమ్మా?' అన్నట్టు చూశాయి!

"మీరు యెటన్నా వెళ్లండి.. యే దిక్కుకన్నా వెళ్లండి... ఆ ఉత్తర దిక్కుకి మాత్రం వెళ్లొద్దు నాయనలారా..." యెప్పుడూ చెప్పినట్టే అప్పుడూ చెప్పింది తల్లి ఈగ!

"ఏం? ఎందుకూ?" పిల్ల ఈగలూ యెప్పటిలానే అడిగాయి!

"వద్దంటే వద్దు అంతే... యెందుకూ యేమిటని అడగొద్దు..." ఖరాఖండీగా అంది తల్లి ఈగ!

"ఒక్కసారి వుత్తర దిక్కుకి పోయి వస్తామమ్మా" పిల్ల ఈగలు తల్లి ఈగని బతిమలాడేయి!

తల్లి ఈగ తుళ్లిపడింది! వెళ్ళడానికి వీలు లేదంది! వెళ్తే చంపేస్తానని తండ్రి ఈగ! మనం చంపాల్సిన అవసరం లేదంది తల్లి ఈగ! వాళ్లే చస్తారంది! వెళ్ళిన వాళ్లు తిరిగి రారంది! అక్కడున్న మానవ మాత్రులకే యే దిక్కూ దివాణమూ లేదంది!

"వెళ్లము... వెళ్లము లేమ్మా..." అని రాగం తీసి 'చిన్నారి పొన్నారి కిష్టయ్యా నిన్నెవరు కొట్టారయ్యా' అని విన్న పాటందుకున్నాయి పిల్ల ఈగలు! పైకి లేచి యెగిరి వెళ్లాయి!

"ఈ బ్రహ్మాండం యెలా బద్దలవ్వనీ- మనం మన పిల్లా జెల్లాతో పచ్చంగుండాలి! మన జాతిని మనం కాపాడుకోవాలి! అదే నీతి! అదే నేతి! అదే ఖ్యాతి!" అని ఆడ ఈగ అనడంతో మగ ఈగ "మనిషి జన్మ యెత్తాల్సిన దానివి, పొరపాట్న ఈగ పుట్టుక పుట్నావు" అని మెచ్చేసుకొని దాని మెడ మీద చెయ్యివేసేసుకొని దగ్గరకు తీసేసుకుని మురిపాలు పోసింది! ఆ వెనకే తనపని కానిచ్చేసుకుంది!

చెప్పిన పని చేస్తే చప్పగా వుంటుందని, వద్దన్న పని చేస్తే వుప్పుగా కారంగా వీరంగా వుంటుందని వీరంగాలు వేశాయి పిల్ల ఈగలు! వద్దన్న వుత్తరం వేపే వుత్సుకతగా యెగురుకుంటూ ప్రయాణించి వెళ్ళాయి!

కొత్త ప్రపంచం! కళ్లు పట్టని కొత్త ప్రపంచం! ముక్కు పట్టని మూత్రపు వాసన! మలం వాసన! పశువుల పేడ! రొచ్చు! ముచ్చటైన మురుగు! గంజీ గడుగూ కలగలిపిన పుల్లని సుగంధ కుడితి! మతి పోయింది!

ఇది భూలోకమా? అమ్మ చెప్పిన స్వర్గలోకమా? ఏమిటిది? ఏ ప్రపంచమిది? ఇన్నాళ్లూ యిక్కడకు రాలేదేం? జన్మ ధన్యం చేసుకోలేదేం? పిచ్చెత్తి పోతోంది!

పిల్ల ఈగలన్నీ వీర విహారం చేసేశాయి! ఇక్కడ అక్కడ యెక్కడ చూస్తే అక్కడ తామై అంతటా గంతులేసుకుంటూ వాలాయి! వాటి

కళ్లకు ప్రపంచం వొక గోశాల లాగ కనిపించింది?!

"ఇదేమి రాజ్యం? ఇదేమి రాజ్యం?" పిల్ల ఈగలు పాడి పల్లవించాయి!

"స్వాముల రాజ్యం... సన్యాసుల రాజ్యం..." అని వినిపించింది! ఆపక్కనే ఫక్కున నవ్వూ కనిపించింది! చూస్తే పేడ పురుగు!

"ఈగల్లారా మీరు కోరుకున్నట్టు ప్రపంచమిప్పుడు గోశాలే..." అంది పేడ పురుగు! గుండ్రంగా వుండ చుట్టిన పేడని తోసుకుంటూ తోసుకుంటూ అలసిపోయినట్టు ఆగింది!

పిల్ల ఈగల ఆనందానికి అంతూ పంతూ లేదు! కోరుకున్న రాజ్యం వొచ్చిందని కాలు నిలువకుండా గాల్లో గంతులేసి నీరసించి నేలమీదికి దిగాయి! కాళ్ళకి చల్లగా తగిలింది! ఉచ్చా రొచ్చా అని చూసుకుంటే కాలువలు కట్టిన నెత్తురు?! తీస్తే గోశాలల్లో పాలొస్తాయి! కాని తియ్యకుండా నెత్తురు ధారాపాతంగా యెక్కడి నుండి వస్తూ వుందో అర్థం కాలేదు?!

"ఏమిటిది?" పిల్ల ఈగొకటి పిచ్చిగా చూసింది!

"భారతమాత కాళ్లు కడిగిన నెత్తుటి నీళ్లివి... నెత్తిన చల్లుకోండి" చెప్పింది పేడ పురుగు!

కొన్ని ఈగలు నెత్తురు రుచి చూసి మడుగులో మునిగి తేలాయి! మరికొన్ని ఈగలు అర్థం కాని అయోమయంతో బిక్కచచ్చి చూశాయి!

"ఊ... నెత్తురు రుచి చూడండి. మీలోని దేశభక్తి కోసం కాదు, మీ భద్రత కోసం..." క్షేమం కోరి ముందు జాగ్రత్తగా చెప్పింది పేడ పురుగు!

ఆ పిల్ల ఈగల్లో వుండే ఆనందం ఆవిరైపోయింది! సంతోషం సమాధైపోయింది! అమ్మ మాట పెడచెవిన పెట్టి వచ్చామని కళ్ల నీళు పెట్టుకున్నాయి కొన్ని ఈగలు! మనకు తగిన శాస్తే జరిగిందనుకున్నాయి!

ముందు ఆనందంలో పడి వెనక ఆందోళనలో పడి పక్కనే వున్న కుళ్లిన మాంసాన్ని ఆలస్యంగా చూశాయి పిల్ల ఈగలు!

కొయ్యబారిపోయాయి!

"మనకి మాంసం యెక్కడిది? నీకూ నాకూ కొస్తే సేరు సితకల్లేవు! మనిషి మాంసం! భారతమాత ప్రసాదం! సేవించుడు!" అంది పేడ పురుగు!

'ఎక్కడిదీ మాంసం?' అన్నట్టు చూశాయి పిల్ల ఈగలు!

"ఒకడు ఆవు మాంసం తిన్నాడని అనుమానం వచ్చి వాడ్నే మాంసం చేసి భారతమాతకు వడ్డించేశారు వీరభక్తులు!" పేడ పురుగు అది పెద్ద విషయం కాదన్నట్టు చెప్పింది!

"ఒక్కడిని చంపితే యింత మాంసమా?" నోళ్లు వెళ్లబెట్టాయి పిల్ల ఈగలు!

"దేశాన్ని రెండుగా విడదీస్తే- దేశం నిండా నెత్తురు తీర్దానికీ మాంసపు ప్రసాదాలకీ కొదువలేదు..." నవ్వింది పేడ పురుగు!

"దేశాన్ని రెండుగా యెలా విడదీస్తారు?" పిల్ల ఈగల ప్రశ్నలు పిచ్చి ప్రశ్నల్లా అనిపించాయి పేడ పురుగుకి!

"మాంసం తినే వాళ్లూ తినని వాళ్లూ..." అని సులువుగా లెక్క తేల్చి చెప్పింది అప్పుడే వచ్చిన మరో పేడ పురుగు!

ఈగలు అనుమానంగా చూశాయి!

"మాంసానికి కొదువ లేదు! రాముని అనుగ్రహానికి అదుపు లేదు! భక్త జనుల బలానికీ బరితెగింపులకీ అదుపు లేదు!" కూడబలుక్కున్నట్టు వొకే మాటగా చెప్పాయి పేడ పురుగులు!

ఈగలు తిరిగి యింటికి వెళిపోదామని అనుకుని లేచి శాలకు ఆవలి వేపు యెగిరి రెక్కలు తెగినట్టు వొరిగి ఆగి చూశాయి!

ఎవరో చూడ్డానికి మనుషులే! తోటి మనుషుల తోలు వొలిచేస్తున్నారు!

"చచ్చిన ఆవు తోలు వొలిచాడని బతికిన మనిషి తోలు వొలుస్తున్నారహో... రండహో... అందరూ విచ్చేయండహో..." అని డప్పు మోగుతోంది!

ఈగలు బెదిరి యిటు వెళ్లబోయాయి!

ఎవడో తలపాగా చుట్టుకున్నాడని తలని గొరగడం కాదు, యేకంగా తలని పనసకాయ చెక్కినట్టు చెక్కేస్తున్నారు?!

ఈగలు అదిరి అటు వెళ్ళబోయాయి!

ముక్కుపచ్చలారని కుర్రాడు గుర్రమెక్కాడని కాళ్లే కాదు, ప్రాణమే తీసేశారు!

ఈగలు అటూ యిటూ కాక అదిరి బెదిరి అలాగే నిలబడిపోయాయి!

కులాన్ని కాదని పెళ్లాడాడని కళ్లు పీకేశారు! ప్రేమలో పడ్డారని పరువు తీశారని అమ్మాయిల శవాలు చెట్టుకు కట్టని కొమ్మల్లా వేళ్లాడదీశారు! పారిపోయి కాపురం చేస్తున్నారని వెతికి పట్టుకొచ్చి వివస్త్రులను చేసి వొకర్ని వొకరితో మోయిస్తూ వూరంతా వూరేగించారు! మూకగా చేరి ముడ్డి మీద తన్ని ముచ్చట పడ్డారు! పెనిమిటి పెళ్లాలు కలిసి వాహనం మీద వెళుతుంటే చూసి కులం వెక్కిరించిందని చెప్పి భర్త ముందే భార్యని నలుగురూ అత్యాచారంతో తగిన శాస్తి చేశారు!

యువకుడొకడు అగ్రకులం అమ్మాయి చెయ్యి పట్టుకున్నాడని చెయ్యే కాదు, అంగమే తెగ్గోశారు!

"మనుషులందరూ వొకటి కాదా?" అని అమాయకంగా అడిగిందో పిల్ల ఈగ!

"ఇప్పుడు మన ఈగల్లోనే తీసుకుందాం! ఈగలన్నీ వొకటా? కాదు, కానేకాదు! జోరీగ, కందిరీగ, తూనీగ, కుట్టీగ, తేనెటీగ యిలా రకరకాలు! ఒక్కో ఈగకూ వొక్కో సామాజిక గౌరవం! సాంఘీక హోదా! మనలాగే మనుషులు కూడా! అందరూ వొకటే! కాని అందరూ వొకటి కాదు!" చెప్పిందో చెలాకి పిల్ల ఈగ!

మిగతా పిల్ల ఈగలు నోళ్ళు వెళ్ళబెట్టాయి! దీర్ఘంగా ఆలోచించాయి! వాటి చిన్న మెదడుకి అవి చాలా పెద్ద విషయాలుగా తోచాయి! మనుషులకే తప్పనప్పుడు మామూలు ఈగలకి తప్పుతుందా?- అని సరిపెట్టుకొని యెటు పోవాలో తెలియక సరేనని గాలి వాటుగా వెళ్ళబోయాయి!

ఎవరో అంబేద్కరుకు కాషాయం రంగులు పూస్తున్నారు! పక్కనే వున్న బడిలో కాషాయం కట్టుకున్న అమ్మ ఆధ్వర్యంలో పిల్లలకు కత్తులు పంచుతున్నారు! బాపూ బొమ్మని దిష్టిబొమ్మని చేసి తుపాకీతో రౌండ్ల మీద రౌండ్లు కాలుస్తూవున్నారు! నెత్తురు కారుతూ జాతిపిత నేలకు వొరుగుతూ వుంటే 'భారత్ మాతాకీ జై' 'గాడ్సే జిందాబాద్' నినాదాలిస్తూ నినాదలవుతున్నారు! గాడ్సేని వుగ్రవాదని అన్నవాడ్ని కాల్చి చంపుతామని బయల్దేరారు!

సరిగ్గా అప్పుడే పిల్ల ఈగల్ని వెతుక్కుంటూ తల్లి ఈగ తండ్రితో వచ్చింది! పిల్ల ఈగలన్నీ బిర్రబిగుసుకుపోయి తల్లి చాటున చేరాయి! "ఉత్తర దిక్కుకు వెళ్లొద్దని చెప్పానా? ఇప్పుడు చూడండి! చావండి'' అని మండిపడ్డాయి వాటిని కన్న ఈగలు! తిట్టినా అంతలోనే అక్కున చేర్చుకున్నాయి!

"ఊ... ఊ... చెప్పు" యేనుగు లాంటి హూంకరింపు వినబడి ఈగలన్నీ తలతిప్పి చూశాయి!

గెడ్డమూ మీసమూ నెత్తిన తెల్లని టోపీతో వున్న కుర్రాడిని నలుగురు చుట్టుముట్టి పట్టుకున్నారు! "ఊ... ఊ... చెప్పు" పిడి గుద్దులు కురిపిస్తున్నారు! నోటిలోని పల్లు నేల రాలుతున్నాయి! కడుపులోని పేగులు బయటకొస్తున్నాయి! కన్ను చిట్లింది! కంటిపాప జారింది! "జై శ్రీరామ్" నెత్తురు కక్కుకుంటూ వొకడన్నాడు! అన్నవాడు బతికిపోయాడు! నెత్తురు కక్కుకుంటూ అనని వాడు నేలకు రాలిపోయాడు!

ఈగలన్నీ వూపిరి బిగబట్టి చూస్తున్నాయి!

ఇంతలో ముడ్డికి కుర్చీ మూతికి జెండా కట్టుకొని కత్తులూ కరవాలాలు తిప్పుకుంటూ రాజా'లా వచ్చాడొకడు! 'రామ మందిరం కాదంటే తలకాయ నరికేస్తా' అరిచాడు! కుర్రాళ్లూ కర్రలూ అనుసరించాయి! 'కాదంటే దేశం వదిలిపొ'మ్మని హెచ్చరిస్తున్నారు! రక్షకభటులు వారికి ప్రజలనుండి రక్షణనిస్తున్నట్టు టోపీలు ధరించి వందిమాగధులై సెల్యూట్ చేస్తున్నారు!

ఫైజాబాద్ యిక అయోధ్యని వాళ్లకి వాళ్లే ప్రకటించేశారు! ఆహారపు అలవాట్లు జీవించే హక్కుల్లో భాగం కానే కావని తేల్చేశారు! సర్వసత్తాక గణతంత్ర రాజ్యం కాదని, యిది హిందూ రాజ్యమని, హిందూ న్యాయస్థానమని, హిందూ మతానికి హాని కలిగించే విషయంలో చట్టాన్ని అవసరమైతే చేతుల్లోకి తీసుకుంటామని హిందూ మహాసభ తీర్మానించేసింది!

లౌకిక రాజ్యం కోరిన వాళ్ళు నడిరోడ్డుమీద శవాలుగా మారిపోతున్నారు!

శవాలను గౌరవిస్తూ ఈగలు వారి మీద వాలకుండా ప్రదక్షిణం చేస్తున్నాయి!

పిల్ల ఈగల్ని వెంటతీసుకొని కన్న ఈగలు కదిలాయి! గొంతులు ఆర్చుకుపోతుంటే శాలలో కుడితి తాగుతూ తలలు తిప్పి చూశాయి!

పేడ పురుగులు! పేడని వుండలు చేసి దొర్లించుకు పోతున్నాయి!

"గో మలమూ మూత్రమూ యెత్తుకు పోతున్నారని మిమ్మల్ని వీరపుత్రులు వీపు చింపి చంపేస్తే?" పేడ పురుగుల బాగుకోరి భయంతో వణికిపోతూ అంది తల్లి ఈగ!

"ఇవేం గుళికలు?" పేడ వుండని కొత్తగా చూసిన వొక పిల్ల ఈగ అడిగింది!

"వైద్య గుళికలు, రొమ్ము కేన్సరు నిరోధక మాత్రలు" అన్నాయి పేడ పురుగులు!

"చెప్పిన వాళ్ళకి చెదుగాలమైతే వినేవాళ్ళకి వివేకం వుండొద్దా?" తండ్రి ఈగ తల కొట్టుకోబోతే-

"ఇది మతమూ శాస్త్రమూ కలగలిపి తెలిపిన ప్రజ్ఞ'ముతో కూడిన వైద్యము, కాదన్న కన్నెర్రకు గురికావలసి వచ్చును" అంది ముందటి పేడ పురుగు! "అయినా యిది యేనాడో మా పేడ పురుగులు గుర్తించాయి! ఈ పనిలోనే మా తాతలూ తండ్రులూ చాలా కాలంగా వున్నాయి! ఇప్పటికి మాకు పట్టాభిషేకం!" అని చెప్పిన పేడ పురుగు సహా అన్ని పేడ పురుగులు గర్వంగా చూశాయి!

"ఆమె మనం గెలిపించిన మన నాయకురాలు... దేశమూ మనమూ ఆమె వెంట నడువ వలసిందే, యిది దేశీయ వైద్యము... దేశం పట్ల భక్తీ శ్రద్ధా కలవారు కాదని తోసిపుచ్చరాదు" అని మరో పేడ పురుగు చెప్పింది!

"మనుషులు మన ఈగలకన్నా హీనమైపోతారని నేనెప్పుడూ అనుకోలేదు?" నిట్టూర్చింది తండ్రి ఈగ!

"మనకి మన దేశం పట్ల మనకి మన మతం పట్ల సరైన అవగాహన లేనప్పుడు... మనకి మన యితిహాసల పట్ల విశ్వాసమూ గౌరవమూ లేనప్పుడు అలా అనిపిస్తుంది! డార్విన్ కంటే దశావతారాలే బెస్ట్ అని ఆంధ్రా విశ్వవిద్యాలయ ఆచార్యులవంటివారు సెలవీయలేదా? సముద్రజీవులు జంతువులనుంచి మనిషి పుట్టుక జరిగిందని డార్విన్ పదిహేడో శతాబ్దంలో ప్రతిపాదించి వుండొచ్చును గాక! భగవద్గీతలో శ్రీకృష్ణుడు అంతకన్నా ముందున్నాడు! మత్స్యావతారం అంటే సముద్ర జీవి! కూర్మావతారం అంటే నీటిలోనూ నేలమీదా మనగలిగేది! మూడోది వరాహావతారం అంటే భూదేవి రక్షణకు యెత్తిన అవతారం! సగం మనిషి సగం సింహం అంటే నరసింహావతారం! వామనావతారం అంటే బహుచిన్న రూపం... పరిణితి చాలా తక్కువ అర్థంలో తీసుకోవచ్చు! పరశురామావతారం ఆగ్రహానికి ఆలోచనారాహిత్యానికి సంకేతం! ఏడోది రామావతారం అంటే సంపూర్ణ మానవుడు! సైన్సు కాంగ్రెస్ సాక్షిగా యిది మన జ్ఞానం! ఇది మన వెలుతురు! ఇది మన మతం కాదు మన జీవన విధానం!" అచ్చం ఆచార్యుల వారిలానే గుక్కతిప్పుకోకుండా చెప్పింది పేడ పురుగు!

"నాయకత్వమూ బాగుంది... జ్ఞానమూ బాగుంది..." యేమంటే యేమి కొంప మునుగుతుందోనని తల్లి ఈగ వొప్పేసుకుంది! 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి' అని గుడిలో చాగంటి వారి నోటనో గరికపాటి వారి నోటనో విన్నది!

ఈగల్ని ఆపి "జ్ఞానానికి అంతులేదు... మన దేశాధిపతి యేమన్నాడు? మన పూర్వీకులకు ప్లాస్టిక్ సర్జరీ ముందే తెలుసన్నాడు! మొట్ట మొదటి సర్జరీ చేయించుకున్నది ఆది దేవుడు వినాయకుడే" మరో పేడ పురుగు బోర విరుచుకు చెప్పింది!

ఈగలు కదలబోయి ఆగిపోయాయి! దేశీయ జ్ఞానాన్ని తిరస్కరిస్తే దేశీయ మతాన్నీ తద్వారా రాజ్యాన్నీ వ్యతిరేకించినట్టు అవుతుందని తల్లి ఈగ పిల్లల్నీ తండ్రినీ మిగతా 41వ పేజీలో

సమకాలీనం

అడవుల నుండి ఆదివాసీల గెంటివేతే లక్ష్యం

వి. సంధ్య



దట్టమైన అడవుల్లో పరవళ్లు తొక్కే నదులు, పాయలు, చెలమలు, ప్రకృతి సహజ వనరుల మధ్య బతికే ఆదివాసీలు ఇప్పటికే గనులు, ఆన కట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, కర్మాగారాల కోసం తమ ఇళ్లను, భూములను, జీవన ఉపాధినీ కోల్పోయారు. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు మేరకు అడవిని వదిలి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. బడా, బహుళజాతి కంపెనీలు అడవిలోని సంపదను యథేచ్ఛగా దోచుకోడానికి ఆదివాసీలు అడ్డుగా వున్నారు. కనుక, వీరిని ఏదో ఒక పేరుతో వెళ్లగొట్టడానికి బలవంతంగా ఆదివాసీలను అడవితల్లి ఒడినుండి విడదీస్తున్నారు. ఈ ఉద్దేశంతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వత్తిడితో తీర్పులు వెలువడుతున్నాయి, ఆదివాసీ, గిరిజన వ్యతిరేక చట్టాలు రూపు దిద్దుకుంటున్నాయి.

అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోతున్న ఆదివాసీలు

ఈ ప్రపంచంలో మానవ హక్కులు ఎక్కువగా ఆదివాసీలకే ఉన్నా ఈ నాగరిక సమాజం, దోపిడీ పాలక వర్గాలు ఆదివాసీలను చిన్నచూపు చూస్తూ వారి హక్కులను కాలరాస్తున్నారు. 72 సంవత్సరాల స్వాతంత్ర్యం, అతి పెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్న చోట ఆదివాసీలు తమ మనుగడ కోసం అల్లాడిపోతున్నారు. అస్తిత్వం కోసం, మానవ హక్కుల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధం చేస్తున్నారు. ఈ సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాలో ఆదివాసీలను అంతం చేసి వారి సమాధులపై అభివృద్ధికి పునాదులు వేస్తున్నారు. నేడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనా ఆదివాసీల పాలిట శాపంగా మారింది. మానవహక్కులు పూర్తిగా అడుగంటిపోయేలా పాలకులు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు. దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న ఆదివాసీల చట్టాలకు, రాజ్యాంగ రక్షణలకు మరణశాసనం రాస్తున్నారు. ఆదివాసీల కనీస ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్నారు.

అందులో భాగంగానే ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారత అటవీ చట్టం -1927ను ప్రక్షాళన చేస్తామంటూ కొన్ని సవరణలతో 'భారత అటవీ చట్టం -2019' ముసాయిదాను ప్రతిపాదించింది. అంతకుముందే 'నూతన జాతీయ అటవీ విధానం' ముసాయిదాను రాష్ట్రాల ఆమోదానికి పంపింది. ఈ జూన్ నెలలో వీటిని ఆమోదించడానికి రంగం సిద్ధం చేసింది. అదే వ్యూహాన్ని తెలంగాణా రాష్ట్రంలో అనుసరించటంలో భాగంగానే నూతన అటవీ చట్టం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతూ మరో ముసాయిదాను తయారు చేయించింది.

గుత్తాధిపత్యం కోసమే చట్ట సవరణ

భారత అటవీ చట్టం - 1927ను బ్రిటీషు పాలకులు భారత దేశంలోని అడవులపై తమ గుత్తాధిపత్యం చలాయించేందుకు, కలపను దోచుకోవడానికి అనువుగా రూపొందించారు. ఈ చట్టం ద్వారా భూమి పుత్రుల, అడవి పుత్రుల హక్కులను కాలరాచారు. అయితే వలస పాలకుల కాలం నాటి చట్టం స్థానంలో కొత్తగా రూపొందిస్తున్న ముసాయిదా చట్టం ఈ గుత్తాధిపత్యాన్ని కొనసాగించి మరింత విధ్వంసాన్ని సృష్టించే విధంగా వుంది. అధికారులు యథేచ్ఛగా కాల్పులకు పాల్పడే అధికారాన్ని సైతం కట్టబెట్టే విధంగా వుంది. అటువంటి చర్యలకు పాల్పడిన అధికారులపై విచారణ జరపకుండా రక్షణ కూడా కల్పించింది. ఇటువంటి నియంత్రణలతో కూడుకున్న ముసాయిదా చట్టంపై రాష్ట్ర ప్రభుత్వాల సూచనల కోసం కేంద్రం పంపించింది. ఈ సమాలోచనలు జూన్ ఏడవ తేదీన ముగుస్తాయి. బిజినెస్ స్టాండర్డ్ పత్రిక మాత్రమే ఈ ముసాయిదాపై సమీక్ష జరిపింది. 1927 నాటి వలస పాలకుల చట్టం, ప్రస్తుత ప్రతిపాదిత ముసాయిదాలను పోలుస్తూ జరిపిన సమీక్షలో విస్తుపోయే అనేక అంశాలున్నాయి.

అటవీ హక్కుల చట్టం - 2006లో కల్పించిన హక్కులను, రక్షణను కాలరాచేలా నియంత్రణాధికారాలు ఈ ముసాయిదాలో కట్టబెట్టారు. అటవీ అధికారులకి ఆదివాసీల, గిరిజనుల సంప్రదాయ హక్కులను తొలగించే వెసులుబాటును కల్పించారు. ఇప్పటికే పాలకుల నిర్వాకం వల్ల వారికి అటవీ సంపదపై గల హక్కులను కూడా ఆదివాసీలు అనుభవించనీయని పరిస్థితులున్నాయి. నానాటికీ అడవి లోపలికి కుదించుకు పోతూ, సంక్షేమ పథకాలేవీ అందకుండా అంతరించిపోతున్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు చేయకుండా, హక్కులను అనుభవించకుండా అవరోధాలు కల్పించారు. సంప్రదాయ గ్రామ సభల అధికారాలను తగ్గిస్తూ ' గ్రామ అడవులనే ' కొత్త ప్రతిపాదన చేసారు. ఈ 'గ్రామ అడవుల' వ్యవహారంలో అధికారులదే పైచేయి. వారిదే చివరిమాట అవుతుంది.

అంతేకాదు, అవసరం అనుకున్నపుడల్లా రాష్ట్ర ప్రభుత్వాలకు అడవుల నిర్వహణ మీదున్న అధికారాల విషయంలో నేరుగా కేంద్రం జోక్యం జేసుకుని వారిని కూడా పక్కకు పెట్టగలదు. అవసరమైన చోట అడవులను వాణిజ్య అవసరాలకు అనువుగా వాడుకునేందుకు వీలు కల్పించాలని స్పష్టంగా ఈ ముసాయిదా తెలిపింది. ప్రభుత్వ, ఫారెస్టు యంత్రాంగం కానీ, ప్రయివేటు సంస్థలు కానీ ఈ పని చేయవచ్చును అనే వెసులుబాటు కల్పించారు.

అడవుల్లో నివసించే వారి హక్కుగా భావించే అటవీ భూముల, ఉత్పత్తుల విషయంలో అపరిమిత అధికారాలను అధికారులకు

కట్టబెట్టి, ఆ భూములపై పెత్తనం చేసేలా వారికి వీలు కల్పించేందుకు రూపొందించిన అటవీ చట్టం - 1927 మీద గత తొంభై ఏళ్లుగా ఎన్నో విమర్శలున్నాయి. దీనిని ఉపయోగించిన అనేక సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై పెట్టిన వందలాది కేసుల్లో కోర్టులు విచారణను రద్దు చేసాయి. తమ హక్కులకోసం ఆదివాసీలు చేసిన చారిత్రాత్మక పోరాటాలను అణచివేయడానికి వలస పాలకులు తెచ్చిన 1927 చట్టం పూర్తి నియంతృత్వ పోకడలను కలిగి వుందని అనేక మంది నిపుణులు తేల్చారు. నివేదికలు కూడా పేర్కొన్నాయి. 2019 ముసాయిదా ప్రకారం ఈ అధికారాలు మరింత పెరిగి అడవి బిడ్డలను అడవులకు దూరం చేయడానికి, మధ్య భారతంలో, ఏజెన్సీ ప్రాంతాలలో నిర్బంధం, అణచివేత పెంచడానికి దోహద పడనున్నాయి.

మరింత కఠినతరంగా మారిన చట్టం

గత చట్టంలో బెయిలుకు అర్హమైన కొన్ని నేరాలను కాస్తా ఇందులో నాన్ బెయిలబుల్‌గా మార్చనున్నారు. నేరం తమది కాదని నిరూపించుకునే బాధ్యత కూడా నేరం మోపబడినవారి మీదే పెడుతున్నారు. అంతవరకు వారు నేరస్తులుగానే పరిగణింప బడుతారు. అటవీ అధికారులకు తుపాకులు యథేచ్ఛగా వినియోగించుకునే అధికారాన్ని కూడా ఈ చట్టం ఇచ్చింది. అడవులను కాపాడే పేరుతో రూపొందించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 197లో పొందుపరచిన నిబంధనలకన్నా ఇందులో అదనంగా ఉన్నాయి.

1927 చట్టంలో, మరికొన్ని చట్టాల్లో ఆదివాసీల పట్ల ఈ రకమైన నియంతృత్వ పోకడలను గుర్తించి వాటిని తగ్గించడానికి అటవీ చట్టం - 2006ని రూపొందించారు. అయితే, పాలకులు చిత్తశుద్ధితో ఈ చట్టాన్ని ఎప్పుడూ అమలు చేయలేదు. తక్కువ బలగమున్న తాము ఎంతో విస్తారమైన లేదా పూర్తిగా అందుబాటులోకి రాని అటవీ భూములను కాపాడే బాధ్యత మొయ్యాల్సి వస్తుందని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. అడవులపై తమ పట్టును బిగించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు విస్తృత అధికారాలని కోరుతున్నారు. అందులో భాగంగానే కొత్త విధానాలకు, చట్టాలకు ప్రతిపాదనలు చేస్తున్నారు.

నిందితులను బంధించడానికి అటవీ అధికారులకు అవసరమైన బలగాలను పెంచుతూ, ఆయుధాలను భద్రపరిచేందుకు నిర్దేశిత పద్ధతులల్లో 'లాకప్ రూం'లను నిర్మించాలని కూడా ఈ చట్టం చెప్పింది. ప్రతి ఫారెస్టు డివిజనులో రెండేళ్ల లోపు వీటిని నిర్మించాలి. అటవీ అధికారులకు అడవులను కాపాడే పేరుతో ఇచ్చిన రక్షణలు, కొన్ని నిబంధనలు, అధికారాలు ఇందులో చాలా విస్తారంగా వున్నాయి. సాయుధ పోరాటాలు, ఘర్షణలు నిరంతరం జరుగుతున్న ప్రాంతాలలో అమలవుతున్న సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం కన్నా ఎక్కువ రక్షణ, అధికారాలు ఈ చట్టం ద్వారా వారికి లభిస్తోంది. అటవీ చట్టం అమలు కోసం, విధులు నిర్వహించే ఏ అధికారినీ ఎటువంటి ఆరోపణలు ఉన్నా, వుల్లంఘనలకు పాల్పడ్డా రాష్ట్ర ప్రభుత్వం కింద పనిచేసే సంస్థలు విచారణ జరగకుండా కనీసం అరెస్టు చేయడానికి కూడా వీలు లేదు. అది కూడా మేజిస్ట్రేటు స్థాయి విచారణ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అటవీ అధికారుల మీద విచారణకు ఆదేశించే వీల్లేదు అంటుంది చట్టం.

ఆదివాసీల అణచివేతకు విస్తృతాధికారాలు

వన సంరక్షణ పథకాలు, అటవీ హక్కుల చట్టాలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. అటవీ చట్టం - 1927 కింద, ఇతర చట్టాల కింద నమోదైన అనేక కేసులను తమ రాజకీయ లబ్ధి కోసమే పాలకులు ఎత్తేసారు. అటవీ సంపదను ఇతరులు దొంగిలించిన, తరలించిన సందర్భాల్లో దర్యాప్తు చేయడానికి, తనిఖీలు నిర్వహించడానికి, ఆస్తులను జప్తు చేయడానికి, సాక్షులను ప్రవేశ పెట్టడానికి అటవీ అధికారులకున్న అధికారాలు ఎప్పుడూ సక్రమంగా వినియోగించరు. కొన్ని సందర్భాలలో మరింత విస్తారంగా వ్యక్తులు, స్మగ్లర్లు చేసిన నేరాలకు సామూహికంగా వున్న తెగలను, అమాయక ఆదివాసీలను శిక్షించడానికి మాత్రమే వలస పాలకుల చట్టాలూ, ఆనాటి నిబంధనలు కూడా అలాగే కొనసాగుతున్నాయి. ఎప్పుడైనా అటవీ సంపద దొంగతనమైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తనకు తోచిన విధంగా ఆ నిర్దేశిత ప్రాంతంలో అటవీ హక్కులను, అటవీ సంపద పై హక్కులను తొలగించవచ్చు అన్న నిబంధనలు ఇందులో ఉన్నాయి.

ఇవి చాలవన్నట్లుగా, నూతన అటవీ విధానంలో భాగంగా కేంద్రం అటవీ అధికారుల చర్యలపై, బాధ్యతలపై రెండో, మూడో దశల సమీక్షలను ప్రవేశపెడుతుంది. అత్యున్నత అధికారులు రూపొందించే నివేదికలను బట్టి నిర్ణయాలు తీసుకుంటుంది. వాణిజ్య అవసరాల కోసం కేంద్రం కొత్తగా ఉత్పత్తి అడవులనే కొత్త విభాగాన్ని సృష్టించింది. 'కార్బన్ సెక్వెస్ట్రేషన్' ను తగ్గించడమన్న పేరుతో అటవీ భూభాగాన్ని విస్తరించే నిమిత్తం ప్రత్యేక జోన్‌గా ప్రకటించవచ్చు. సురక్ష అడవులని, అటవీ భూములను అటవీ నిర్వహణ కిందకు తీసుకొని రావడానికే ఈ చట్టం అంటున్నది కేంద్ర ప్రభుత్వం. అది జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ అంటూ పోరాడుతున్న శక్తుల అణచివేతకు, వారికి అండగా ఉద్యమ శక్తులను చేరనీయకుండా ఉపయోగిస్తుందని బలీయంగా చాలామంది నమ్ముతున్నారు.

పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోవడమే

భారతదేశం 10 కోట్లమంది ఆదివాసీలకు, గిరిజనులకు ఆవాసం. దేశంలోని మొత్తం ఆదివాసీ, గిరిజన జనాభాలో 40 లక్షలమంది రక్షిత అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దేశంలో సుమారు 500 వైల్డ్ లైఫ్ శాంక్చ్యురీలు, 90 జాతీయ పార్కులు ఉన్నాయి. ఇవి భారతదేశ మొత్తం విస్తీర్ణంలో సుమారు 5 శాతం ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. చరిత్రకారుడు రామచంద్ర గుహ మాటల్లో చెప్పాలంటే వారు అణగారిన అల్పసంఖ్యాకులు. వారు ఎంత దుర్భర జీవితం గడుపుతున్నారో, కనీస హక్కులు ఎట్లా కోల్పోతున్నారో అనేక సందర్భాల్లో ఆయన చెప్పారు. ఖనిజ నిక్షేపాలు పుష్కలంగా ఉన్న రాష్ట్రాల్లోని దట్టమైన అడవుల్లో వీరు మనుగడ కోసం పోరాడుతూ దుర్భర జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వ పథకాలు అందకపోవడం వల్ల వాళ్లు ఇంకా అనాగరికంగానే జీవిస్తున్నారు. వాళ్లకు వచ్చినటువంటి ప్రత్యేక నిధులతో కూడిన పథకాలు కింది స్థాయిలో పేదరికంలో ఉన్నవారికి అందడంలేదు. దీనివల్ల మరింత దీనమైన స్థితిలో ఉండిపోతున్నారు. తినడానికి సరిగ్గా తిండిలేక, జబ్బులొస్తే వైద్యం లేక మగ్గిపోతున్నారు. చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం లేక రక్త హీనతతో, ఇతర ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి, శిక్షణ

ఇచ్చి అటవీ ప్రాంత పరిసరాలలో దొరికే సంపదతో జీవనాధారం కల్పించాలి. చేతి వృత్తులకు, సంప్రదాయ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడానికి ప్రభుత్వాలే తగిన కృషి చేయాలి. కానీ, ఇవేమీ చేయకుండా అటవీ చట్టాల ఉల్లంఘన అంటూ తమ ప్రతాపాన్ని చూపుతూ అణచివేతలకు పాల్పడుతున్నారు. ఆదివాసీల నిరంతర పోరాటాలతో, లెక్క లేనన్ని త్యాగాలతో సాధించుకున్న హక్కులను, రక్షణలను మాత్రం కాలరాస్తున్నారు.

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో అడవుల్లో నివసిస్తున్న ఇలాంటి 13 లక్షల కుటుంబాలు త్వరలో అక్కడి నుంచి ఖాళీ చేయాలని సూచించింది. అటవీ హక్కుల కోసం వచ్చిన 40 లక్షల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం 17 రాష్ట్రాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీచేసింది. అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం 2005 డిసెంబర్ 13కి పూర్వం నుంచి అడవిలో నివసిస్తున్న ఆదివాసీ, గిరిజనులకు వారి అధీనంలో ఉన్న భూములలో నివసించే హక్కు ఉంటుంది. అడవుల్లోని ఇతర సంప్రదాయ తెగలు ఎవరైనా నివాసం ఉంటే వారు 2005 డిసెంబరు 13కి పూర్వం నుంచి మూడు తరాలు అక్కడ నివసిస్తున్నట్లు ఆధారాలు చూపించాలి. అప్పుడే వారి ఆక్రమణలో ఉన్న అటవీ భూమిపై వారికి హక్కు ఉంటుంది. ఇక్కడ తరం అంటే చట్టంలో 25 ఏళ్లుగా తీసుకున్నారు. అంటే, 2005 డిసెంబరు 13కి ముందు 75 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్నవారై ఉండాలి.

కార్పోరేట్ల సేవకే తీర్పులు

'స్వతంత్ర' భారతదేశంలో ఇంత పెద్ద ఎత్తున ఆదివాసీలను, గిరిజనులను తరలించాల్సి రావడం అనేది ఇదే ప్రథమమని ఎన్విరానమెంటల్ జర్నలిస్ట్ నితిన్ శేథీ అన్నారు. అడవులు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నాయని, అడవుల్లో అక్రమంగా నివసిస్తున్న వారి కారణంగా వన్యప్రాణి సంరక్షణ ప్రమాదంలో పడుతోందని వైల్డ్ లైఫ్ యాక్టివిస్టులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. అటవీ హక్కుల చట్టం అనేది అనాదిగా అరణ్యాల్లో నివసిస్తున్నవారికి భూమిపై హక్కు కల్పించడానికి వుద్దేశించిందే కానీ భూపంపిణీ, వితరణకు ఉద్దేశించింది కాదని పిటిషనర్లలో ఒకరైన వైల్డ్ లైఫ్ ట్రస్ట్‌కు చెందిన ప్రవీణ్ భార్గవ్ అన్నారు. అంతేకానీ చెట్టును పుట్టను నమ్ముకున్న మూలవాసులు, అడవి ఆనవాళ్లు తప్ప మరో లోకం తెలియని వాళు బయటకు వస్తే భాషా, సంస్కృతులు వేరై బతుకు లేనివాళ్లవుతారని తెలిసినా వాళ్లు పట్టించుకో దలచుకోలేదు. కార్పోరేట్ల సేవలో తరించే ఈ యాక్టివిస్టులు ఆదివాసీలకు వ్యతిరేకంగా పనిచేసేవారన్నది నిలువాదంశం. తాజా పరిణామాలన్నీ కొందరు పర్యావరణవేత్తలు, సామ్రాజ్యవాద అనుకూల వైల్డ్ లైఫ్ యాక్టివిస్టుల అత్యుత్సాహం కారణంగా ఏర్పడినవేనన్న విషయం బుద్ధి జీవులందరికీ తెలుసు. 'క్యాంపెయిన్ ఫర్ సర్వైవల్ అండ్ డిగ్నిటీ' అనే న్యాయసేవల సంస్థ నివేదిక ప్రకారం చాలామంది దరఖాస్తులను అర్హత ఉన్నా తిరస్కరించారు. దీనికి కారణం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నదనీ, అందుకే హక్కుల చట్టాల్ని కాపాడలేక పోతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

అలజడి రేపుతున్న సవరణలు, విధానాలు

కోర్టు ఆదేశాల కారణంగా, 'భారత అటవీ చట్టం -2019', 'నూతన జాతీయ అటవీ విధానం' కారణంగా ఆదివాసీ, గిరిజనులపై అటవీ అధికారుల, పోలీసుల దౌర్జన్యాలు ఇంకా మితి మీరుతాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. కోర్టు జులై 27 నాటికి అక్రమ నివాసులుగా ప్రకటించిన వారిని అడవుల నుండి ఖాళీ చేయాలని ఆదేశించడంతో షెడ్యూల్డ్ తెగల జనాభా అధికంగా ఉన్న, అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఇప్పుడు అశాంతి నెలకొని అలజడి రగులుతున్నది. ఈ అలజడి కార్చిచ్చులా మారి అంటుకునే పరిస్థితి కనిపిస్తున్నది. అడవి ఒక రణరంగంగా మారిపోతున్న తరుణంలో అడవిలో ఉన్న ఆదివాసీ బిడ్డల గురించి, వారి మానవ హక్కుల గురించి ఆలోచించే బుద్ధిజీవులు, ప్రజాస్వామిక వాదులు ముందుకు వచ్చి ఆదివాసీ సమాజానికి సంపూర్ణ మద్దతు తెలపాలి. వారి విముక్తి పోరాటాలే సమస్త ప్రజానీకానికి మార్గదర్శకం అన్న వాస్తవాన్ని గుర్తించాలి. ✿

38వ పేజీ తరువాయి

ఆగమని మహాజ్ఞానాన్ని అందుకోమని మహాప్రసాదమని యీ అవకాశం అందరికీ రాదని చెప్పి, చెప్పమన్నట్టు పేడ పురుగుల వంక చూసింది!

లక్ష్యాన్ని ఛేదించి వెనుకకు రాగలిగిన క్షిపణులు రామాయణ కాలంలోనే వున్నాయని, రావణుని దగ్గర యిరవైనాలుగు రకాల విమానాలు వుండేవని, లంకలో ఎయిర్‌పోర్టు కూడా వుండేదని మన ఆచార్యులు చెప్పారని చెప్పింది పేడ పురుగు! అక్కడితో ఆగలేదు! ఐనిస్టీన్, న్యూటన్, స్టీఫెన్ హాకింగ్ చేసినవి సిద్ధాంతాలు కావని, కేవలం అవి ప్రయోగాలని, వీళ్ళంతా నాకంటే పెద్ద శాస్త్రవేత్తలు కారని మన తమిళ కేజే కృష్ణన్ సైన్స్ కాంగ్రెస్ వేదిక మీద చెప్పడం మనకీ మనదేశానికీ గర్వకారణం అంది పేడ పురుగు! నెట్టూ వైఫై యేనాడో మనకు వున్నాయి! పులి చర్మం మీద కూర్చుంటే ముసలితనం రాదు! ఆవు మూత్రంలో వున్న బ్యాక్టీరియా ఆహారాన్ని స్వచ్ఛమైన బంగారంగా మారుస్తుందని పేడ పురుగు సైన్సు కాంగ్రెస్సుకు వెళ్లొచ్చినట్టే చెప్పింది!

ఇంతలో ఆవు అంబా అని అరిచింది!

అంతే ఈగలు ఝూమ్మని బాంబు పడ్డట్టు లేచాయి! చెల్లా చెదురయ్యాయి! ఒక అమాయకపు పిల్ల ఈగ "ఏమయిందమ్మా?" అని తల్లి ఈగని అడిగింది!

"మన ప్రాణం మీదికి వచ్చింది" అంది తండ్రి ఈగ పిల్లల్ని యింటివేపు తరుముతూ వుంది!

"ఆవు అంబా అని అరిస్తే అంత ప్రమాదమా అమ్మా?" మరో పిల్ల ఈగ పట్టువీడకుండా నివ్వెరపోయి నీరుగారి అడిగింది!

"ఇలాంటి నాయకులూ శాస్త్రవేత్తలూ వున్న దేశంలో ఆవు అంబా అని అరిచిందంటే, ఆవుకు ఆకలేసి అరిచింది అని అమాయకంగా నువ్వో నేనో అనుకోవచ్చు! కాని ఆవుకు ఆపద వచ్చిందని మన పాలకులూ యేలికలూ అనుకుంటారు! పక్కన వున్న మనిషికే కాదు, ఈగకయినా యిక పుణ్యగడియలు సమీపించినట్టే" అని పిల్ల ఈగ రెక్కపట్టుకు లాగి తల్లి ఈగ సహా ఈగలన్నీ యింటికి చేరుకున్నాయి!

త్రివర్ణ పతాకానికి యిప్పుడు వొకటే రంగు కమ్మేసింది! ✿

వివక్ష

చరిత్ర పునరావృతం



వంగపల్లి పద్మ

1970ల్లో హైదరాబాద్‌లో రమీజాబిపై జరిగిన లైంగిక దాడి.

2019లో జరిగిన రాజస్థాన్ అల్వార్‌లో లైంగిక దాడి.

దశాబ్దాలు గడిచినా కేసులు ఒకేలా పునరావృతం అవుతూనే ఉన్నాయి.

పోలీసు వ్యవస్థ ఒకేలా స్పందిస్తోంది. వాళ్లని పోషించే రాజ్యనీతి ఆవగింజంతైనా మారకుండా నడుస్తోంది.

ఏప్రిల్ 26 న మోటార్ సైకిల్‌పై వెళ్తున్న జంటను థానాగాజీ – అల్వార్ రోడ్డులో దుండగులు అడ్డగించారు. భర్తను చితకబాదారు. భర్త కళ్లముందే భార్యపై లైంగిక దాడి చేసారు. ఈ దాడిపై ఫిర్యాదు చేసేందుకు థానాగాజీ పోలీస్ స్పెషల్ ఎస్పీని సంప్రదిస్తే, ఎన్నికల సన్నాహాలలో ఉన్నామని, ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆగాలని బదులిచ్చారని బాధితురాలి భర్త ఆరోపించారు. ఎఫ్ఐఆర్ కూడా మే 2న నమోదు చేశారని చెప్పారు. ఏప్రిల్ 30న ఓ నిందితుడు తనకు ఫోన్ చేసి డబ్బులివ్వాలని డిమాండ్ చేశాడని చెప్పారు. లేకపోతే వాట్సాప్‌లో సర్క్యులేట్ చేస్తానని బెదిరించాడని తెలిపారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మే 2న దుండగులు వీడియోను సర్క్యులేట్ చేశారు. దీంతో వీడియో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న ప్రతిపక్షాలు, అధికార పార్టీపై విమర్శలు చేయడం మొదలు పెట్టాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. ఈ కేసులో మానవహక్కుల సంఘం వైస్ చైర్మన్ మురుగన్ మాట్లాడుతూ, ఈ కేసులో పోలీసులు ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఇంతగా కలకలం రేపిన ఈ దాడి తరువాత కూడా, అదే రాష్ట్రంలో ముగ్గురు మైనర్ బాలికలపై లైంగిక దాడులు జరగడం మరో విషాదం. ఇది ఒక్క రాజస్థాన్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా పెరుగుతున్న దుస్థితి.

అల్వార్ దళిత మహిళపై అత్యాచారం సంఘటన

ఆవును చంపితే జరిగే హంగామా, చేసే రాద్ధాంతం అంతా ఇంతాకాదు. కానీ, ఒక చిన్నారి మీద, మహిళల మీద జరిగే హింసను, లైంగిక దాడిని అంత సీరియస్‌గా పట్టించుకోకపోవడంలోనే అసలు స్వరూపాలు బహిర్గత మవుతున్నాయి. మహిళలమీద మరీ ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు చెందిన వారి మీద జరుగుతున్న దాడులు ఒక నయా ఉన్మాదం దిశగా అడుగులు వేస్తున్న వైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో భూస్వామ్య వ్యవస్థ శకలాలు ఇప్పటికీ బలంగా వేళ్లూనుకుని ఉండటాన్ని విస్మరించలేం. అదే సమయంలో ఆడపిల్లల పట్ల చులకన భావం కూడా అంతే స్థాయిలో ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రతి గంటకు ఇద్దరు మహిళలు లైంగిక దాడులకు బలవుతున్నారని అధికారిక గణాంకాలే చెప్తున్నాయి. ప్రతి మూడు నిమిషాలకు ఓ మహిళపై ఏదో ఒక రూపంలో అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని %చీజ=దీ% లెక్కలే చెప్తున్నాయి.

మైనార్టీ మహిళలు, చిన్నారుల మీద జరుగుతున్న దాడులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పైగా కొత్త ధోరణి ఏంటంటే, చేస్తున్న వికృత చేష్టల్ని రికార్డు చేసి, సోషల్ మీడియాలో అందరూ చూసేలా చేయడం. జరిగిన దాడితోనే మానసికంగా కుంగిపోయే బాధితులకు, అది ఇంకా ఎంతటి క్షోభను కలిగిస్తుందో మాటల్లో వర్ణించలేం.

తమపై జరిగిన దాడి గురించి, చాలామంది బైటికి చెప్పడానికే సంకోచిస్తారు. చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే బైటికొచ్చి కేసు నమోదు చేస్తారు. అలాంటి తక్కువ సందర్భాల్లో కూడా పోలీసు యంత్రాంగం ఏ మేరకు సహకరిస్తుందో, బాధితుల పక్షాన ఎంత నిజాయితీగా నిలబడుతుందో అనేక సందర్భాల్లో తేటతెల్లమవుతూనే ఉంది. రమీజాబి కేసు నుండి అల్వార్ కేసు దాకా బాధితులకు దక్కిన న్యాయం చూస్తే అర్థమవుతుంది.

పోలీసు యంత్రాంగమెప్పుడూ పాలకుల చెప్పు చేతల్లో ఉంటుందని పదే పదే రుజువవుతుంది. న్యాయవ్యవస్థ కూడా అంతకన్నా భిన్నంగా ఏమీ ఉండదు. భారత సమాజంలో మహిళల కోసం రూపొందిన చట్టాలన్నీ ఉద్యమాల ఫలితంగా రూపుదిద్దుకున్నవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ఇలాంటి ప్రతి సందర్భంలోనూ బలమైన గొంతుకను వినిపించడం, బాధితులకు న్యాయం జరిగేలా చూసేలా ఒత్తిడి చేయడం జరుగుతూనే ఉంది. రమీజాబి కేసు హైదరాబాద్ మహిళా వుద్యమాల్లో ఎంతటి కీలక స్థానాన్ని ఆక్రమించుకుందో ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలేమో!

ఇక తమకు న్యాయం జరగదనే అనుమానం కలిగితే, బాధితులు తమపై జరిగిన దాడుల్ని పోలీలసు దృష్టికి తీసుకురావడానికి ఇక ముందు వెనుకంజ వేసే ప్రమాదముంది. నేరగాళ్లు మరింత రెచ్చిపోవడానికి ఈ సమాజమే ప్రోత్సహించినట్టవుతుంది. న్యాయం

నివేదిక

వెంటాడుతున్న మూడు దుఃఖాలు

వి. సంధ్య

మహిళలపై దేశ వ్యాప్తంగా జరుగుతున్న అనేక దాడులు, అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్న సందర్భంలో మనం ఇప్పుడు జీవిస్తున్నాం. నిర్భయలాంటి కఠిన చట్టాలు ఎన్నో వున్నప్పటికీ చిన్నారులపై, మహిళలపై లైంగిక దాడులు ఆగడం లేదు. ఎక్కడ చూసినా నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు, మహిళలకు రక్షణ లేకుండా పోతున్నది. మైనర్ల నుండి వృద్ధుల వరకూ పురుషులు తమ లైంగికవాంఛ కోసం అనైతికంగా, జుగుప్సాకరంగా ప్రవర్తిస్తున్నారు.

సభ్యసమాజం ఉలిక్కిపడేలా ఇటీవలే జరిగిన హాజీపూర్ సంఘటనా సందర్భంలోకి వస్తే, హైదరాబాదు నగరానికి నలభై కిలోమీటర్ల దూరంలో బొమ్మల రామారం మండలంలో హాజీపూర్ గ్రామం ఉంది. దాదాపు 2000 గడప దాక ఆ వూళ్లో ప్రజలు నివాసం వుంటున్నారు. ఆ ఊరుకి వెళ్లాలంటే బొమ్మల రామారం మీదుగా నాలుగు కిలోమీటర్లు లోపలికి నడిచి వెళితే గానీ హాజీపూరు గ్రామంలోకి అడుగుపెట్టం. ఆ ఊరి పొలిమేర మూల మలుపు నుండి బ్రహ్మ జెముల్ల తోపు ఒకటి దట్టంగా అల్లుకుని వుంటుంది. అక్కడనుండి ఆ ఊరి పొలాలు, చేలు ప్రారంభం అవుతాయి. వర్షాలు లేని కారణంగా ఏర్పడిన నీటి ఎద్దిడితో పంట భూములన్నీ పడావు (బీడు) పడివున్నాయి. అరవై, డెబ్బై అడుగుల లోతున్న మోట బావులన్నీ నీటి చుక్కలేక ఎండిపోయి, పాడుబడిన బావులై భయానకంగా తయారయ్యాయి. అలాంటి భయానక వాతావరణం దాటి మరో కిలోమీటరు దూరం నడిస్తే గానీ హాజీపూరు ఊళ్లోకి అడుగుపెట్టలేము. ఆ వూరికి గతంలో రవాణా అంతా కాలినడకనే సాగేది. గత ఇరవై సంవత్సరాలుగా ఒక ఆర్‌టిసీ బస్సు మాత్రం ఉదయం 7 గంటలకు ఒకసారి, మధ్యాహ్నం 12 గంటలకు, 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు మొత్తం నాలుగు ట్రిప్పులు వచ్చి వెళతుందని, అది తప్ప మరే వాహన సౌకర్యం అక్కడ లేదని తెల్సింది. ఇటు నగరం నుండి రావాలన్నా, అటు భువనగిరి నుండి రావాలన్నా హాజీపూర్ ప్రజలకి బొమ్మలరామారం వరకూ రవాణా సౌకర్యం వుంటుంది. అక్కడ నుండి హాజీపూరుకు, చుట్టుపక్కల ఇతర గ్రామాలకు వెళ్లడం అనేది వారికి చాలా ఇబ్బందికరమైన విషయం. ఉన్న ఆ ఒక్క ఆర్‌టిసీ బస్సు మీదే చాలామటుకు వాళ్లందరూ ఆధారపడి ఆ టైంకు అనుగుణంగా తమ పనులను కుదించుకుని నడుచుకునేవారు. ఒకవేళ వీలు కాకపోతే బొమ్మల రామారం నుండి హాజీపూర్‌కు వెళ్లే ఆవూరి పరిచయస్తుల ద్విచక్ర వాహనాలను ఆపుకుని (బతిమిలాడో, భంగపడో) ప్రజలు వస్తూ వెళ్లడం అతి సహజంగా జరుగుతున్నది. ద్విచక్ర వాహనదారులను అడిగి వారి వాహనాలపై కూర్చొని రావడం మహిళలతో సహా పరిపాటి అని, అది అతి సామాన్యమని అందులో తప్పు కానీ, నేరంగా భావించమని ప్రజలు అన్నారు. కానీ ఇలాంటి సంఘటనలు ఇప్పటివరకూ ఒక్కటి కూడా జరుగలేదని చెప్పడం వెనుక ఊరివారిపై వారికున్న విశ్వాసం,

హాజీపూర్‌లో హత్యాచారాలు

మాట పక్కకు పెడితే, భవిష్యత్ జీవితంలో కనీసం వారు ప్రశాంతంగా బ్రతికే అవకాశం కూడా లేకుండా చేయడమే అవుతుంది.

ముఖ్యంగా దేశంలో గత ఐదేళ్లుగా హిందూ ఫాసిజం అధికారంలోకి వచ్చాక అనేక చోట్ల దళితులు, మైనార్టీ వర్గాల యువకుల మీద, చిన్నారుల మీద, మహిళల మీద జరుగుతున్న దాడుల పర్వం పెరుగుతూనే ఉంది. ఏ కేసులోనూ వారికి న్యాయం జరుగుతున్న దాఖలాలు లేవు. పైగా వారి మీద దాడులు చేయడం తమ హక్కుగా భావిస్తున్నారు. ఇది ప్రమాదకరమే కాదు, మహిళల జీవితాలమీద తీవ్రమైన ప్రభావాన్ని చూపే అంశం. దేశవ్యాప్తంగా ఇలాంటి భావజాలాన్నే నింపుకున్న సమూహాలు గోద్రా లాంటి అల్లర్లను సమీప భవిష్యత్‌లో ఎక్కడైనా సృష్టించగలరు. అందుకు బహుశా మనమందరం సిద్ధపడి ఉండాలేమో! కులోన్మాదం, మతోన్మాదం తెలీకుండానే చాపకింద నీరులా మన జీవితాలను ప్రభావితం చేయబోతోందనే వాస్తవాన్ని గ్రహించాలి.

శబరి ఆలయంలోకి మహిళలు ప్రవేశించాలని ప్రయత్నించిన సందర్భంలో, నిర్భయకు మద్దతుగా నిలిచిన సమయంలో, ప్రణయ్‌ను కోల్పోయిన అమృతకు సమర్థించిన కేసులో, సినిమా రంగంలో లైంగిక దోపిడిని ప్రశ్నించిన శ్రీరెడ్డికి మద్దతిచ్చిన ఉద్యమంలో ఆధిపత్య వర్గాల నుండి, మనువాదుల నుండి, మతోన్మాదుల నుండి వచ్చిన వెటకారపు ప్రశ్నలు, చులకన చేస్తూ మాట్లాడిన వ్యాఖ్యానాలు, సోషల్ మీడియాలో చేసిన ట్రోలింగ్ ఎవరమూ మరిచిపోలేదు. ఇలాంటి చర్యలు, అనేక రూపాల్లో దాడులు మరిన్ని జరిగే ప్రమాదముంది.

ఒకవైపు ఫాసిస్టు శక్తుల అరాచకాలు పెచ్చుమీరుతుంటే, వాటిని ప్రశ్నించే గొంతులు బలహీన పడటం కూడా మరో విషాదమే. ఇలాంటి సందర్భంలో చిన్నారులకు, మహిళలకు రక్షణ కరువవుతున్న అత్యయిక పరిస్థితుల్లో కనీసం మహిళల హక్కుల కోసం నినదించే గొంతులైనా ఒక్క వేదిక మీదకి రావాల్సిన అవసరముంది. అప్పుడే ఇలాంటి దాడులు జరిగినప్పుడు మాట్లాడే గొంతుకలున్నాయనే స్పృహ అవతలి వారికి కలుగుతుంది. నేరానికి శిక్ష అనుభవించాల్సి ఉంటుందనే వాస్తవం అర్థమవుతుంది. అప్పుడు కొన్ని సందర్భాల్లోనైనా, కొన్ని దాడులైన జరగకుండా నివారించగలం. లేదంటే, మన మహిళలు అంతకంతకూ అభద్రతకు లోనుకావాల్సి ఉంటుంది. లేదంటే, రమిజాబి నుండి అల్వార్ దాకా, ఇలాంటి మరెన్నో కేసులు పునరావృతం అయ్యే

నమ్మకాన్ని తెలియజేస్తున్నది. అలా ఆ ముగ్గురు అమ్మాయిలు భరోసాతో, నమ్మకంతో తమ ఊరివాడైన శ్రీనివాసరెడ్డిని నమ్మి బలైన విషయం తాము తీసుకోలేక పోతున్నామని, తమ నమ్మకం బద్దలైపోయిందని వారు చెప్పారు.

మూడు కుటుంబాలకు చెందిన అమ్మాయిలపై జరిగిన దారుణానికి కారణమైనవాడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి అని పేరు బయటకు రావడంతో సమస్త ప్రజల్ని ఆశ్చర్యంలో ముంచడంతో పాటు ఆందోళనలకు గురిచేసింది. అతని జీవిత లోతుల్లోకి వెళ్లి చూస్తే చాలా ఆశ్చర్యకరమైన సందేహాలతో కూడిన విషయాలు బయపడ్డాయి. 32 సంవత్సరాల వయసు గల్గిన శ్రీనివాసరెడ్డి లిఫ్టు ఆపరేటర్‌గా పనిచేసుకునే, బరువు బాధ్యతలు లేని ఓ జులాయి. తాగుబోతు. గంజాయి బానిస. అల్లరి చిల్లరిగా తిరిగే బాపతు. ఊళ్లో వారందరితో అంటీ ముట్టకుండా ఉంటాడు. తల్లిదండ్రులకు మూడవ సంతానం. వ్యవసాయాధారిత కుటుంబం. అతనికి వివాహం చేయాలని తల్లిదండ్రలు తలపెట్టినప్పటికినీ జులాయిగా తిరిగే ఇతనికి ఎవ్వరూ పిల్లని ఇవ్వడానికి కూడా ముందుకు రాకపోవడంతో అవివాహితుడుగానే వుండిపోయాడు. ఒకచోట స్థిరనివాసం లేకపోవడం వలన ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్లి పనులు చేసుకుంటూ వారానికి రెండో, మూడో రోజులు హాజీపూర్ వచ్చి వెళ్లే అలవాటున్న శ్రీనివాసరెడ్డిపై గతంలో కూడా కొన్ని చాలానే ఆరోపణలున్నాయి. 2015కి పూర్వం పొలం గట్లపై గొర్రెలు కాస్తున్న ఒక వివాహిత యువతిపై అత్యాచార యత్నం చేసినట్లుగా ఆరోపణలు వున్నాయి. ఆ స్త్రీ అభియోగం మేరా ఆమె భర్త, బంధువులు శ్రీనివాసరెడ్డిని పట్టుకుని చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన కూడా తమకి తర్వాత తెలిసిందని అని గ్రామస్తులు చెప్పడం విశేషం.

కర్నూలు పట్టణంలో ఒక అమ్మాయిని హత్యచేసిన కేసులో మర్రి శ్రీనివాసురెడ్డి ప్రధమ ముద్దాయి అని తేలింది. రెండు నెలల రిమాండ్ అనంతరం బెయిలుపై విడుదలై గుట్టుచప్పుడు కాకుండా హాజీపూర్ వచ్చి ఉన్నట్లుగా పోలీసుల ఇంటరాగేషన్‌లో స్వయంగా శ్రీనివాసరెడ్డి చెప్పినట్లుగా పోలీసులు అంటున్నారు. ఆతర్వాత బెంగళూరులో ఎటిఎంలో ఓ మహిళపై అత్యాచారయత్నం కూడా చేసినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో సంచలనమైన వరుస సంఘటనలు

హాజీపూరో ్లసంచలనమైన వరుస సంఘటనలు చూస్తే ... కీసరలో వున్న సెర్నిటీ మోడల్ పబ్లిక్ స్కూలులో 9వ తరగతి పాసై 10 వతరగతిలోకి వెళుతున్న 14 సంవత్సరాల శ్రావణి స్పెషల్ క్లాసుల కోసం రోజులాగే 25.04.2019న కూడా స్కూలుకు వెళ్లింది. ఆ అమ్మాయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులందరూ కంగారుపడి ఆరోజు సాయంత్రం ఊర్లోకి బస్సు వచ్చే సమయం (3 గంటల) వరకూ వేచి చూసారు. బంధువులందరూ కల్సి ఆతర్వాత బొమ్మల రామారం అంతా వెతికారు. శ్రావణితో పాటు ఆమె స్నేహితురాలు కూడా 11.30 గంటల వరకు స్కూలు నుంచి వచ్చిన షేరింగ్ ఆటోలో బొమ్మల రామారంలో దిగినట్లుగా రోడ్డుపై వున్న ఒక సిసి కేమారాలో కనబడినట్లుగా బంధువుల ఎంక్వైరీలో తేలింది. రోజు బస్సుకోసం ఒక్కచోటే నిలబడి వేచివుండే శ్రావణి ఆరోజు కూడా చాలాసేపు బస్సుకోసం వేచి వున్నదని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. రామాపురంలో దిగిన అమ్మాయి ఎక్కడికి, ఎవ్వరితో ఊళ్లోకి వచ్చిందో తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్లో కంప్లైంట్ చేసారు. పోలీసులతోపాటు ఊరి జనం అంతా బొమ్మల రామారం నుండి వెతుక్కుంటూ వెళ్తున్న సందర్భంలో ఊరి మూల మలుపులో వున్న బ్రహ్మ జెముడు తోపుల దగ్గరికి వచ్చేటప్పడికి సాయంత్రం 5 గంటలు అయిపోయింది. పోలీసులు రేపు వెతుకుతామని చెప్పినా వినకుండా వూరి ప్రజలందరూ శ్రీనివాసు రెడ్డి పొలంవైపు వెతకడం ప్రారంభించారు. అలా వెతుకుతున్న సందర్భంలో 60 అడుగుల పైగా లోతున్న మోటబాయిలో శ్రావణి స్కూలు బ్యాగు ఎర్రది కనబడటంతో వెంటనే పోలీసులకు కబురు పంపడం జరిగింది. చీకటి పడ్డదన్న సాకుతో పోలీసులు రాకపోవడంతో హాజీపూర్ ప్రజలందరూ కల్సి అక్కడే తచ్చాడుతూ రాత్రి 9 గంటల సమయంలో ఇండ్లకు వెనుదిరిగారు.

ఆ మరునాడు ఉదయమే పోలీసులపై వత్తిడి చేయగా సాయంత్రానికి జాగిలాలతో పోలీసులు బావిలో దిగే ప్రయత్నం చేసారు. బావిలో దిగిన పోలీసులు బ్యాగును పరిశీలించగా అందులో శ్రావణి ఆరోజు శరీరంపై ఉండవలసిన బట్టలు, ఆమె పుస్తకాలు, షూసులు కుక్కబడి వున్నాయి. జాగిలాలు పక్కన వున్న మరో బావి వైపు వెళ్తుండగా ఎస్సై జాగిలాలను అటువైపు వెళ్లకుండా కట్టడి చేసి వెళ్లిపోయారని ఆరోపణలున్నాయి. పక్క బావిలో నుండి వాసన రావడంతో అనుమానంతో ఇంటి పక్క అబ్బాయి భరత్, ఊరి పిల్లలు దిగి చూడడంతో శరీరం అంతా నేలలో పూడ్చి ఉంది. శ్రావణి కాళ్ళు మాత్రం భూమిపై కొంచెం కనబడీ కనబడనట్లుగా ఉండి, కాళ్ళపై ప్లాస్టిక్ కవర్ కప్పి వుంది. నేలను తవ్వి తీసి చూడగా ముఖం అంతా ఛిద్రమైవుంది. ఎటువంటి ఆచ్ఛాదనం లేకుండా నగ్న శరీరం దర్శనమిచ్చింది. పోలీసులు శవాన్ని బయటకు తీసేటప్పుడు కూడా శ్రీనివాసురెడ్డి ఊరి ప్రజలందరితో పాటు కల్సి వుండటం, మరో వైపునుండి దిగమని సలహా చెప్పడం విశేషం. పోలీసుల ఎంక్వయిరీ అనంతరం శ్రీనివాసురెడ్డి ఆ వూళ్లో మాయమవ్వడం, అతని సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం. పాత నేర చరిత్ర ఉండడంతో అతన్ని పట్టుకున్న పోలీసులు విచారించగా ఆశ్చర్యకరమైన సంఘటనలు బయట పడ్డాయి.

శ్రావణి తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ సొంత ఇంట్లో జీవిస్తున్నారు. శ్రావణి అన్న చెల్లెలిని రోజు బొమ్మల రామారం దాక బండిమీద దించిరావడం దినచర్యగా చేస్తాడు. తిరిగి వచ్చేటప్పుడు వుంటే బస్సు లేకపోతే ఎవరో ఒకరి ద్విచక్ర వాహనంపై రావడం ఆమెకు అలవాటే. అదే అలవాటుతో గతంలో కూడా శ్రీనివాసురెడ్డి లిఫ్ట్ ఇచ్చి వుండటం వల్ల ఆరోజు కూడా అతని వెహికల్ మీద రావడానికి సిద్దపడింది. నయవంచకుడైన శ్రీనివాసు రెడ్డి మాత్రం తాను ముందుగా వేసుకున్న ప్లాను ప్రకారం ఆ అమ్మాయిని బావిదగ్గరకు తీసుకుని వెళ్లి అత్యంత పాశవికంగా అత్యాచారం చేయడమే కాదు ఆమె తలకు కట్టుకున్న స్కార్ఫ్‌తో ఉరివేసి బావిలోకి తోసేసాడు. బావిలో ఆమె ఇంకా బతికి వుండటం గమనించి బావిలోకి దిగి ఆమెపై పాశవికంగా మళ్లీ అత్యాచారం చేసి కొనఊపిరితో వున్న శ్రావణిని రాళ్లతో మోది ముఖాన్ని ఛిద్రంచేసి

చంపేసాడు. అదే బావిలో గొయ్యి తీసి ఆమెను పూడ్చిపెట్టి, ఆమె బట్టలను, ఆమెకు సంబంధించిన వస్తువులన్నీ ఆమె బ్యాగులోనే కుక్కి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వేరే బావిలో పడేసి, సుమారు 3 గంటల సమయంలో ఏమీ తెలియని అమాయకుడిలా ఊర్లోకి వచ్చి ప్రజలతో పాటు శ్రావణిని వెతుకుతున్నట్లుగా నటించానని పోలీసుల ఇంటరాగేషన్లో చెప్పాడు.

తీగ లాగితే డొంకంతా కదిలినట్లుగా, మార్చి 7వ తేదిన మనీషా అనే డిగ్రీ చదివే 21 ఏళ్ల అమ్మాయిని కూడా అత్యాచారం చేసి చంపేసానని, అదే బావిలో ఆమె శవాన్ని కూడా పాతిపెట్టానని చెప్పడంతో పోలీసులు ఆశ్చర్యంతో మూడో రోజు మళ్లీ మనిషా శవాన్ని వెలికితీసే ప్రయత్నం చేసారు. మనీషా కూడా శ్రావణి సామాజిక వర్గానికి చెందిన అమ్మాయే. డిగ్రీ చదువుతున్న ఆమెకు ముగ్గురు అక్కలు వున్నారు. ఇద్దరు అక్కలు ప్రేమ వివాహాలు చేసుకున్నారు. తల్లి చనిపోవడంతో తండ్రికి, ఇంట్లో వున్న తాతకు వంట వార్పు చేసిపెట్టి కాలేజీకి వెళ్లి వచ్చేది. కీసరలో డిగ్రీలో చేరి మంచిగా చదువుతుందని పేరుతెచ్చుకుంది. మార్చి 7న కాలేజీకని వెళ్లిన మనీషా తిరిగి రాకపోవడంతో ఇంట్లో తండ్రి, అక్కలు అన్నీ చోట్ల వెళ్లి అడిగారు. బంధువుల ఇళ్లన్నీ గాలించి, కనిపించకుండా పోవడం పరువు తక్కువగా భావించి, పై ఇద్దరు ఆడపిల్లలు ప్రేమ వివాహాలు చేసుకున్నట్లే మనీషా కూడా ఎవరినైనా పెండ్లి చేసుకుని ఉంటుందని అనుకున్నారు. ఏదో ఒకరోజు తానే తిరిగివస్తుందని ఎదురుచూస్తున్నారు. పోలీసు స్టేషనుకు వెళ్లి కంప్లయింట్ ఇద్దామంటే ఊళ్లో అందరికీ తెల్సి పరువు పోతుందని వెరచి మిన్నకున్నారు. కేవలం చదువుమీద వున్న ఆశతో భవిష్యత్తు మీద కలలు గన్న మనీషా మార్చి 7వ తేదీన మదపిచ్చి ఉన్న శ్రీనివాసు రెడ్డి సహాయం తీసుకుని, కలలుగన్న జీవితాన్ని కోల్పోయింది. ఆమెపై అత్యాచారం చేసి శ్రావణిని పూడ్చిన బావిలోనే పాతిపెట్టాడు. దాదాపు 45 రోజుల తర్వాత ఆమె సగం కుళ్లిపోయిన శవాన్ని, ఆమె బట్టలను గుర్తించిన కుటుంబ సభ్యులు ఊరు ప్రజలు నివ్వెరపోయి దు:ఖించారు. తర్వాత కోపంతో రగిలిపోయి నిందితుల ఇంటిని ధ్వంసంచేసి తగలబెట్టారు. శ్రీనివాసరెడ్డిని తమకు అప్పగిస్తే చూసుకుంటామని అన్నారు.

వంతులవారిగా జరిపిన పోలీసు ఇంటరాగేషనులో కల్పన అనే మరో 9 ఏళ్ల అమ్మాయిని కూడా అత్యాచారం చేసి ఆపైన హత్యచేసి శ్రావణి బ్యాగు దొరికిన బావిలో శవాన్ని పూడ్చిపెట్టిన సంగతి శ్రీనివాసు రెడ్డి చెప్పడంతో మళ్లీ కల్పన శవం వెలికితీయడానికి పోలీసులు సన్నద్ధం అయ్యారు. 4సంవత్సరాల క్రితం పూడ్చిపెట్టిన శవం బొక్కలకుప్పగా బయటపడింది. ఈ అమ్మాయి కుటుంబాన్ని పరిశీలించినట్లయితే... కల్పనది మైసిరెడ్డి పల్లి, తల్లిదండ్రులు గొర్రెలు కాసుకుని జీవనం గడుపుతారు. వారికి ముగ్గురు అమ్మాయిలు, ఒక్కడే కొడుకు వున్నారు. అలాంటి కుటుంబంలో చివరి అమ్మాయి అయిన కల్పన 6వ తరగతి పాసు అయి ఎండాకాలం తర్వాత 7వ తరగతిలోకి వెళ్లవలసిన పిల్ల తన మేనత్తకు చేయి విరగడంతో సహాయానికి హాజీపూర్‌కు వెళ్లింది. ఎండాకాలం సెలవులు అయిపోగా 2014 సంవత్సరంలో మేనత్త ఊరు నుండి మైసిరెడ్డి పల్లి కాలినడకన వస్తున్న పిల్ల దారిమధ్యలోనే మాయమైంది. తల్లిదండ్రులు, బంధువులు అందరూ కూడా రెండు ఊళ్లు వెతికి బొమ్మల రామారం పోలీసు స్టేషనులో మిస్సింగ్ కేసు బుక్ చేసినారు. ఆ తల్లిదండ్రులు బిడ్డను ఎవరో ఎత్తుకొని పోయారు, ఎక్కడో బిడ్డ చల్లాగా వుండే ఉంటుందన్న ఆశతో వున్నారు. పోలీసులు ట్రాఫికింగ్‌లో దొరికిన పిల్లల్ని చూడమన్నప్పుడల్లా రైల్వేస్టేషన్‌కు, చివరాఖరుకు యాదాద్రి వ్యభిచార గృహాలలో పట్టుబడ్డ పిల్లల్ని కూడా చూసి తమ బిడ్డ లేదని అనుకున్నారే గానీ, ఏదో ఒక దారిలో వస్తుందని ఎదురు చూస్తున్నారే కానీ ఇట్లా శవమై పోతుందని వారు ఊహించలేదు. ఇలాంటి సందర్భంలో తమ బిడ్డను కడసారి చూపు చూసుకోకుండా ఇప్పుడు బొక్కల కుప్పను చూపి ఇదిగో మీ అమ్మాయి ఆనవాళ్లు అని పోలీసులు ఇస్తే ఆ కన్న తల్లిదండ్రుల పరిస్థితిని అంచానా వెయ్యడం ఎవరివల్ల అవుతుంది?


సామాజిక బాధ్యత లోపించడం పితృస్వామ్య భావజాలం కారణాలు

ఇలాంటి సంఘటనలు జరిగినపుడు మీడియా, జనాలు విషయాన్ని వ్యక్తుల చుట్టూ తిప్పుతారు తప్ప వ్యవస్థీకృతమైనవిగా మాట్లాడరు. అందుకు తగిన విధంగా డిమాండ్లు రూపొందించరు. అందరూ, ముఖ్యంగా పోలీసులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు హాజీపూర్ ఘటనను ఒక సైకోకు సంబంధించిన అంశంగానే చూపే ప్రయత్నం చేశారు తప్ప 'సామాజిక భద్రత, సామాజిక బాధ్యత' అనే వైపుగా ప్రస్తావనలు కూడా చేయలేదు. ఇటువంటి ఘటనలు అనేక ప్రాంతాలలో తరుచుగా జరుగుతున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లుగా కూడా వుండకపోవడం బాధాకరం. పోలీసులు కంటితుడుపు చర్యలు తప్పా ఏ కేసులో అయినా పెద్దగా బాధితులకు న్యాయం జరిగిందేమీ వుండటం లేదు. ఒకవేళ ఏదైనా అనుమానంతో బాధితులు కేసులు పెట్టినా అట్టడుగు వర్గాలకు చెందిన బాధితులను పట్టించుకునే తీరిక, ఓర్పు, బాధ్యత పోలీసులకు ఉండకపోగా మిస్సింగ్ కేసుగా ఫైల్ చేసి నిమ్మకు నీరెత్తినట్లుగా, విచారణ కొనసాగింపు లేకుండా పోలీసులు మిన్నకుండిపోతారు. ఎవరైనా బాధితులు వెంటపడి కేసును విచారించమని కోరితే లంచం కావాలని కోరుతారే తప్ప తప్పిపోయిన పిల్లల ఆచూకీ తెల్సుకోరు. వయసులో వున్న ఆడపిల్లలైతే ఎవరితోనో లేచిపోయిందని అవమానపరచడం, తల్లిదండ్రులు నొచ్చుకునేలా బెదిరించడం చేస్తారు. లేదంటే నిందితుల కొమ్ముగాస్తూ వారి పక్షాన వకాల్తా పుచ్చుకుంటారు. లంచాలకు ఆశపడి, అవినీతికి అలవాటు పడి బాధితులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం పోలీసులకు బాగా అలవాటై పోయింది.

పై సంఘటనలపై నిజనిర్ధారణ కమిటీగా ప్రగతిశీల మహిళాసంఘం బృందం 2.5.2019న హాజీపూర్ గ్రామాన్ని సందర్శించింది. ఇందులో, రాష్ట్ర అధ్యక్షులు సంధ్య, ఉపాధ్యక్షులు సరళ, రాష్ట్ర కమిటీ నాయకులు వరలక్ష్మి, నగర నాయకులు భండారు విజయతో పాటు భూమిక సత్యవతి గారు ఉన్నారు. బాధిత మూడు కుటుంబాలను పరామర్శించి వారి ఆవేదనను, దుఖాన్ని పంచుకుంటూ వారికి న్యాయం జరిగేంతవరకు తోడుగా ఉంటామని సంఘీభావం తెలపారు. పోరాడి సాధించుకున్న బంగారు

తెలంగాణాలో కనీస రవాణా సౌకర్యం లేకనే ఆ ముగ్గురు అమ్మాయిలు బలైపోయారని అన్నారు. పేదవాళ్లు చదువుకోవడం అంటే ప్రమాదం అంచున ప్రయాణంగా ఉండాలా? అమ్మాయిలకు భద్రత కావాలంటే చదివించకుండా ఇంటికే పరిమితం చేయాలా? అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం పట్టని పాలకులు రోడ్లు వేయకపోవడం, ప్రభుత్వ రవాణా సౌకర్యం కల్పించకపోవడం వల్లే వాళ్లు దారుణానికి బలయ్యారని అన్నారు. అందుకే, చుట్టూ పక్కల గ్రామాలకి తక్షణమే బస్సులు నడపాలనీ, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. నేరస్థులు ఇంకా ఎవరైనా ఉంటే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించడానికి తగిన విధంగా చార్జి షీట్ నమోదు చేయాలని, బాధిత కుటుంబాలకి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ✿





తెలంగాణ రాష్ట్రం

రాజస్థాన్‌లోని అళ్వార్‌లో 19 ఏళ్ల దళిత యువతిని, ఆమె భర్తని వివస్త్రలను చేసి ఐదుగురు దుండగులు హైవే పక్కకు లాక్కుపోయి గ్యాంగ్ రేప్ చేశారు. 'తాను దళిత యువతిని కావడం వల్లే తనపై అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. వాళ్లు నా పేరు, నా భర్త పేరూ అడిగారు, కులాలు కూడా అడిగారు. మా ఇంటి పేరు బలాయ్ అని తెలిశాక... (ఎస్సీ అని తెలిసి) నాపై దాడికి దిగారు' అని బాధితురాలు తెలిపింది. తాను వారి కులం అమ్మాయిగానీ, లేదా అగ్ర కులానికి చెందిన అమ్మాయి అయివుంటే తనపై దాడి చేసేవారు కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. దళిత యువతిపై దాడి చేసినా, ఎవరూ శిక్షించరన్న ఉద్దేశంతోనే తనను గ్యాంగ్ రేప్ చేశారని ఆమె అభిప్రాయపడింది. భర్తతో కలిసి షాపింగ్ కోసం తమ గ్రామం నుంచీ బైకుపై బయల్దేరిన ఆ దంపతుల వెనకాలే రెండు బైకులపై వచ్చిన ఐదుగురు వాళ్లను అడ్డుకున్నారు. ఆ జంట బైకును రోడ్డు పక్కన పార్క్ చేసి, ఇద్దర్నీ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇద్దర్నీ చితకబాదారు. ఆతన్ని చెట్టుకు కట్టేసి, ఆమెను గ్యాంగ్ రేప్ చేసి, వీడియో తీశారు. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు.ఆ తర్వాత డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేశారు. పరువుకోసం ముందు ఇచ్చినా, తర్వాత ఇచ్చుకోలేక పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టారు. తాము తీసిన వీడియోను మే 4న వాట్సాప్‌లో షేర్ చేశారు. కొన్ని గంటల్లోనే అది వైరల్ అయ్యింది. దానర్థం ఏంటి తమకు శిక్ష పడదన్న అతినమ్మకంతోనే, కేసు నమోదైన తర్వాత కూడా వాళ్లు వీడియో రిలీజ్ చేశారంటోంది బాధితురాలు.

నేరానికి పాల్పడిన, స్థానికంగా గుజ్జర్ కులానికి చెందిన ఆధిపత్య వర్గాల యువకులు ఐదుగురినీ కఠినంగా శిక్షించాలని, బాధితులకి న్యాయం, రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ మే, 9 న అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ ప్రజా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. దేశంలో హిందుత్వ శక్తులు పెట్రేగిపోతున్నాయని, దళితులు, మైనారిటీలపై దాడులకు తెగపడుతున్నారని వక్తలందరూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇందులో ప్రొ.పద్మజా షా, పింగళి చైతన్య, మెర్సీ మార్గరెట్, దేవి, సంధ్య, ఝాన్సీ, భండారు విజయ, మీనా తదితరులతో పాటు విరసం, పిడియస్‌యు, టి.వి.వి, కుల నిర్మూలన పోరాట సమితి, సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలను, ఎస్సీ కమీషన్ జాతీయ అద్యక్షులను కలిసి., డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరుతూ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో తప్పిదాలకు బాధ్యులను శిక్షించాలి

ఇంటర్ ఫలితాల్లో తప్పిదాలకు బాధ్యులైన వారిపై చర్యలకు డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 29న అఖిలపక్షం చేపట్టిన ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ఫలితాల్లో తప్పులు చోటుచేసుకొని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డా, ప్రభుత్వం తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంపై అఖిలపక్ష పార్టీలు తీవ్రంగా మండిపడ్డాయి. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో పాటు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ విపక్షాలన్నీ ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ ముట్టడిలో విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, బాధిత కుటుంబాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు మద్దతుగా పాల్గొన్నాయి. వందల సంఖ్యల్లో పోలీసులను మోహరించి ఆందోళనకారులను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా విడతల వారీగా విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు సైతం అక్కడికి చేరుకోవడంతో, అక్కడికి వచ్చిన వారిని వచ్చినట్లుగా అరెస్టు చేశారు. కానీ పోలీసుల వ్యూహాలను వమ్ముచేస్తూ వందల సంఖ్యలో విద్యార్థి నాయకులు దూసుకు రావడంతో పోలీసులు సైతం విస్తుపోయారు. ఆందోళనకారులు బారికేడ్‌లు దాటుకుని ఇంటర్‌బోర్డు కార్యాలయం గేటు వద్దకు చేరుకుని కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నించగా, పోలీసులు వారిని అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌కు తరలించారు. అన్ని సంఘాలతో పాటు ఈ ఆందోళనలో ప్రగతిశీల మహిళా సంఘం కూడా పాల్గొన్నది. ఈ సందర్భంగా అరెస్టయిన పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు సంధ్య మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తప్పులకు బాధ్యులెవరో తేలినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. విద్యాశాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఇంటర్‌బోర్డు అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ✿

ఉదయించని ఆకాశం

పాయల మురళీకృష్ణ



ఇంటి నిండా లక్క పట్లు, బల్లి పిల్లలు
పెరటిగుమ్మంపై పొదగబడుతున్న పావురాల గుడ్లు

పట్టీ పట్టని నిద్రలో
తప్పని తుల్లిపాట్లతో
చీకటి విత్తిన మత్తు పక్కలోంచి
తెల్లవారకముందే ఆమె మేల్కొంటుంది
ఉదయాన్నే పేపర్లో
గౌరీసావంత్‌ను చూసి థర్డ్ జెండరైతేనేం
ఒక్కరైనా చాలు కదూ... నిట్టూరుస్తుంది

ఆలా ఆరుబయట వాకిలి తుడుస్తున్నపుడు
బయట కుండీలో మొలిచిన విత్తనాలు పచ్చగా నవ్వుతాయి
అప్పుడే ఆమె పొత్తికడుపులో
ఫెలోపియన్ ట్యూబ్లు రెండూ తెరుచుకునే ఉండటాన్ని
బ్రోమిన్ జలం నిర్ధారించిన రోజు గుర్తుకొస్తుంది

తన ఏడడుగులూ నడిచిన ఎడారి ప్రయాణానికి
సరిగ్గా పదేళ్లు
బడిగంట మోగుతున్నపుడు చెవులు
సర్దిన ఇల్లు సర్దినట్టే ఉన్నపుడు కళ్లు
ఆమెకు అవశేష అవయవాలౌతాయి

మందు బిళ్లలు మింగుతున్న ఎదురు చూపుతో
కాలం కూడా విసిగిపోతుంది

నెలసరి అయిదు రోజులు దాటినా
ప్రెగ్ కలర్ పట్టుకోవాలంటే భయం
ఎప్పుడూ ఒక్కటే ఎర్రని గీత
ఒంటరి మోడులా నిటారుగా

నలుగురు కలిసే చోటుకి దూరమై
ఒంటరిగా మిగిలిన క్షణాల చెంత
ఒక్కో దినాన్నీ ఎంత దుఃఖంతో సాగనంపుతుందో
వైద్యుడి కోసం గంటలు గంటలు వేచి చూసే
సంతాన సాఫల్య కేంద్రానికే తెలియాలి

బీడుబారిన చూపులకు
కదలికల ఉదరం ఎదురుపడితే
పొత్తిళ్లనుండీ నుదుటివరకూ ఏదో సలపరం
గాలిలో ఒక చెయ్యి మాత్రమే
ఊగిసలాడుతున్నట్లు కొట్టుకుంటున్న హృదయ స్పందన

శుక్ర కణాలెన్నో
వాటిలో పోటీ పడేవెన్నో తేల్చుకునేందుకు
మొగుడ్ని వైద్యం ముందు నిలబెట్టాలనుకునే ప్రతీసారీ
ఆమె ఓడిపోతూనే ఉంది
ప్రయోగశాలలా మారిపోయిన గర్భాశయం
అవసరం లేని ఫోలిక్యులార్ స్టడీని ఎదుర్కొంటూనే ఉంది

ప్రతి నెలసరిలోనూ ఒకటోరోజు
నెత్తుటి కన్నీరైన శరీరం
భవిష్యత్తు కాన్వాసు మీద రెండో గీతకు నోచుకుంటుందా

సేద తీర్చాల్సిన నిద్రలో సైతం
కల్లోల స్వప్నాలు
కంటకాల్లాంటి మాటలు
అయినా ఎన్ని శోక సముద్రాలనైనా దాటి వస్తుంది గాని
ఉదయించని ఆకాశానికి శాపవిమోచనం చేసే
పక్షి రెక్కల కోసం
ఆమె ఏమాత్రమూ తొందరపడదు ✿

KLVA106M/70

MAHILA GONTUKA MATRUKA June - 2019 Date of Publication : 2nd, 3rd of every month
Date of Posting : 4th and 5th of every month RNI No. TEL TEL/2014/59091
Postal Reg. No. HSE/1023/2018-2020

హాజీపూర్ గ్రామానికి చెందిన కల్పన, మనీషా, శ్రావణిలను అత్యాచారం చేసి, చంపిన మర్రి శ్రీనివాస్ రెడ్డిని కఠినంగా శిక్షించాలి!



శ్రావణి కుటుంబ సభ్యులతో పీవోడబ్ల్యూ బృందం



మనీషా కుటుంబ సభ్యులతో పీవోడబ్ల్యూ బృందం



కల్పన కుటుంబ సభ్యులతో పీవోడబ్ల్యూ బృందం



ముగ్గురు అమ్మాయిలను అత్యాచారం చేసి, చంపి శవాలను పాతి పెట్టిన సీరియల్ కిల్లర్ శ్రీనివాస్ రెడ్డి బావి

ఇంటర్మీడియట్ అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య



రాజస్థాన్‌లోని అల్వార్‌లో దళిత వివాహిత మహిళపై జరిగిన దురాఘతాన్ని నిరసిస్తూ జరిగిన కార్యక్రమ దృశ్యం



If undelivered please return to

Manager
MAHILA GONTUKA
MATRUKA
H.NO. 35-3-6931 (4)
Com. Madala Narayana Swamy Bhavan
Sanjay Gandhi Colony
Near Sarma College, Ongole - 523 001.
Mobile : 9676206230, Ph. 08592 - 238350

Printed Matter - BOOK POST

June - 2019

To

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHOPPARA PADMA, PRINTED AT NAVYA PRINTERS, 3-6-194, OPP URDU HALL, HIMAYATHNAGAR, HYDERABAD - 500 029, PUBLISHED AT H.NO. 1-9-295/19/A-1, SRILAXMI NILAYAM, VIDYANAGAR, DIST - HYDERABAD, TELANGANA
EDITOR : CHOPPARA PADMA

48

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M170
పుస్తకం పేరు	మాతృక
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	naveeda
పేజీలు విడదీసినది	naveeda
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good